22-8Pg1exHMNWJQEPS:22-8Pg1exHMNWJQEPS.qxd 8/22/2026 12:27 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
తిరుపతి
: fb.com/vaartha Digital
Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
22-8-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 203 పేజీలు: 10+4 వెల: 6.50

బ్రిక్స్ ప్రతినిధులకు ఘన స్వాగతం 3లో

డిగ్రీ ఉన్నా యువతకు ఏవీ ఉద్యోగాలు? 5లో


శుక్రవారం న్యూఢిల్లీలో యువ పారిశ్రామికవేత్తలతో మాట్లాడుతున్న ప్రధాని మోడీ

## ప్రపంచ అంతరిక్ష సాంకేతిక కేంద్రంగా భారత్‌ను మార్చండి

**స్పేస్ సెక్టార్ యువ పారిశ్రామిక వేత్తలకు ప్రధాని మోడీ పిలుపు**

**సేవా తీర్థ్‌లో అంతరిక్ష స్టార్టప్‌ల సిఇఒలు, వ్యవస్థాపకులతో భేటీ**


**దేశంలో విస్తరిస్తున్న ప్రైవేట్ అంతరిక్ష పరిశ్రమ**

**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం ఇక్కడ సేవా తీర్థంలో 20 భారతీయ అంతరిక్ష స్టార్టప్‌ల సిఇఒలు, వ్యవస్థాపకులతో సంభాషించారు. ఈ సందర్భంగా దేశ ప్రైవేట్ అంతరిక్ష పరిశ్రమ పెరుగుతున్న బలాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావిస్తూ, అంతరిక్ష సాంకేతికతకు భారతదేశాన్ని ప్రపంచ కేంద్రంగా నిలపడానికి మరింత సహకారం అవసరమని పిలుపునిచ్చారు. రాకెట్, పునర్వినియోగ సెమీక్రయోజెనిక్ లాంచ్ వెహికల్ అభివృద్ధి, ఏవియానిక్స్, ఉపగ్రహాలు, అధునాతన ప్రొపల్షన్ వ్యవస్థలు, అంతరిక్ష, రక్షణ నిఘా, అంతరిక్ష శిథిలాల తొలగింపు, ఎఐఆధారిత హైపర్‌లోకల్ వాతావరణ, శీతోష్ణస్థితి నిఘా వంటి అనేక రంగాలలో పనిచేస్తున్న స్టార్టప్‌ల సిఇఒలు హాజరయ్యారు. స్టార్టప్ వ్యవస్థాపకులు >>2


శుక్రవారం పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న రాహుల్

## ఢిల్లీలో రాహుల్ మెరుపు ధర్నా 2లో

# పరి'శ్రమిస్తున్నాం!



**పారిశ్రామికవేత్తల్లో నమ్మకం పెంచేలా 28 కొత్త పాలసీలు తెచ్చాం**

**రెండేళ్లలో రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు**

**ఎఫ్‌డిఐలు ఆరున్నర రెట్లు పెరిగాయి**

**పరిశ్రమల ఏర్పాటుతో 11లక్షల మందికి ఉద్యోగావకాశాలు**

**సోషల్ మీడియా వేదికగా సిఎం చంద్రబాబు వెల్లడి**

**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** పారిశ్రామికవేత్తల్లో నమ్మకం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం 28 కొత్త పాలసీలు తీసుకొచ్చిందని సిఎం చంద్రబాబు తెలిపారు. ఈ పాలసీలు సౌలభ్యంగా ఉండటంతో వివిధ రాష్ట్రాలు, దేశాల నుంచి భారీగా పారిశ్రామికవేత్తలు ఎపిలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారన్నారు. వారికి మౌలిక వసతులు కల్పించడంతో పాటు, ఆయా పరిశ్రమలు గ్రౌండింగ్ అయ్యేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలో ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాల లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం అంటూ 'ఎక్స్' వేదికగా సిఎం చంద్రబాబు రాష్ట్రంలో పారిశ్రామీకరణ దిశలో తీసుకుంటున్న చర్యలు వివరించారు. "ఇప్పటికి రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయి. వీటిలో రూ.14లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపాం. దీంతో 11 లక్షల ఉద్యోగాలు వస్తాయి. ఒక ఏడాదిలో దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25శాతం రాష్ట్రానికి రావడం మనపై నమ్మకాన్ని పెంచింది. రెండేళ్లలో ఎఫ్‌డిఐలు ఆరున్నర రెట్లు పెరిగింది. గూగుల్ ఏఐ డాటా సెంటర్, ఆర్సెలార్ మిట్టల్, జెఎస్ డబ్ల్యు స్టీల్, దాల్మియా సిమెంట్, ఎఎం గ్రీన్ అమోనియా, హీరో, రాయల్ ఎన్ ఫీల్డ్, స్వర్ణగిరి గోల్డ్ మైన్ వంటి అనేక ప్రాజెక్టులు వచ్చాయి. రూ.95 వేల కోట్ల విలువైన బిపిసిఎల్ వంటి భారీ ప్రాజెక్టు పట్టాలెక్కుతోంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో 36 రోజుల్లోనే ఆమ్కా డిఫెన్స్ ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చాం. వన్ ఫ్యామిలీవన్ ఎంట్రప్రెన్యూర్ ప్రభుత్వ లక్ష్యం. దీని కోసం అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే 138 పార్కులకు శ్రీకారం చుట్టాం. సమాజంలో ప్రతీ వర్గానికి న్యాయం జరిగేలా చూస్తున్నాం. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకుంటున్నాం. నాణ్యమైన విద్యతో విద్యార్థుల భవితకు పునాదులు వేస్తున్నాం. పొగాకు, కోకో, మామిడి రైతులను మద్దతు ధరతో ఆదుకున్నాం. వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీతో సహకారం అందిస్తున్నాం. లక్ష కోట్లతో రాయలసీమను హార్టికల్చర్ హబ్ చేస్తున్నాం. మదనపల్లెలో త్వరలో హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం చుడతాం. ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేస్తాం. ఆక్వా రంగాన్ని మరింత బలోపేతం చేసేలా చెరువులకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే అందిస్తున్నాం అని సిఎం >>2

## 29 నుంచి సీడ్ యాక్సెస్ రోడ్ మూడో దశ పనులు ప్రారంభం

**రాజధానిలో యుద్ధప్రాతిపదికన నిర్మాణాలు**

**'నిర్మాణ నగరం'గా అమరావతి సాక్షాత్కారం**

**పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ**

**తుళ్లూరులో శివాలయ జీర్ణోద్ధరణ కార్యక్రమానికి హాజరు**



**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలో సీడ్ యాక్సెస్ రహదారి మూడో దశ పనులను ఈనెల 29న ప్రారంభిస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ చెప్పారు. అమరావతి రాజధాని నిర్మాణం వేగంగా సాగుతోందన్నారు. రైతుల త్యాగాలతోనే అమరావతి తిరిగి రాజధానిగా రూపుదిద్దుకుందని, ల్యాండ్ పూలింగ్‌లో తుళ్లూరు రైతులుఎంతో సహకరించారన్నారు. >>2

## వివేకా హత్య కేసు ఇడి సోదాలు

**పులివెందుల, హైదరాబాద్ సహా ఏడు ప్రాంతాల్లో తనిఖీలు**

**కోకాపేటలో ఎంపి అవినాష్‌రెడ్డి ఇంట్లో రూ.24లక్షలు సీజ్**

**పులివెందులలో కీలక పత్రాలు స్వాధీనం, రసీదులు అందజేత**

**హత్యకు నెల రోజుల ముందే రూ.40కోట్ల ఒప్పందం**

**తనిఖీలు చేసినట్లు అధికారికంగా ఇడి అధికారులు వెల్లడి**



శుక్రవారం ఎంపి అవినాష్ రెడ్డి ఇంటి వద్ద తనిఖీలు చేస్తున్న ఇడి అధికారులు

**కడప/పులివెందుల/హైదరాబాద్, ఆగస్టు 21 ప్రభాతవార్త:** మాజీ మంత్రి వై.ఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో వెలుగు చూసిన మనీలాండరింగ్ కోణంపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి) అధికారులు శుక్రవారం తెలుగు రాష్ట్రాల్లో ఏడు చోట్ల సోదాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని కోకాపేట్‌లో కడప ఎంపి అవినాష్ రెడ్డి ఇంటితో పాటు కడప జిల్లాలోని పులివెందులలో ఆయన ఇంట్లోనూ ఈ సోదాలు జరిగాయి. మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఓవైపు సిబిఐ విచారణ తుది దశకు చేరుకుని కోర్టు విచారణ మొదలవగా అనూహ్యంగా ఇడి రంగంలో దిగింది. ఈ కేసుకు సంబంధించి సిబిఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్, చార్జిషీట్ ఆధారంగా ఇడి అధికారులు ఇసిఐఆర్‌ను నమోదు చేశారు. దీని ఆధారంగా వివేకానంద రెడ్డి హత్య కేసులో ఇడి అధికారులు శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని కోకాపేట్‌లో మొదట అవినాష్ రెడ్డి ఇంట్లో సోదాలు చేపట్టారు. ఇదే సమయంలో మరో బృందం పులివెందులలో గల మరో ఇంట్లోనూ సోదాలు నిర్వహించారు. ఈ సమయంలో పులివెందులలోని అవినాష్ రెడ్డి ఇంటికి తాళం వేసి వుండగా ఆయన చిన్నాన మనోహర్ రెడ్డిని పిలిపించి తాళాలు తీయించారు. దీని తరువాత ఆ ఇంట్లో సోదాలు చేపట్టి కొన్ని పత్రాలను జప్తు చేశారు. తేలూరు తుమ్మలపల్లిలోని ఎర్ర గంగిరెడ్డి నివాసంలో, పులివెందులలోని నారాయణ కళాశాల సమీపంలోని యాదాటి సునీల్ యాదవ్ నివాసంలో, భాకరాపురంలోని షేక్ దస్తగిరి నివాసంలోను, సుజాత హాల్ సమీపంలోని దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిలకు సంబంధించిన నివాసాల్లో, అలాగే వైఎస్ భాస్కర్‌రెడ్డి నివాసప్రదేశాల్లోనూ సోదాలు నిర్వ హించారు. ఈ తనిఖీల సందర్భంగా అధికారులు ఇళ్లలోని >>2

## టర్కీ సంచలన నిర్ణయం

**ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుపై అంతర్జాతీయ అరెస్ట్ వారెంట్**

**అంకారా, ఆగస్టు 21:** గాజా కోసం వెళ్లిన కార్యకర్తలను ఇజ్రాయెల్ అడ్డుకున్న ఘటనపై జరుగుతున్న దర్యాప్తులో భాగంగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై అంతర్జాతీయ అరెస్ట్ వారెంట్ జారీ చేసినట్లు టర్కీ ప్రకటించింది. ఈ విషయాన్ని టర్కీ న్యాయశాఖ మంత్రి అకిన్ గుర్లెక్ శుక్రవారం వెల్లడించారు. గాజాలో హమాస్‌పై ఇజ్రాయెల్ చేపట్టిన యుద్ధంలో మారణహోమంకు పాల్పడిందన్న ఆరోపణలపై >>2





**చిత్రసీమలో మరో విషాదం**

## షావుకారు జానకి ఇక లేరు

**వృద్ధాప్య సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత**

**రాజమండ్రి నుంచి 'ఆకాశవాణి' ద్వారా వెండితెరకు**

**రేడియో జాకీగా కెరీర్ ప్రారంభం.. 'షావుకారు' చిత్రంతో సినీపరిశ్రమకు పరిచయం**

**భాషల సరిహద్దులు దాటిన నటనా ప్రతిభ**


**బుల్లితెర సీరియల్స్‌లోనూ 'షావుకారు జానకి'**

**చివరగా 'అన్నీ మంచి శకునములే' సినిమాలో**

**సినీప్రముఖులతోపాటు సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్ కల్యాణ్, మంత్రులు సంతాపం**

**నేడు చెన్నైలో అంత్యక్రియలు**

**చెన్నై, ఆగస్టు 21:** ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి (94) కన్నుమూశారు. చెన్నైలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. కొంత కాలంగా జానకి శ్వాసకోశ, వృద్ధాప్య సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో ఇటీవల మరోసారి ఆమె తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో జానకిని ఆమె కుటుంబ సభ్యులు చెన్నైలోని కావేరి ఆస్పత్రిలో చేర్పించారు. కొద్ది రోజులుగా ఆమె ఆరోగ్యం మరింత క్షీణిస్తూ వచ్చింది. ఈ క్రమంలో ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న ఆమె శుక్రవారం మధ్యాహ్నం 1.59 గంటలకు కన్నుమూశారు. ఈ మేరకు నడియార్ సంఘం అధ్యక్షుడు నాజర్ ఓ ప్రకటన చేశారు. జానకి మృతితో దక్షిణాది సినీపరిశ్రమ దిగ్భ్రాంతికి గురైంది. సినీ, రాజకీయ ప్రముఖులు జానకి మృతిపట్ల సంతాపం తెలిపారు. జానకి పార్థివదేహాన్నిసాయంత్రం 5గంటలకు తేనాం పేటలోని సెంటాఫ్ రోడ్‌లోని నివాసానికి తరలించారు. సిని ప్రముఖులంతా >>2



శుక్రవారం న్యూఢిల్లీలో యువపారిశ్రామికవేత్తలతో ప్రధాని మోడీ

# భారత్‌ను మార్చండి

>> భారతదేశ ప్రైవేట్ అంతరిక్ష రంగం సాధించిన వేగవంతమైన పురోగతిని ప్రముఖంగా ప్రస్తావిస్తూ, దాని భవిష్యత్తుపై తమ దార్శనికతను పంచుకున్నారు. ప్రధానమంత్రి, ప్రభుత్వం అందించిన మద్దతుకు కృతజ్ఞతలు తెలుపుతూ, తమ కంపెనీలు స్వదేశీంగా సామర్థ్యాలను, సాంకేతికతలను అభివృద్ధి చేయడానికి గణనీయమైన సమయాన్ని, కృషిని వెచ్చించాయని వారు తెలిపారు. ప్రభుత్వ మద్దతు, కంపెనీల మధ్య సహకారం ద్వారా బలమైన పర్యావరణ వ్యవస్థ ఏర్పడుతోందని సిఇఒలు వివరించారు. అంతరిక్ష రంగంలో ప్రతిష్టాత్మక లక్ష్యాలను సాధించడానికి తమ బృందాలు అత్యంత ప్రేరణతో, పట్టుదలతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. అంతరిక్ష రంగాన్ని ప్రైవేట్ భాగస్వామ్యానికి తెరవాలన్న నిర్ణయం గణనీయమైన ఉత్సాహాన్ని రేకెత్తించి, భారత పరిశ్రమకు కొత్త అవకాశాలను సృష్టించిందని వ్యవస్థాపకులు గుర్తుచేసుకున్నారు. అభివృద్ధి చెందుతున్న ప్రైవేట్ అంతరిక్ష పరిశ్రమ అభివృద్ధి చేసిన సాంకేతికతలను స్వీకరించడానికి, వినియోగించుకోవడానికి ఇప్పుడు అనేక కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయని కూడా వారు పేర్కొన్నారు. అంతరిక్ష రంగ నాయకుల ధైర్యాన్ని, చొరవను అభినందిస్తూ, ప్రైవేట్ కంపెనీలు ప్రదర్శించిన విశ్వాసం, ఈ రంగాన్ని ప్రైవేట్ భాగస్వామ్యానికి తెరవడం వెనుక ఉన్న దార్శనికతను బలోపేతం చేసిందని ప్రధానమంత్రి మోడీ అన్నారు. అనేక దేశాలకు అంతరిక్ష రంగంలో పెట్టుబడులు పెట్టడానికి వనరులు లేవని లేదా అటువంటి పెట్టుబడులు పెట్టడానికి ఇష్టపడటం లేదని, ఇది ప్రపంచ అంతరిక్ష పరిశ్రమలో భారతదేశం తన స్థానాన్ని వేగంగా బలోపేతం చేసుకోవడానికి ఒక పెద్ద అవకాశాన్ని సృష్టిస్తోందని ప్రధానమంత్రి సూచించారు. తమ సాంకేతిక పరిజ్ఞానాల కొత్త అనువర్తనాలను అన్వేషించాలని, ప్రజల జీవితాలను సులభతరం చేసే పరిష్కారాలను అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టాలని ప్రధాని మోడీ అంతరిక్ష సంస్థలను ప్రోత్సహించారు. అంతరిక్ష స్టార్టప్‌లు, ఇతర రంగాలలో పనిచేస్తున్న కంపెనీల మధ్య మరింత సహకారం ఉండాలని ప్రధాని పిలుపునిచ్చారు. అంతరిక్ష శిథిలాలపై పనిచేస్తున్న కంపెనీలు తమ సాంకేతిక పరిజ్ఞానాల వినియోగాన్ని విస్తరించుకోవడానికి పర్యావరణ సంస్థలతో కలిసి పనిచేయవచ్చని ప్రధాని మోడీ సూచించారు. అదేవిధంగా, వ్యవసాయ రంగంలో పనిచేస్తున్న అంతరిక్ష సాంకేతిక కంపెనీలు, రైతులు మరింత మెరుగైన నిర్ణయాలు తీసుకుని ఉత్పాదకతను మెరుగుపరచుకోవడంలో సహాయపడటానికి వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ శాఖలతో భాగస్వామ్యం కుదుర్చుకోవచ్చని సూచించారు.

# ఢిల్లీలో రాహుల్ మెరుపు ధర్నా

## జంతర్ మంతర్ ఆందోళనల్లో పెల్లెంట్ గన్‌ఫైరింగ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రాహుల్ డిమాండ్

## పోలీసులు నిరాకరించండంతో పార్లమెంటు స్ట్రీట్ పోలీసు స్టేషన్ వద్ద ధర్నా

**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** ఢిల్లీలో గత నెల 20వ తేదీన కాక్రోచ్ జనతా పార్టీ నిర్వహించిన పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థులపై పోలీసులు చేసిన దాడుల్లో పెల్లెట్ గన్ లను ప్రయోగించారు. దీంతో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. అయితే వీటిపై ఇప్పటివరకూ పోలీసులు ఎఫ్ఐఆర్ లు నమోదు చేయలేదు. ఈ నేపథ్యంలో అలా పెల్లెట్ గన్ ఫైరింగ్ లో గాయపడిన ఓ విద్యార్థిని తీసుకుని ఇవాళ లోక్ సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ నేరుగా పోలీసు స్టేషన్ కు వెళ్లారు. అక్కడ ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడంపై పోలీసుల్ని ప్రశ్నించారు. అయినా పోలీసులు మాత్రం ఎఫ్ఐఆర్ నమోదుకు నిరాకరించారు. దీంతో రాహుల్, ప్రియాంక, మరో కాంగ్రెస్ సీనియర్ నేత సల్మాన్ ఖుర్షీద్ తో కలిసి పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్ ఆవరణలోనే ధర్నాకు దిగారు. పోలీసులు పెల్లెట్ గన్ ల ప్రయోగంపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేంతవరకూ కదిలేది లేదంటూ వీరు అక్కడే భైఠాయించారు. దీంతో పోలీసులు ఉన్నతాధికారుల్ని సంప్రదించారు. ఇప్పటికే సుప్రీంకోర్టు ఈ పెల్లెట్ గన్ ల ప్రయోగంపై విచారణ జరుపుతున్న నేపథ్యంలో తాము ఎఫ్ఐఆర్ నమోదు చేయడం నిబంధనలకు విరుద్ధమని పోలీసులు కాంగ్రెస్ నేతలకు తెలిపారు. దీంతో సంతృప్తి చెందని రాహుల్, ప్రియాంక ధర్నా కొనసాగించారు. మరోవైపు ఒత్తిడి అంతకంతకూ పెరుగుతుండటంతో పార్లమెంట్ స్ట్రీట్ పోలీసులు ఫిర్యాదు దారు అయిన సాహిల్ నుంచి ఫిర్యాదు తీసుకుని ఆమోదించినట్లు ఓ ప్రకటన చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన రాహుల్ పెల్లెట్ గన్ ల ప్రయోగంపై ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయడం లేదని పోలీసుల్ని ప్రశ్నించారు. పోలీసులు తాము పెల్లెట్ గన్ లు వాడలేదని చెప్పడంపై స్పందిస్తూ పోలీసులు కాకపోతే ఇంకెవరు వాడారని నిలదీశారు. ఈ కేసులో దర్యాప్తు అధికారి ఎవరని రాహుల్ ప్రశ్నించారు. తమకు ఉన్నతాధికారుల నుంచి ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా ఆదేశాలు ఉన్నట్లు పార్లమెంట్ స్ట్రీట్ స్టేషన్ పోలీసులు రాహుల్ గాంధీకి తెలిపారు. దీనిపై స్పందించిన రాహుల్ అసలు ఈ కేసులో హోంమంత్రి అమిత్ షాను ఎందుకు బాధ్యుడిని చేయడం లేదని అడిగారు.

# టర్కీ సంచలన నిర్ణయం

>> నెతన్యాహుతో పాటు పలువురు ఇజ్రాయెల్ ఉన్నతాధికా రులపై టర్కీ ఇప్పటికే అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. ఇజ్రాయెల్ మాత్రం మారణహోమం ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తోంది. బెంజమిన్ నెతన్యాహు తదితరులపై జారీ చేసిన అరెస్ట్ వారెంట్లకు అనుగుణంగా వారిపై ఇంటర్‌పోల్ రెడ్ నోటీసులు జారీ చేయాలని న్యాయశాఖ, అంతర్గత వ్యవహారాల మంత్రిత్వశాఖను కోరింది. తద్వారా వారిని అంతర్జాతీయంగా గుర్తించి, వెతికేందుకు వీలు కలుగుతుందని గుర్లెక్ తెలిపారు. సిరియాలో టర్కీ సైనిక స్థావరంపై నెతన్యాహు హెచ్చరిఇదిలా ఉండగా, సిరియాలో టర్కీ సైనిక స్థావరాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తోందన్న ఆరోపణలపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్పందించారు. టర్కీ తన సైనిక ఉనికిని దక్షిణ దిశగా విస్తరించడాన్ని ఇజ్రాయెల్ సహించబోదని హెచ్చరించారు. టర్కీ సైనిక స్థావరం దక్షిణ దిశగా విస్తరించడాన్ని మేం సహించం. అది మాకు ముప్పు కలిగిస్తుంది. ఈ విషయాన్ని మేం స్పష్టంగా తెలియజేశామని నెతన్యాహు ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. అలెప్పో సమీపంలోని టర్కీ నియంత్రణ రేఖకు దక్షిణంగా ఉన్న ఓ విమానాశ్రయంలో టర్కీ తన సైనిక స్థావరాన్ని ఏర్పాటు చేసుకునే ఉద్దేశంతో ఉందన్న సమాచారం తమకు అందిందని ఆయన తెలిపారు. దీంతో టర్కీకి స్పష్టమైన సందేశం పంపినట్లు చెప్పారు. అలెప్పో సమీపంలో టర్కీ తన పరిధికి దక్షిణంగా ఉన్న ఓ విమానాశ్రయంలో స్థావరం ఏర్పాటు చేసుకునే ఉద్దేశంతో ఉందని మాకు తెలిసింద నెతన్యాహు అన్నారు. టర్కీకి ఆ సందేశం చేరిందా అని ప్రశ్నించగా సందేశం చేరింది. కానీ వారు దాన్ని సరిగ్గా అర్థం చేసుకున్నట్లు కనిపించలేదు. అందుకే వారు మరింత స్పష్టంగా అర్థం చేసుకునేలా చర్యలు తీసుకున్నామని నెతన్యాహు వ్యాఖ్యానించారు. సిరియా విమానాశ్రయంపై ఇజ్రాయెల్ వైమానిక దాడులునెతన్యాహు వ్యాఖ్యలకు ముందు సిరియాలోని తూర్పు ఇడ్లిబ్ ప్రావిన్స్‌లో ఉన్న అబు అల్ దుహుర్ సైనిక విమానాశ్రయంపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసింది. అలెప్పో సమీపంలోని ఓ వైమానిక స్థావరంలో టర్కీ సైనికులను మోహరించే అవకాశం ఉందన్న ఆందోళనల నేపథ్యంలోనే ఈ దాడులు జరిగినట్లు నెతన్యాహు కార్యాలయం గతంలో వెల్లడించింది.

## తెలంగాణలో ఎమ్మెల్యేల అనర్హత కేసు

# సెప్టెంబర్ 16న హైకోర్టు తీర్పు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు21:** పార్టీ ఫిరాయింపులకు సంబంధించి ఎమ్మెల్యేలపై దాఖలైన కేసుపై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. తమ పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీచేసి గెలిచాక అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ దాఖలు చేసిన వ్యాజ్యాలపై గురువారం కూడా హైకోర్టులో వాదనలు కొనసాగాయి. ఇరువర్గాల తుది వాదనలు శుక్రవారం పూర్తయ్యాయి. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. తీర్పును సెప్టెంబర్ 16న వెల్లడిస్తామని ధర్మాసనం ప్రకటించింది. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన తొమ్మిది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్, ఎమ్మెల్యేలు వేసిన పిటిషన్లను ట్రిబ్యునల్ చైర్మన్ హోదాలో స్పీకర్ కొట్టివేశారు. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్,బిజెపి ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించారు.

## అమిత్‌షా పర్యటనతో మెత్తబడిన టివికె, డిఎంకె

**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లు విషయంలో కేంద్రం ఏం చేయనుందన్న అంశంపై ప్రస్తుతం ఉత్కంఠ నెలకొంది. ఈ వర్షాకాల సమావేశాల్లోనే బిల్లు పెడతారన్న అంచనాలు మొదట్లో వెలువడినా పేపర్ లీక్ అంశం వివాదాస్పదం కావడంతో డీలిమిటేషన్ అంశం తెరమరుగైనట్టు కనిపించింది. డీలిమిటేషన్ కోసం కేంద్రం ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందన్న అంచనాలు ప్రస్తుతం వెలువడుతున్నాయి. దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో అమిత్ షా నియోజకవర్గ పునర్విభజన అంశాన్ని ప్రస్తావించారు. డీలిమిటేషన్‌ను మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్న తమిళనాడు సీఎం ఈ సమావేశం తరువాత మెత్తబడినట్టు ప్రచారం మొదలైంది.

# పరి'శ్రమిస్తున్నాం'!

>>వివరించారు. **మహిళా సాధికారతకు పెద్దపీట:** మహిళా సాధికారత కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. స్వయం బ్రాండ్ పేరిట వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నాం. ఎపిలో పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇవ్వటం ద్వారా పెట్టుబడులు సాధిస్తున్నాం. రెండేళ్లలో రూ.19,390 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. బీచ్‌టూరిజం, టెంపుల్, హోమ్ స్టేలను ప్రోత్సహిస్తున్నాం. ప్రజలకు పాలన దగ్గర చేసేందుకు మార్కాపురం, పోలవరం జిల్లాలను ఏర్పాటు చేశాం. అన్నమయ్య జిల్లాకు మదనపల్లెను కేంద్రంగా మార్చాం. వారసత్వంగా వచ్చిన ఆస్తులు, భూమిపై హక్కులు కాపాడేలా రెవెన్యూలో సంస్కరణలు తెచ్చాం. రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేస్తున్నాం. ఉచిత ఇసుక విధానంతో నిర్మాణ రంగాన్ని బలోపేతం చేశాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్, నాలా చట్టాన్ని రద్దు చేశాం. ఇవన్ని రాష్ట్రంలో పరిశ్రమలు అభివృద్ధి దిశలో తీసుకున్న చర్యల్లు అని సిఎం చంద్రబాబు వివరించారు. ఎక్స్ లోనే మరో పోస్టులో ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంతో సంజీవని తీసుకువచ్చామని సిఎం చంద్రబాబు తెలిపారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలవుతుంది. సిఎం సహాయ నిధి ద్వారా ఇప్పటి వరకూ రూ.1,631 కోట్లు వ్యయం చేసి పేదల్ని ఆదుకున్నాం. అన్నదాత సుఖీభవ కింద ప్రతిరైతుకూ రూ.20 వేలు అందిస్తున్నామని వివరించారు. రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టులను శరవేగంగా నిర్మిస్తున్నామని తెలిపారు. జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం ఉప్పాడలో ఆధునిక ఫిషింగ్ హార్బర్లను నిర్మిస్తున్నాం. ఉత్తరాంధ్రలో అల్లూరి ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు ప్రారంభించాం. రాష్ట్రంలో రూ.64 వేల కోట్ల రైల్వే పనులు, రూ.38 వేల కోట్ల హైవే పనులు జరుగుతున్నాయి. పోర్టులు, ఎయిర్‌పోర్టులు, హార్బర్లు, హైవేలు, రైల్వే లేన్లతో రాష్ట్రం లాజిస్టిక్స్‌కు హబ్ అవుతుంది. ఐదున్నర కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా రాజధాని అమరావతి నిర్మాణం చేపట్టాం. బ్లూ గ్రీన్ సిటీగా డీప్ టెక్ క్యాపిటల్‌గా, కార్బన్ న్యూట్రల్, నో పోల్ సిటీగా అమరావతి ప్రపంచ స్థాయి నగరంగా నిర్మితం అవుతుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

**స్థానిక పాలనలో ఎపి దేశానికే ఆదర్శం:** "పల్లెపండుగ, అడవి తల్లి బాట కింద గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం చేపట్టాం. ఎపిని 50శాతం గ్రీన్ కవర్ తెచ్చేలా ప్రయత్నం చేస్తున్నాం. చెత్తపన్ను రద్దు చేసి లెగసీ వేస్ట్ తొలగించాం. స్వచ్ఛ రథం వంటి వినూత్న కార్యక్రమాలు చేపట్టాం. విద్యుత్ రంగంలోనూ వెలుగులు తెచ్చాం. ట్రూ డౌన్ చేసి ట్రూ అప్ భారాన్ని భరిస్తున్నాం. గ్రీన్ ఎనర్జీ లక్ష్యంలో 112 గిగావాట్ల ప్రాజెక్టులు అందుబాటులోకి తీసుకుని వస్తున్నాం' అని సిఎం చంద్రబాబు వెల్లడించారు.

# వివేకా హత్య కేసు: ఇడి సోదాలు

>>ఆస్తులకు సంబంధించిన వివరాలు, వివిధ డాక్యుమెంట్లు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన సమాచారాన్ని పరిశీలించినట్లు తెలుస్తోంది. సుమారు ఐదు నుంచి ఆరు గంటల పాటు సోదాలు కొనసాగించగా ఒక్క దస్తగిరి ఇంటిలో మాత్రం ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు సుదీర్ఘంగా సోదాలు నిర్వహించారు. వివేకానంద రెడ్డి హత్య కేసులో సిబిఐ దాఖలు చేసిన పత్రాలలోనూ అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరి ఇచ్చిన వాంగ్మూలంలో రూ.40 కోట్లకు సంబంధించిన ఒప్పందం/ లావాదేవీ ప్రస్తావన ఆధారంగా రూ.40 కోట్ల సుపారీకి సంబంధించిన విషయాలపై విచారణ చేపట్టి మనీల్యాండరింగ్ జరిగినట్టు చార్జిషీట్‌లో సిబిఐ పేర్కొంది. ఈ ఆర్థిక కోణంపైనే కేసు నమోదు చేసి ఇడి ప్రస్తుతం దర్యాప్తు సాగిస్తోంది. ఈ సందర్భంగా అధికారులు పలు డాక్యుమెంట్లు, ఆస్తుల వివరాలను పరిశీలించినట్లు సమాచారం. సోదాల సందర్భంగా కోకాపేట్‌లోని అవినాష్ రెడ్డి ఇంట్లో లెక్కలో చూపని రూ.24 లక్షలు సహా కీలక పత్రాలను, రెండు బ్యాంకు లాకర్ల తాళాలను ఇడి అధికారులు జప్తు చేశారు. దీనికి సంబంధించిన రసీదును ఇంట్లోని వారికి ఇచ్చారు.

**ఎటువంటి డాక్యుమెంట్లు తీసుకెళ్ళలేదు: వైయస్ మనోహర్ రెడ్డి:** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఉదయం ఎంపి వైయస్ అవినాష్ రెడ్డి ఇంటికి వచ్చారని, ఇంట్లో ఎవరూ లేకపోవడంతో అధికారులు నన్ను పిలిపించగా ఎంపి అవినాష్ రెడ్డితో మాట్లాడి తాళాలను తీశానని వైఎస్ మనోహర్ రెడ్డి మీడియాకు తెలిపారు. ఇంటి పత్రాలు, భూములకు సంబంధించిన పత్రాలు అధికారులు పరిశీలించారని వివరించారు. అంతేతప్ప ఎటువంటి డాక్యుమెంట్లు తీసుకెళ్ళలేదని తెలిపారు. వివేకా హత్య కేసులో మీ పేరు ఉందా? రూ.40 కోట్లు ఎలా ఇచ్చారు? అని ప్రశ్నించారు, కేసులో నా పేరుంది, అంత డబ్బులు ఎందుకు ఇస్తామని సమాధానం ఇచ్చానని చెప్పారు. అంతకు మించి ఏమి అడగలేదు, ఏమి తీసుకెళ్ల లేదు అని వైయస్ మనోహర్ రెడ్డి తెలిపారు.

వివేకానంద రెడ్డి హత్య 2019 మార్చి 15వ తేదీన జరగగా అంతకు నెల రోజుల ముందుగానే కుట్రదారులు దీనికి పథకం రచించారని ఇడి అధికారులు తెలిపారు. వివేకానంద రెడ్డి హత్యకు రూ.40 కోట్ల డీల్ కుదిరిందని, ఇందుకోసం దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి కీలకంగా వ్యవహరించినట్లు తేలిందని ఇడి అధికారులు తెలిపారు. రూ.40 కోట్ల డీల్‌లో రూ.5 కోట్లు దస్తగిరికి ఇచ్చేందుకు దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి మొగ్గు చూపాడని ఇడి అధికారులు తెలిపారు. సోదాల సందర్భంగా ఆయా ప్రాంతాలలో వున్న వారిని విచారించిన ఇడి వారి వాంగ్మూలం తీసుకుంది. ఈ కేసులో మరోదఫా సోదాలు జరిగే వీలుందని సమాచారం.

# మూడో దశ పనులు ప్రారంభం

>>శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అమరావతి నిర్మాణ ప్రాంగణాల్లో ఇప్పుడు పగలు, రాత్రి అనే తేడా లేకుండా పనులు పరుగులు పెడుతున్నాయి. ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో వంద మీటర్ల ఎత్తైన భారీ క్రేన్లు, ఆకాశానికే కాంతి తోరణాలు కడుతున్నట్లుగా కనిపిస్తున్నాయి. జాతరలోని ప్రభలను తలపించే ఈ వెలుగులు రాజధాని పరిధిలోని గ్రామాలకూ స్పష్టంగా కనిపిస్తూ నిర్మాణ జోరును చాటుతున్నాయి. వాతావరణం అనుకూలించడంతో నిర్మాణ సంస్థలు పనుల వేగాన్ని మరింత పెంచాయి. ప్రభుత్వం, సిఆర్‌డిఎ నిర్దేశించిన గడువుల్లో ఐకానిక్ భవనాలను పూర్తి చేయడమే లక్ష్యంగా కాంట్రాక్ట్ సంస్థలు షిఫ్టుల వారీగా పనులు కొనసాగిస్తున్నాయి. జిఎడి టవర్, నాలుగు హెచ్ఒడి టవర్ల వద్ద రాత్రివేళల్లోనూ భారీ స్థాయిలో పనులు సాగుతుండటంతో అమరావతి ఇప్పుడు 'నిర్మాణ నగరం'గా కళ్లముందు సాక్షాత్కరిస్తోంది. అమరావతి ఐకానిక్ సెక్రటేరియట్ టవర్ల నిర్మాణంలో అత్యాధునిక డయాగ్రిడ్ టెక్నాలజీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. కింద నుంచి పైవరకు ఏడు నుంచి తొమ్మిది డైమండ్ ఆకృతులు వచ్చేలా ప్రత్యేక ఇంజినీరింగ్ డిజైన్‌తో ఈ టవర్లను నిర్మిస్తున్నారు. ఏటవాలుగా ఏర్పాటు చేసే డయాగ్రిడ్ పిల్లర్లు ఒకచోట కలిసి, మళ్లీ విడిపోయి పక్కనున్న పిల్లర్లతో అనుసంధానమవుతూ భవనానికి అపూర్వమైన బలం, రూపాన్ని అందిస్తాయి. ఒక్కో డైమండ్ నిర్మాణాన్ని ఆధారంగా చేసుకుని ఆరు అంతస్తుల చొప్పున నిర్మాణాన్ని పైకి తీసుకెళ్తున్నారు. అమరావతిలో రైతుల రిటర్నబుల్ ప్లాట్లలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, ప్రతి నెలా ప్రాజెక్టుల వారీగా భవనాలను పూర్తి చేసి ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు. ప్రస్తుతం స్పోర్ట్స్ సిటీ, రైల్వే ట్రాక్, ఇన్నర్ రింగ్ రోడ్డుపై దృష్టి పెట్టామని, 15 రోజుల్లో సీడ్ యాక్సెస్ రోడ్డును జాతీయ రహదారికి కలిపే మూడో విడత ఎలివేటెడ్ కారిడార్ పనులు ప్రారంభిస్తామని నారాయణ వెల్లడించారు. రాజధాని నిర్మాణంలోభాగంగా ప్రస్తుతం ఇన్నర్ రింగ్ రోడ్డు రైల్వే లైన్ నిర్మాణంపై దృష్టి సారించామని, తర్వాత విమానాశ్రయం నిర్మాణంపై నిర్ణయం తీసుకుంటామని మంత్రి చెప్పారు. ఇకపై ప్రతి నెలా ఒక్కో టవర్ నిర్మాణం పూర్తి చేస్తామని మంత్రి నారాయణ వెల్లడించారు.

ఇక తుళ్లూరులో వందల యేళ్ల చరిత్ర కలిగిన శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి, శ్రీ బాలకోటేశ్వర స్వామి ఆలయ పునఃశంకుస్థాపన మహోత్సవానికి హాజరైన మంత్రి నారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు ఇదే ఆలయం నుంచి రైతులు న్యాయస్థానం టు దేవస్థానం పాదయాత్ర ప్రారంభించి విజయం సాధించారని మంత్రి నారాయణ గుర్తు చేశారు.

# షావుకారు జానకి ఇక లేరు

>> ఆమెకు అక్కడే తుది నివాళులు అర్పిస్తున్నారు. అయితే అభిమానులు, శ్రేయోభిలాషులు, సినీ రంగానికి ప్రముఖులు అక్కడికి భారీగా చేరుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు తేనాంపేట సెంటాఫ్ రోడ్ ప్రాంతంలో గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేసారు. షావుకారు జానకి ఆంధ్రప్రదేశ్ రాజమహేంద్రవరంలో 1931 డిసెంబర్ 12న జన్మించారు. చిన్నతనంలోనే నాటకాల్లో ఆయా పాత్రలు పోషించారు. ఆమె ప్రముఖ నటి కృష్ణకుమారికి చెల్లెలు కూడా. 11ఏళ్లకే రేడియోలో ఒక తెలుగు కార్యక్రమంలో జానకి పాల్గొన్నారు. ఇక 1949లో రక్షా రేఖ తెలుగు చిత్రంతో తెరంగేట్రం చేశారు. ఆ తర్వాత రెండో సినిమా షావుకారుతో ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. దీంతో ఆ సినిమా టైటిల్‌నే ఇంటి పేరుగా మార్చుకున్నారు జానకి. ఇకతెలుగు, తమిళ, కన్నడభాషల్లో 400కు పైగా చిత్రాల్లో జానకి నటించారు. ఆమె ప్రముఖ నటులు ఎన్టీఆర్, ఏఎన్ఆర్, ఎంజీఆర్, శివాజీ గణేశన్ సినిమాల్లో హీరోయిన్‌గా నటించారు. జానకి చివరగా 2023లో వచ్చిన అన్నీ మంచి శకునములే సినిమాలో కనిపించారు. కాగా జానకి అంత్యక్రియలను శనివారం చెన్నైలోని బీసెంట్‌నగర్ క్రిమెటోరియంలో నిర్వహిస్తారు.

జానకికి షావుకారు సినిమాలో బీఎన్ రెడ్డి అవకాశం ఇచ్చారు. 73 ఏళ్లుగా తెలుగునాట ప్రేక్షకులకు ఆమె సుపరిచితురాలు. జానకి సినీప్రస్థానం ఓ అద్భుతం. తన డైలాగ్ డెలివరీతో జానకి ఇండస్ట్రీలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ఇక సంసారం ఒక చదరంగంలో చిలకమ్మ పాత్ర ఆమె కెరీర్‌లో గుర్తుండిపోయే పాత్రల్లో ఒకటిగా చెప్పవచ్చు. అప్పట్లో జానకి వరుసగా సినిమాలు చేసేవారు. 1955లో ఏకంగా 11 సినిమాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారు. అదే ఏడాది వచ్చిన రోజులు మారాయి సినిమా ఆమె సినీజీవితాన్ని మారిపోయింది. ఇక ఆమె నటించిన ఏది నిజం సినిమాకు ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా జాతీయ బహుమతి లభించింది.

1952లో వలయపతితో తమిళ ప్రేక్షకులను కూడా అలరించారు. ఇక 1962 తర్వాత షావుకారు జానకి సహాయ చిత్రాల్లోనే నటిస్తున్నారు. ఆమె చివరిసారిగా 2023లో సంతోశ్ శోభన్ లీడ్ రోల్‌లో తెరకెక్కిన అన్నీ మంచి శకునములే సినిమాలో కనిపించారు.

సుదీర్ఘ కెరీర్‌లో 400 పైగా సినిమాల్లో నటించిన షావుకారు జానకిని కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. అలాగే ఆమె కళైమామణి, నంది, రాజ్యోత్సవ అవార్డు, సైమా లైఫ్‌టైమ్ అఛీవ్‌మెంట్ పురస్కారం అందుకున్నారు. జానకి ఒక్కరే కాదు, స్వయానా తన చెల్లెలు కృష్ణకుమారిని కూడా సినిమాల్లోకి తీసుకొచ్చారు. ఆమె 90ల్లో హీరోయిన్‌గా రాణించారు. కెరీర్‌లో 150కి పైగా సినిమాల్లో నటించారు. ఇందులో ఆమె నందమూరి తారకరామారావు, అక్కినేని నాగేశ్వరరావుతో స్క్రీన్ షేర్ చేసుకున్నారు.



అసోంలో భారీ వరదలలో చిక్కుకున్న బాధితులను రిక్షాలో తరలిస్తున్న దృశ్యం

# తెలంగాణ మంత్రి వినూత్న నిరసన!

## పెంట్లవెల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో టాయ్‌లెట్స్ శుభ్రం చేసిన మంత్రి జూపల్లి

## అధికారుల నిర్లక్ష్యంపై నిరసన చర్య

**కొల్లాపూర్,ఆగస్టు21,ప్రభాతవార్త :** పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారుల నిరక్ష ్యంపై వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండల కార్యాలయంలోని టాయిలెట్స్ అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన మంత్రి స్వయంగా తానే దానిని శుభ్రం చేసి అధికారులకు కనువిప్పు కలిగించారు. పెంట్లవెల్లి రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అక్కడ దరఖాస్తులు, ఫైళ్ల పరిష్కారంలో జరుగుతున్న జాప్యంపై ఆయన ఆరా తీశారు. అధికారుల పనితీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన మంత్రి, ఆర్డీఓతో పాటు ఇతర సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పెండింగ్ ఉంచి, వారిని కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం సరికాదని మందలించారు. ఇకనైనా పనితీరును మార్చుకోవాలి హితవు పలికారు.



అదే సమయంలో కార్యాలయంలోని మరుగుదొడ్లు అత్యంత అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన మంత్రి.. సిబ్బంది నిరక్ష్యాన్లికి నిరసనగా ఆయనే స్వయంగా నీళ్లు పోసి మరుగుదొడ్లను శుభ్రం చేశారు. ఉన్నత హోదాలో ఉన్న మంత్రి స్వయంగా ఈ పని చేయడంతో అక్కడి సిబ్బంది అవాక్కయారు. అనంతరం పారిశుద్ధ్య సామగ్రి, టైల్స్ ఏర్పాటుకు తన వంతుగా తక్షణ ఆర్థిక సహాయం అందించారు. కార్యాలయ పరిసరాలతో పాటు టాయిలెట్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. ప్రజలకు అందించే సేవల్లో జాప్యం లేకుండా చూడటంతో పాటు కార్యాలయాల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం అధికారుల బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. పెంట్లవెల్లి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు లబ్ధిదారులు ప్రస్తుతం నివసిస్తున్న ఇళ్ల స్థితిగతులను స్వయంగా పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడమే ప్రభుత్వ లక్ష ్యమని తెలిపారు. ముఖ్యంగా గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా, ఇప్పటికే గోడలు నిర్మించుకుని స్లాబ్ వేసుకునే స్థితిలో ఉన్న అర్హులైన లబ్ధిదారులకు రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. అలాగే, ఇల్లు నిర్మాణంలో బేస్ లెవెల్ వరకు పూర్తి చేసుకుని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా మిగతా నిర్మాణాన్ని కొనసాగించలేకపోతున్న అర్హులైన లబ్ధిదారులకు రూ.4 లక్షల ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధిచేకూర్చుతున్నామని వెల్లడించారు. అర్హత, ఇంటి ప్రస్తుత స్థితిగతులు, లబ్ధిదారుల ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపడుతున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, మాజీ సర్పంచ్ రామన్ గౌడ్, హౌసింగ్ డీఈ రాజవర్ధన్ రెడ్డి తదితరులు మండల ప్రజా ప్రతినిధులు, గ్రామాల ప్రజా ప్రతినిధులు, రైతులు, వివిధ గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## జానకి మృతి పట్ల సిఎం చంద్రబాబు సంతాపం

**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** అలనాటి ప్రముఖ నటి షావుకారు జానకి (94) ఆకస్మిక మరణం నాకు తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. 400 కు పైగా చిత్రాల్లో నటించి ఎన్నో అవార్డులు, రివార్డులు పొందిన షావుకారు జానకి భౌతికంగా మనకు దూరం అయినా ఆమె నటించిన పాత్రల ద్వారా చిరస్థాయిగా మన మనసుల్లో నిలిచి పోతారన్నారు. జానకి ఆత్మకు ఆ భగవంతుడు శాంతి చేకూర్చాలని కోరుకుంటున్నాను. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నాను అని చంద్రబాబు తెలిపారు.

**మరణం లేని మహానటి : డి.సిఎం పవన్ కళ్యాణ్**

మరణం లేని మహానటి షావుకారు జానకి అని డి.సిఎం పవన్ కళ్యాణ్ సామాజిక మాధ్యమం "ఎక్స్' సంతాపం వ్యక్తం చేసారు. ఆమె జీవన ప్రస్తానమంతా సినిమా రంగంతో ముడి పడింది. 75యేళ్ళ పాటు ఆమె సినిమాలో నటించారన్నారు. నిన్నా, మొన్నటి వరకు ఆమె నటించారన్నారు. ఆమె అద్భుతమైన నటి అన్నారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు.

### మంత్రి లోకేష్ సంతాపం

జానకి మృతిపట్ల సంతాపం తెలియజేస్తూ "ఎక్స్" వేదికగా మంత్రి నారా లోకేష్ పోస్టు చేసారు. తెలుగు, తమిళ, కన్నడ భాషలలో సుమారు 400 చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించారు. షావుకారు సినిమా పేరునే ఇంటిపేరుగా మార్చుకున్నారు. వైవిధ్యమైన పాత్రలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారు. సినీ రంగానికి ఆమెఅందించిన సేవలు చిరస్మరణీయం. షావుకారు జానకి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడినిప్రార్థిస్తున్నాను. కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

### మంత్రి కందుల దుర్గేశ్ సంతాపం

జానకి మృతి పట్ల సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. షావుకారు చిత్రంతో సినీ ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ఆమె షావుకారు జానకి గా తెలుగు సినీ రంగంలో విశేష కీర్తి ప్రతిష్ఠలు సంపాదించారని మంత్రి పేర్కొన్నారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఆమె కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## వారం - వర్జ్యం

22-08-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె
తి.దశమి రా.2.00
న.జ్యేష్ఠ మ.2.49
వ.లేదు.
దు.తె.5.52-ఉ.7.30
రాహు.ఉ.9.00-ఉ.10.30
శుభ ఉ.7.00-ఉ.8.00

## వార్తాఫలం

**మేషం:** చెప్పుడు మాటలు విని అయిన వాళ్ళని దూరం చేసుకుంటారు. వ్యాపార పరంగా నూతన నిర్ణయాలు తీసుకుంటారు.

**వృషభం:** నూతన విద్యల పట్ల ఆకర్షితులవుతారు. వ్యాపారాలు ప్రారంభించాలన్న ఆలోచనలు కలిగి ఉంటారు. ప్రయాణాలు.

**మిథునం:** తనఖాలు, మొండిబాకీలు వంటి ఆర్థిక అంశాలపై దృష్టి సారిస్తారు. సంఘంలో ప్రత్యేక గౌరవం పొందుతారు.

**కర్కాటకం :** ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. కోర్టు కేసులు పరిష్కారమవుతాయి. విలువైన ఆభరణాలు, వస్తువులు కొనుగోలు.

**సింహం :** కొత్త పెట్టుబడులకు అనుకూల సమయం. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతారు. శుభవార్తలు అందుకుంటారు.

**కన్య :** భాగస్వామ్య వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. రాజకీయ రంగాలలోని వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది.

**తుల :** రాజకీయ, కళారంగాలోని వారికి ప్రభుత్వం నుండి ఆహ్వానాలు అందుతాయి. నూతన అవకాశాలు లభిస్తాయి.

**వృశ్చికం :** గృహం కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి. శుభకార్యాలలో బంధుమిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**ధనుస్సు :** కష్టసుఖాలను సరిసమానంగా చూస్తారు. ఏది కోల్పోయిన మనోధైర్యం మాత్రం కోల్పోరాదు.

**మకరం :** ప్రయాణాలు, బంధుమిత్రుల రాకపోకలు, అధిక ధన వ్యయానికి, ఆనందోత్సాహలకు కారణం అవుతాయి.

**కుంభం:** మీలో దాగి వున్న నైపుణ్యం వెలుగులోకి వస్తుంది. కుటుంబ విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

**మీనం:** విద్యా సంబంధమైన విషయాలలో మరింత శ్రద్ధ కనబరచ వలసి ఉంటుంది. ఆర్థిక పరమైన వెసులు బాటు లభిస్తుంది.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

22-8pg3exHMNWJQE:22-8pg3exHMNWJQE.qxd 8/22/2026 12:10 AM Page 1



## నేడు కేరళకు డి.సిఎం పవన్ కళ్యాణ్

**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ శనివారం కేరళకు పయనం కానున్నారు. భుజం నొప్పికి ఆయుర్వేద చికిత్స తీసుకునే నిమిత్తం కేరళకు వెళ్తున్నట్లు జనసేన పార్టీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇటీవల పవన్ కళ్యాణ్ తన కుడి భుజం లిగ్మెంటర్ షోల్డర్ గాయానికి ముంబైలో శస్త్రచికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే. శస్త్రచికిత్స అనంతరం కొంతకాలం పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని, అధికారిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని వైద్యులు ఆయనకు సూచించారు. అయితే, పరిపాలనా బాధ్యతల దృష్ట్యా పవన్ కళ్యాణ్ శస్త్రచికిత్స జరిగిన వారంలోపే తిరిగి విధుల్లో చేరారు. ముందస్తుగా నిర్ణయించిన ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు, శాఖాపరమైన సమీక్షలు, పార్టీ అంతర్గత సమావేశాలను ఆయన నిర్వహించారు. విశ్రాంతి లేకుండా విధుల్లో పాల్గొనడం వల్ల ఆయన భుజానికి వాపు రావడంతో పాటు తీవ్రమైన జ్వరం కూడా వచ్చినట్లు జనసేన పార్టీ పేర్కొంది. ఈ నేపథ్యంలో, భుజం నొప్పి నుంచి పూర్తిస్థాయిలో కోలుకోవడానికి కేరళలో ప్రత్యేక ఆయుర్వేద చికిత్స తీసుకోవాలని వైద్యులు సూచించగా, ఆయన రేపు అక్కడకు వెళ్తున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## ప్రణయ్ తేజ్ ఘటన నుంచి తేరుకోలేకపోతున్నా

### - విద్యా మంత్రి నారా లోకేశ్

**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యార్థి ప్రణయ్ తేజ్ మృతి ఘటనపై విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి, ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని, క్రమశిక్షణ పేరుతో చిన్నారులపై హింసకు పాల్పడటాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో మరొక పోస్ట్ పెట్టారు. "ఒక తండ్రిగా, విశాఖ చిన్నారి ప్రణయ్ తేజ్‌కు జరిగిన ఘటన గురించి నేను ఇంకా తేరుకోలేకపోతున్నాను. అతని తల్లిదండ్రులు అనుభవిస్తున్న బాధను ఊహించుకోలేను. మన పాఠశాలల్లో శారీరక దండనలకు ఏమాత్రం చోటు లేదు. క్రమశిక్షణ పేరుతో ఏ బిడ్డపైనా హింస జరగకూడదు" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ దురదృష్టకర ఘటనపై ఇప్పటికే పూర్తిస్థాయి విచారణకు ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ తీవ్రమైన దుఃఖ సమయంలో ప్రణయ్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు లోకేశ్ పేర్కొన్నారు.

## అంగన్వాడీలకు కొత్త మెనూ

**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందించే ఆహార మెనూలో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. 7 -12 నెలల చిన్నారులకు నెలకు 1.5 కిలోల జూనియర్ బాలామృతం, 13 -36 నెలల పిల్లలకు 2.5 కిలోల సీనియర్ బాలామృతం అందించనున్నారు. 3-6 యేళ్ల పిల్లలకు వారానికి రెండుసార్లు ఎగ్ ఫ్రైడ్ రైస్, సాయంత్రం ఉడికించిన శనగలు ఇవ్వనున్నారు. అన్ని వంటకాల్లో మునగాకు వినియోగించాలని ప్రభుత్వం సూచించింది.

## రెండు రోజుల పాటు వర్షాలు

**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతం, ఉత్తర ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీర ప్రాంతాలపై సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఒక ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో ఎపిలోని పలు జిల్లాల్లో రాగల 48గంటలుల్లో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఉత్తర, దక్షిణకోస్తాతో పాటు రాయలసీమ ప్రాంతాల్లో వానలు కురుస్తున్నాయి. దీని ప్రభావంతో రాబోయే మూడ్రోజుల పాటు రాష్ట్రంలో వానలు పడతాయని అమరావతి వాతావరణశాఖ స్పష్టం చేసింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం పడే అవకాశం ఉన్న క్రమంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. పలు జిల్లాలకు పిడుగుపాటు హెచ్చరికలు జారీ చేసింది.

**629 ఎఇఇ పోస్టులకు 1.05 లక్షల మంది అభ్యర్థులు**

## రేపటి నుంచి కంప్యూటర్ ఆధారిత పరీక్ష

- ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి వెల్లడి



**విశాఖపట్నం, ఆగస్టు 21 ప్రభాతవార్త:** రాష్ట్ర విద్యుత్ రంగంలో సాంకేతిక సిబ్బందిని మరింత బలోపేతం చేయడంతో పాటు అర్హత కలిగిన ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఎపి విద్యుత్ సంస్థల్లో ఎఇఇల నియామకం కోసం నిర్వహిస్తున్న నియామక పరీక్ష2026కు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థలు విస్తృత ఏర్పాట్లు చేశాయని ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి ట్రాన్స్‌కో, ఎపి జెన్‌కో, ఎపిఇపిడిసిఎల్, ఎపిఎస్‌పిడిసిఎల్, ఎపిసిపిడిసీఎల్ సంస్థల్లో 629 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న ఈ పరీక్షకు 1,05,566 మంది అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించారన్నారు. ఆగస్టు 23 నుంచి 27 వరకు ఐదు రోజుల పాటు కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించనున్నామని, ఎపితో పాటు ఇతర రాష్ట్రాల్లో కలిపి మొత్తం 94 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, వీటిలో 81 కేంద్రాలు ఆంధ్రప్రదేశ్‌లో ఉండగా మరో 13 కేంద్రాలు రాష్ట్రం వెలుపల ఉన్నాయని తెలిపారు. పరీక్షను పారదర్శకంగా, పకడ్బందీగా, ఎలాంటి అక్రమాలకు తావులేకుండా నిర్వహించేందుకు బహుళస్థాయి భద్రతా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రతి అర్హత కలిగిన అభ్యర్థికి సమానమైన, న్యాయమైన అవకాశాన్ని కల్పించడమే ప్రధాన లక్ష్యంగా పరీక్ష విశ్వసనీయతను కాపాడేందుకు సాంకేతికత, బయోమెట్రిక్ ధ్రువీకరణ, సిసి కెమెరాల పర్యవేక్షణ, కేంద్రస్థాయి మానిటరింగ్‌తో పాటు పటిష్టమైన పరిపాలనా, భద్రతా చర్యలను చేపట్టామని, పరీక్ష ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, విశ్వసనీయంగా, ఎలాంటి మాల్‌ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా జరిగేలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని సిఎండి పృథ్వీతేజ్ తెలిపారు.

## ఇక వ్యక్తికి 9 సిమ్‌ల వరకే అనుమతి

**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** దేశంలో మొబైల్ కనెక్షన్ల జారీలో నూతన నిబంధనలు అమలులోకి రానున్నాయి. ఈ నెల 24వ తేదీ నుంచి కేంద్రం దేశవ్యాప్తంగా వీటిని అమల్లోకి తీసుకుని రాబోతోంది దీనికి సంబంధించిన నిబంధనలు, మార్గదర్శకాలు సైతం రూపొందించింది. ఒక వ్యక్తి తన పేరు మీద నిర్ణీత పరిమితి కంటే ఎక్కువ మొబైల్ కనెక్షన్లు కలిగి ఉంటే, వారికి నూతనంగా మరో సిమ్ కార్డు జారీ చేయకూడదని కేంద్రం టెలికాం ఆపరేటర్లను ఆదేశించింది. పరిమితి మించిన వినియోగదారులకు ఎట్టి పరిస్థితుల్లో కూడా నూతన సిమ్ అనేది ఇవ్వరు. వీటిని పూర్తిగా నిలిపివేయనున్నారు. తాజా టెలికాం నిబంధనల ప్రకారం దేశంలో ఒక పౌరుడు తన ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు పత్రాలపై గరిష్టంగా తొమ్మిది మొబైల్ కనెక్షన్లను మాత్రమే పొందేందుకు అనుమతి ఉంటుంది. జమ్మూ కాశ్మీర్, అస్సాం, ఈశాన్య రాష్ట్రాల ప్రజల భద్రత కారణాల రీత్యా ఈ పరిమితిని గరిష్టంగా ఆరు సిమ్ కార్డులుగా నిర్ణయించారు. ఆయా రాష్ట్రాల యూజర్లు ఆరుకు మించి ఎక్కువ సిమ్ కార్డులను పొందలేరు. వేర్వేరు టెలికాం కంపెనీల సిమ్ కార్డులను వాడుతున్నప్పటికీ కూడా మొత్తంగా ఉండాల్సిన కనెక్షన్ల సంఖ్య ఈ లిమిట్ దాటకూడదు. వినియోగదారులకు ఇప్పటికే వివిధ నెట్‌వర్క్‌లలో ఎన్ని సిమ్ కార్డులు ఉన్నాయనే విషయాన్ని రియల్ టైమ్ లో సరిపోల్చుకోవడానికి టెలికాం కంపెనీలన్నీ కూడా డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ ను ఉపయోగించాల్సి ఉంటుంది. ఈ సెంట్రలైజ్డ్ డిజిటల్ డేటాబేస్ ఆధారంగానే నూతన కనెక్షన్లు కోరేవారి అర్హతను ఆపరేటర్లు పరిశీలిస్తారు. ఇప్పటికే గరిష్ట పరిమితిని దాటిన వినియోగదారులు మరో సిమ్ కార్డును పొందకుండా అడ్డుకోవడానికి దేశంలోని ప్రైవేట్, ప్రభుత్వ రంగానికి చెందిన టెలికాం సంస్థలు తమ సాంకేతిక, వ్యవస్థాగత మౌలిక వసతులలో మార్పులు చేపట్టాయి.

# బ్రిక్స్ ప్రతినిధులకు ఘనస్వాగతం

- భోగాపురం విమానాశ్రయంలో తెలుగు సంప్రదాయ రీతిలో ఆహ్వానం



**విజయనగరం, ఆగస్టు 21 ప్రభాతవార్త:** విశాఖపట్నంలో ఆగస్టు 22, 23 తేదీల్లో నిర్వహించనున్న బ్రిక్స్ సదస్సుకు వివిధ దేశాల నుంచి విచ్చేస్తున్న ప్రతినిధులకు భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో విజయనగరం జిల్లా అధికారుల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. తెలుగు సంప్రదాయాలకు ప్రతీకగా మేళతాళాలు, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలతో విదేశీ ప్రతినిధులకు ఆత్మీయ స్వాగతం పలికి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పారు. ప్రతినిధుల రాక సందర్భంగా విమానాశ్రయంలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. బ్రిక్స్ సదస్సుకు సంబంధించి అందుబాటులో ఉన్న ప్రతినిధుల జాబితా ప్రకారం రష్యా, దక్షిణాఫ్రికా, చైనా, ఈజిప్ట్, ఇండోనేషియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇథియోపియా, బ్రెజిల్ దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారు. రష్యా తరఫున క్రీడల ఉప మంత్రి అలెక్సీ మొరోజోవ్, చైనా తరఫున క్రీడల సాధారణ పరిపాలనా సంస్థ ఉప మంత్రి కుయ్ జియాన్, దక్షిణాఫ్రికా తరఫున క్రీడలు, కళలు, సంస్కృతి శాఖ ఉప మంత్రి పీస్ మాబే, ఈజిప్ట్ తరఫున కౌన్సిలర్ మొహమ్మద్ ఖాటర్, ఇండోనేషియా ప్రతినిధి బృందానికి కాన్సుల్ జనరల్ ఎడీ వార్డోయో తదితరులు ఉన్నారు. అలాగే ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇథియోపియా, బ్రెజిల్ దేశాల నుంచి కూడా ప్రతినిధులు హాజరవుతున్నారు. భారత దేశం తరఫున కేంద్ర క్రీడల మంత్రి మన్సుఖ్ మాండవీయ, కేంద్ర సహాయ మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సే, క్రీడల కార్యదర్శి హరి రంజన్ రావు పాల్గొంటున్నారు. భోగాపురం విమానాశ్రయంలో ప్రతినిధులకు జిల్లా హౌసింగ్ పిడి మురళీ మోహన్, జిల్లా టూరిజం అధికారి పి.ఎన్.వి. లక్ష్మీనారాయణ, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు తదితర అధికారులు స్వాగతం పలికారు. విదేశీ ప్రతినిధులకు భారతీయ సంస్కృతి, తెలుగు సంప్రదాయాలను పరిచయం చేసేలా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. బ్రిక్స్ సదస్సు సందర్భంగా విమానాశ్రయానికి వస్తున్న ప్రతినిధులకు అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టింది.

# తప్పుడు ఆర్థిక లావాదేవీలతో యుబిఐకే టోకరా

- షెల్ కంపెనీల పేరుతో రూ.26 కోట్లు రుణం • విజయవాడలో ఓ కార్పోరేట్ సంస్థ దురాగతం • రంగంలోకి సిబిఐ... పలువురిపై కేసు నమోదు

**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలో ఓ కార్పోరేట్ సంస్థ తప్పుడు ఆర్థిక లావాదేవిలతో ఏకంగా యుబిఐకే టోకారా వేసింది. రికార్డుల్లో తప్ప ఎటువంటి ఆర్థిక నిధులు లేని షెల్ కంపెనీల పేరుతో రూ.26 కోట్లు యుబిఐ నుంచి రుణంగా తీసకుంది. ఆలస్యంగా ఈ వ్యవహారాన్ని గుర్తించిన యుబిఐకి ఇటీవల సీబిఐకి ఫిర్యాదు చేసింది. పిర్యాదును అనుసరించి వాస్తవాలు విచారించి ఆ సంస్ద బాధ్యులపై సీబిఐ కేసు నమోదు చేసింది. ఈ వ్యవహారంలో విచారణలో సీబిఐ పలు కీలకంశాలు గుర్తించింది. యూబీఐ ఏజీఎం శ్రీకాంత పాత్రో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఓంకార విజయలక్ష్మి స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏ1), డైరెక్టర్లైన కోట భాను ప్రసాద్ (ఏ2), కోట శ్రావణి (ఏ3), కోట పృథ్వీ వెంకట తేజ (ఏ4), కోట రాహుల్ సాయి బాలాజీ (ఏ5)తో పాటు గుర్తుతెలియని ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ వ్యక్తులను ఇందులో నిందితులుగా సీబిఐ చేర్చింది. ఓంకార విజయలక్ష్మి స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను 2017లో ఏర్పాటైంది. గాల్వనైజ్డ్ పైపులు, ఇతర ఉక్కు ఉత్పత్తులను తయారు చేస్తుంది. 2024లో కంపెనీ డైరెక్టర్లైన కోట భాను ప్రసాద్, కోట శ్రావణి, కోట పృథ్వీ వెంకట తేజ, కోట రాహుల్ సాయి బాలాజీ తప్పుడు ఆర్థిక నివేదికలు, ఇతర పత్రాలతో నగరంలోని సూర్యారావుపేటలోని యూబీఐ శాఖను సంప్రదించారు. గతంలో కరూర్ వైశ్యా బ్యాంకులో తీసుకున్న రుణాన్ని యూబీఐకి బదిలీ చేసుకున్నారు. డైరెక్టర్లు సమర్పించిన దరఖాస్తులు, పత్రాల ఆధారంగా యూబీఐ, 2024, ఫిబ్రవరి 22న రూ. 24 కోట్ల విలువైన రుణం మంజూరు చేసింది. దీనికి హామీగా సరకు, ప్లాంట్, యంత్రాలను పెట్టారు. 2025, మే 17న రుణాన్ని రెన్యువల్ చేశారు. ఆ సమయంలో యూనిట్‌ను తనిఖీ చేయగా, గణనీయమైన తేడా కనిపించింది. రూ.23.85 కోట్ల సరకుకు గాను అక్కడ రూ. 25 లక్షల విలువైన నిల్వలు మాత్రమే ఉన్నాయి. స్టాక్ ఆడిట్‌లోనూ తేడాలను గుర్తించారు. టాటా క్యాపిటల్ ఫైనాన్స్ సర్వీసెస్ నుంచి తీసుకున్న రూ.2.10కోట్ల రుణం గురించి వెల్లడించకుండా దాచిపెట్టారు. రుణం మంజూరైన తేదీ నుంచి ఆరు నెలల్లోనే ఇద్దరు డైరెక్టర్లు రాజీనామా చేశారు. యాజమాన్య మార్పునకు సంబంధించి సంబంధిత ముందస్తు అనుమతి కూడా పొందలేదు. ఆ ఇద్దరు డైరెక్టర్లు మెస్సర్స్ నెర్రో స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే పేరుతో ఒక కొత్త కంపెనీని ప్రారంభించారు. దీనికి కెనరా బ్యాంకులో రూ. 6 కోట్లు చెల్లించాల్సిన రుణం కూడా ఉంది. అనుమతి లేకుండానే ఆడిటర్లను కూడా మార్చారు.

బ్యాంకుకు సమాచారం ఇవ్వకుండా యూనిట్ నుంచి స్టాక్‌ను తరలించారు. ప్రధాన చెల్లింపులు మారుతీ ట్రేడర్స్ పేరు మీద జరిగాయి. రూ. 67.54 కోట్ల రుణాలలో రూ. 32.19 కోట్ల మేర ఎక్కువ జమలు దుర్గా భవానీ స్టీల్స్ పేరున జరిగాయి. వీటిని వ్యాపారంలో చూపించలేదు. ఈ రెండు సంస్థలు 2024 సంవత్సరంలో ఏర్పాటయ్యాయి.

ఇంకా కార్యకలాపాలు కూడా ప్రారంభించలేదు. కంపెనీ రుణ అర్హతను పెంచుకునేందుకు, నిధులను పక్కదారి పట్టించేందుకు, టర్నోవర్‌ను కృత్రిమంగా పెంచేందుకే వీటిని ఉపయోగించారు.

వడ్డీ చెల్లించకపోవడంతో పెరిగిపోయి రూ.26.05 కోట్లకు బకాయిలు చేరాయి. దీని వల్ల బ్యాంకుకు నష్టం వాటిల్లింది. ఈ ఘటనకు సంబంధించి సిబిఐ జరుపుతున్న విచారణలో పలువురు ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర కీలకంగా ఉన్నట్లు గుర్తించారు. అయితే వారి వివరాలను సేకరించే పనిలో సిబిఐ ఉంది.

# పరిశోధనలో నాణ్యతే విజయానికి బాట

- ఇస్రోతో అపోలో సాంకేతిక భాగసామ్యం • వైస్ ఛాన్సలర్ డాక్టర్ నితిన్ ఎం.నాగర్కర్



**చిత్తూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త:** అంతరిక్ష పరిశోధనలో భారత్ సాధిస్తున్న విజయాలు దేశ ప్రతిష్టను ప్రపంచ వేదికపై నిలబెడుతున్నాయని, నాణ్యమైన పరిశోధన, నైతిక విలువలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగంతోనే అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధ్యమని అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ నితిన్ ఎం.నాగర్కర్ పేర్కొన్నారు. పరిశోధన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 'పరిశోధన నుండి ప్రచురణ వరకు' అనే రెండు రోజుల వర్క్‌షాప్‌ను అపోలో యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ నితిన్ ఎం.నాగర్కర్ అపోలో యూనివర్సిటీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్రో తన ప్రస్థానంలో అనేక విజయాలు నమోదు చేసుకుని ప్రపంచ దేశాలకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు. చైనా, అమెరికా దేశాల తరువాత అంతరిక్ష రంగంలో భారత్ మూడవ స్థానంలో నిలవడం విశేషమన్నారు. త్వరలోనే అపోలో విశ్వవిద్యాలయం ఇస్రోతో సాంకేతిక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో భారత్ అంతరిక్ష పరిశోధనలో మరింత ముందడుగు వేస్తూ మంగళ, శుక్ర గ్రహాలపై మరిన్ని ప్రయోగాలు చేపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇస్రో శాస్త్రవేత్త పూజా సింగ్ చంద్రయాన్-3తో సహా పలు ఉపగ్రహ మిషన్లలో కీలకంగా పనిచేసిన తన అనుభవంను విద్యార్థులతో పంచుకున్నారు. ఉపగ్రహ వ్యవస్థల అభివృద్ధి, కృత్రిమ మేధస్సు ఆధారిత మోడళ్ళ వినియోగం, ఉపగ్రహ పరీక్షల సమయంను తగ్గించే సాకేంతిక పరిష్కారాలపై తాను పని చేశానన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ అనిల్ కుమార్ ఎస్. ఎఐఎంఎస్ఆర్ డీన్ డాక్టర్ రమ్యా రామకృష్ణన్, డీన్లు ప్రొఫెసర్ కె.భాస్కర్‌రెడ్డి, డాక్టర్ రామయ్య ఇటుమల్ల, డాక్టర్ డి.జగదీషన్, అపోలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.జయంతి తదితరులు పాల్గొన్నారు.



# ఆత్మ నిర్భరత, యువత ఆకాంక్షలపై సమన్వయ బైఠక్‌లో చర్చించాం

- దేశం, సమాజం భవిష్యత్ సవాళ్లపై చింతనమంథనం

**విశాఖపట్నం, ఆగస్టు 21 ప్రభాతవార్త:** రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ (ఆర్ఎస్ఎస్) ప్రేరణతో పనిచేస్తున్న వివిధ సంస్థల మూడు రోజుల అఖిల భారతీయ సమన్వయ బైఠక్ విశాఖపట్నం సమీపంలోని గుడిలోవ విజ్ఞాన విహార్ ఆవాసీయ విద్యాలయ ప్రాంగణంలో శుక్రవారం సమాప్తమైంది. సమాజం, దేశం కోసం వివిధ రంగాల్లో పనిచేస్తున్న సంఘ్ ప్రేరిత సంస్థల ప్రముఖ బాధ్యులు, కార్యకర్తలు ఈ బైఠక్‌లో పాల్గొన్నారు. బైఠక్‌కు మొత్తం 326 మంది ప్రతినిధులను ఆహ్వానించారు. వీరిలో వివిధ సంస్థలకు చెందిన మహిళా నాయకత్వం కూడా ఉంది. మూడు రోజుల బైఠక్‌లో 49 మంది మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

బైఠక్‌లో ఆర్ఎస్ఎస్ సర్‌సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్, సర్‌కార్యవాహ దత్తాత్రేయ హోసబళే ప్రత్యేకంగా పాల్గొన్నారు. వీరితో పాటు సంఘ్ ప్రేరిత వివిధ సంస్థలకు చెందిన జాతీయ స్థాయి ప్రముఖ కార్యకర్తలు, నాయకత్వం బైఠక్‌లో పాల్గొన్నారు. మూడు రోజులపాటు దేశం, సమాజంలోని ప్రస్తుత పరిస్థితులు, వివిధ సంస్థలు చేస్తున్న కార్యక్రమాలు, వాటి అనుభవాలు, భవిష్యత్ సవాళ్లు, రాబోయే కార్యాచరణపై విస్తృతంగా చర్చ జరిగింది.

### ప్రధాన అంశాలపై చర్చ చింతనమంథనం

ప్రకృతి వైపరీత్యాల సమయంలో సమాజ ఆధారిత సేవా, పునరావాస కార్యక్రమాలను బైఠక్‌లో సమీక్షి ంచారు. అసోంలో సంభవించిన తీవ్రమైన వరదల సమయంలో రాష్ట్రీయ సేవా భారతి, భారతీయ కిసాన్ సంఘ్, నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ (ఎన్ఎంఓ), ఆరోగ్య భారతి సహా వివిధ సంస్థలు, కార్యకర్తలు చేపట్టిన సహాయ, పునరావాస కార్యక్రమాల వివరాలను పంచుకున్నారు. సంత్ రవిదాస్ 650వ జయంతి సందర్భంగా, వారి సందేశం ఆధారంగా సామాజిక సమరసత, సామాజిక సౌహార్దం కోసం దేశవ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాలు, సమాజం నుంచి లభించిన సానుకూల స్పందనను సమీక్షి ంచారు. ఈ దిశగా పనిని నిరంతరం మరింత విస్తరించడంపై చర్చించారు.

### యువత ఆకాంక్షలు, ఆందోళనలపై ప్రత్యేక చర్చ

యువత ఆలోచనలు, ఆకాంక్షలు, సృజనాత్మక సామర్థ్యం, భవిష్యత్‌కు సంబంధించిన ఆందోళనలు, దేశ నిర్మాణంలో వారి పాత్రపై విస్తృతంగా చర్చ జరిగింది. సంఘ్ కార్యం పెద్ద సంఖ్యలో యువత మధ్య కొనసాగుతోంది. ఈ సంవత్సరం సంఘ్ నిర్వహించిన 21 రోజుల శిక్షణ వర్గల్లో సుమారు 21,000 మంది యువ స్వయంసేవకులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా రోజువారీ శాఖలకు హాజరవుతున్న స్వయంసేవకుల్లో 60శాతానికి పైగా యువతే ఉన్నారు. యువతతో కేవలం ఉపదేశాత్మక సంభాషణకు బదులుగా వారితో ప్రత్యక్షంగా అనుసంధానం కావడం, వారి భావాలు, ఆందోళనలను అర్థం చేసుకోవడం, సంభాషణ ద్వారా దేశం, సంస్కృతి, సామాజిక విలువల పట్ల ఆత్మీయతను పెంపొందించడం అవసరమని పేర్కొన్నారు.

### పంచ పరివర్తన్, కుటుంబ ప్రబోధన

సంఘ్ శతాబ్ది సంవత్సరం నేపథ్యంలో సమాజ పరివర్తన కోసం నిర్దేశించిన 'పంచ పరివర్తన్'లోని వివిధ అంశాలపై బైఠక్‌లో ప్రత్యేకంగా చర్చ జరిగింది. ముఖ్యంగా కుటుంబ ప్రబోధన్‌లో భాగంగా భారతీయ కుటుంబ వ్యవస్థ, కుటుంబ విలువలు, తరతరాలుగా కొనసాగుతున్న సాంస్కృతిక సంప్రదాయాలను బలోపేతం చేయాల్సిన అవసరంపై చర్చించారు. పర్యావరణ పరిరక్షణ విషయంలో కేవలం తీర్మానాలు చేయడానికి పరిమితం కాకుండా ప్రతి వ్యక్తి, ప్రతి కుటుంబం రోజువారీ జీవితంలో మార్పులు తీసుకు రావాలని నొక్కిచెప్పారు. నీటిని వివేకవంతంగా వినియోగించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని కనిష్ఠ స్థాయికి తగ్గించడం, పచ్చదనాన్ని పెంచడం వంటి అంశాలు ప్రతి కుటుంబం ఆచరణలో భాగం కావాలని పేర్కొన్నారు.

## నేడు విజయనగరం జిల్లాలో సిఎం పర్యటన

**విజయనగరం, ఆగస్టు 21 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 22వ తేదీన విజయనగరం జిల్లాలో పర్యటించనున్నారు. సిఎం పర్యటనకు సంబంధించిన అధికారిక పర్యటన షెడ్యూల్ ప్రకారం, అనకాపల్లి జిల్లా కె.కోటపాడు నుండి బయలుదేరి సాయంత్రం 4.10 గంటలకు ఎల్.కోట మండలం ఎల్.కోట గ్రామంలోని హెలిప్యాడ్‌కు ముఖ్యమంత్రి హెలికాప్టర్ ద్వారా చేరుకుంటారు. అనంతరం 4.15 గంటలకు హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గంలో ఎల్.కోట గ్రామంలోని శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి నివాసానికి బయలుదేరి, 4.20 నుంచి 4.40 గంటల వరకు ఆమె నివాసంలో జరుగు కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 4.40 గంటలకు ఎమ్మెల్యే నివాసం నుంచి బయలుదేరి 4.45 గంటలకు ఎల్.కోట హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి 4.50 గంటలకు హెలికాప్టర్‌లో విశాఖపట్నం బయలుదేరి, సాయంత్రం 5.05 గంటలకు నేవల్ కోస్టల్ బ్యాటరీ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. విశాఖపట్నంలో సాయంత్రం 5.45 నుంచి రాత్రి 8.30 గంటల వరకు నోవోటెల్ హోటల్‌లో నిర్వహించే 2వ బ్రిక్స్ యూత్ స్పోర్ట్స్ మినిస్టీరియల్ మీటింగ్స్-2026, సాంస్కృతిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. అనంతరం రాత్రి 9.30 గంటలకు భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుని, 9.40 గంటలకు హెలికాప్టర్ ద్వారా ఉండవల్లిలోని తన నివాసానికి బయలుదేరుతారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని, పర్యటన విజయవంతంగా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

### మార్కాపురం, భీమవరం, నంద్యాల కేంద్రాలుగా

## పట్టణాభివృద్ధి సంస్థలు ఏర్పాటు

**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లాల పునర్విభజనకు అనుగుణంగా కొత్తగా మార్కాపురం, భీమవరం, నంద్యాల కేంద్రాలుగా పట్టణాభివృద్ధి సంస్థలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త ఏర్పాటు చేసిన మొత్తం 11 యూడీఏల పరిధుల్లో ప్రభుత్వం మార్పులు చేసింది. తిరుపతి, విశాఖ మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీఎంఆర్డీఏ), పుట్టపర్తి, నెల్లూరు, ఒంగోలు, ఏలూరు, కర్నూలు, కాకినాడ, మచిలీపట్నం, కడప, బాపట్ల పట్టణాభివృద్ధి సంస్థల పరిధులను కొత్త జిల్లాలకు అనుగుణంగా సవరించారు. పరిపాలనా సౌలభ్యం కోసం మరో మూడు యూడీఏల పేర్లను ప్రభుత్వం మార్చింది.

చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ పేరును చిత్తూరు, పలమనేరు, కుప్పం పట్టణాభివృద్ధి సంస్థ (సీపీకేయూడీఏ)గా, పలమనేరు, కుప్పం, మదనపల్లె యూడీఏను (అన్నమయ్య పట్టణాభివృద్ధి సంస్థ)గా మార్పు చేశారు. అనంతపురం, హిందూపురం యూడీఏను (అనంతపురం పట్టణాభివృద్ధి సంస్థ)గా నామకరణం చేశారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పట్టణాభివృద్ధి సంస్థ ద్వారా పట్టణాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడనున్నాయి. రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడం, రహదారులు, వంతెనలు, ఫ్లైఓవర్ల నిర్మాణం, తాగునీరు, మురుగునీటి పారుదల, పారిశుద్ధం మెరుగు తదితర విషయాలపై దృష్టి సారించనుంది. అందుకు అవసరమైన ప్రత్యేక నిధులను సర్కార్ మంజూరు చేయనుంది. అంతేకాక నగర ప్రాంతాల్లో ఉద్యానవనాలు అభివృద్ధి, పచ్చదనం పెంపొందించేందుకు ప్రత్యేక దృష్టి సారించనున్నారు.

పట్టణాభివృద్ధి సంస్థల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియపై పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులతో విస్తృతంగా చర్చించిన తర్వాతే ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రస్తుత జిల్లా వ్యవస్థకు అనుగుణంగా, ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా యూడీఏల నిర్మాణాన్ని ఆచరణాత్మకంగా మార్చామని స్పష్టంచేశారు. తాజా ఉత్తర్వులతో రాష్ట్రంలో పట్టణాభివృద్ధి పనులు మరింత వేగవంతం కానున్నాయని నారాయణ పేర్కొన్నారు.

### ఎస్‌బిఐ సిబ్బంది నివాస గృహ సముదాయం

## సిఆర్‌డిఎతో పూర్తయిన అగ్రిమెంట్

**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతిలో ఎస్‌బిఐ సిబ్బందికి నివాస గృహ సముదాయం నిర్మించేందుకు ముందడుగు పడింది. దీనికి సంబంధించిన భూ అగ్రిమెంట్ ఎస్‌బిఐ, సీఆర్‌డిఏ(క్రడా) మధ్య పూర్తయింది. ఈ మేరకు సంబంధిత పత్రాలను క్రడా ఎస్టేట్స్ విభాగ జాయింట్ డైరెక్టర్ జుబిన్ రాయ్, ఎస్‌బిఐ ఏజిఎం అధికారిజి.రామకృష్ణకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అందజేశారు. రాజధాని అమరావతిలో ఎస్‌బిఐ తన ప్రాంతీయ కార్యాలయాన్ని లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం పరిధిలో 3 ఎకరాలలో నిర్మించనుండగా కార్యాలయ నిర్మాణ పనులకు గౌరవ కేంద్రమంత్రి నిర్మల సీతారామన్ గత ఏడు నవంబర్‌లో శంకుస్థాపన చేసియున్నారు. ఈ మేరకు అమరావతిలోని ఎస్‌బిఐ సిబ్బంది నివసించేందుకు వీలుగా అమరావతిలోని ఐనవోలులో 2.05 ఎకరాలలో ఎస్‌బిఐ నివాస గృహాలను నిర్మించనుంది. దీనికై ఎస్‌బిఐ క్రడా తో తాజాగా అగ్రిమెంట్ కుదుర్చుకుంది. అమరావతిని జాతీయ స్థాయిలో ఆర్థిక పరిపాలనా కేంద్రంగా బలోపేతం చేయాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చే కార్యాచరణలో, ఈ అగ్రిమెంటుతో కీలకమైన ముందడుగు పడింది. రూ.214 కోట్లతో నిర్మించనున్న ఈ నివాస సముదాయంలో 4.46 లక్షల చదరపు అడుగుల బిల్ట్ అప్ ఏరియాతో నిర్మాణం జరుగుతుందని, జూన్ 2027లో పనులు ప్రారంభించి 2028లోపు నివాస సముదాయాలను పూర్తి చేస్తామని ఎస్‌బిఐ అధికారులు తెలిపారు.


**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్**
ఒక షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు
(CIN: L36911RJ1996PLC011381)
నమోదిత కార్యాలయం: 19-A, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001

**అనుబంధం IV (నిబంధన 8(1) చూడండి) స్వాధీనతా ప్రకటన**

ఇది ఇలా ఉండగా, క్రింది సంతకందారుడు, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్ యొక్క అధీకృత అధికారి అయినందున "సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం 2002" క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002తో చదువబడే సెక్షన్ 13 క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ, రిఫరెన్స్ నం.: CB/SAR/13-2/ BB/DEC-2025/01 రుణ ఖాతా నం. 2406262158314262 ప్రకారం రుణగ్రహీత/హామీదారు/ తనఖాదారులు M/s అభినవ్ ఏజెన్సీస్ దాని యజమాని శ్రీ పేతెళ్ల మాధవ వర్మ (రుణగ్రహీత) ద్వారా, శ్రీ పేతెళ్ల మాధవ వర్మ S/o శ్రీ అప్పలరాజు పేతెళ్ల (హామీదారులు/తనఖాదారు) శ్రీమతి పేతెళ్ల ప్రేమకుమారి W/o శ్రీ అప్పలరాజు పేతెళ్ల (హామీదారు) రుణ ఖాతా నం.2406262158314262కు రూ.93,23,561/- (రూపాయలు తొంభై మూడు లక్షల ఇరవై మూడు వేల ఐదు వందల అరవై ఒకటి మాత్రమే) 29.11.2025 మొత్తంగా కూడుకున్న బకాయి మొత్తం (ప్రిన్సిపల్, వడ్డీ, పెనాల్టీలు మరియు అన్ని ఇతర ఛార్జీలు కలుపుకొని) సదరు నోటీస్ అందిన తేదీ/నోటీస్ యొక్క తేదీ నుండి 60 రోజులలోపుగా పూర్తి చెల్లింపు వరకు తదుపరి వడ్డీ మరియు ఛార్జీలతో నోటీస్‌లో పేర్కొనబడిన సొమ్ము తిరిగి చెల్లించవలసినదిగా పిలుపునిస్తూ 01.12.2025 తేదీ గల డిమాండ్ నోటీస్ జారీ చేసారు.

రుణగ్రహీత/హామీదారు/తనఖాదారుడు సొమ్ము తిరిగి చెల్లించటంలో విఫలమైనందున 2026 సంవత్సరం యొక్క ఆగస్టు యొక్క ఈ 17వ రోజున సదరు నిబంధనలు యొక్క నిబంధన 8 తో చదువబడు సదరు చట్టం యొక్క 13(4) సెక్షన్ క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ ఇక్కడ క్రింద వివరింపబడిన ఆస్తి దిగువ సంతకందారుడు స్వాధీనం చేసుకొన్నట్లు రుణగ్రహీత/తనఖాదారునకు, సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా ప్రకటించడమైనది.

"సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందటానికి లభ్యమయ్యే సమయానికి సంబంధించి చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క ఉప-సెక్షన్ (8) యొక్క ఏర్పాట్లు గురించి రుణగ్రహీత/హామీదారు దృష్టికి తీసుకురావడమైనది.

రుణగ్రహీత/హామీదారుడు/తనఖాదారులు ప్రత్యేకంగాను, సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా ఆస్తితో ఎటువంటి లావాదేవీలు జరుపరాదు. మరియు ఆస్తితో ఏవైనా లావాదేవీలు జరిపినట్లయితే రుణ ఖాతా నం. 2406262158314262 రూ. 1,02,40,043/- (రూపాయలు ఒక కోటి రెండు లక్షల నలభై వేల నలభై మూడు మాత్రమే) 14-08-2026 నాటికి మరియు తదుపరి వడ్డీ మరియు దానిపై ఖర్చులు పూర్తి చెల్లింపు వరకు AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క చార్జీకి లోబడి వుండునని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

**స్థిరాస్తుల యొక్క వివరణ**

ఆంధ్రప్రదేశ్, విజయనగరం జిల్లా, కొత్త వలస జాయింట్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం యొక్క పరిధిలో "లియో రిసార్ట్స్" ఫేజ్-2 యొక్క పేరిట ఫైల్ నం.1167/0038/LP/VMRDA/2021 తేది: 02.07.2021 మరియు L.P. No.33/2021/1167/VMRDA/DPMS, వైస్ చైర్మన్ VMRDA యొక్క ప్రొసీడింగ్ ప్రకారం- విజయనగరం జిల్లా, కొత్తవలస సబ్ రిజిస్ట్రార్ పరిధి, లక్కవరపుకోట మండలం, లక్కవరపుకోట తలారి గ్రామం, తలారి గ్రామ పంచాయతీలో సర్వే నం. 100/11Pలో, 253 నం. కలిగిన ప్లాట్, 533.33 చ.గ. లేదా 445.86 చ.మీ. ఖాళీ స్థలం యొక్క ప్లాట్ స్థిరాస్తి యొక్క ప్రస్తుత మరియు భవిష్యత్ కట్టడాలతోసహా, మొత్తం అదంతా. శ్రీ పేతెళ్ల మాధవ వర్మచే స్వంతం.

సరిహద్దులు: తూర్పు: కంపెనీ భూమి, పడమర: 40 అ. రోడ్, ఉత్తరం: ప్లాట్ నం.254, దక్షిణం: ప్లాట్ నం.252.

తేది : 17.08.2026 అధీకృత అధికారి
ప్రదేశం : విజయనగరం జిల్లా, ఆం.ప్ర AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

22-8pg4:22-8pg4.qxd 8/22/2026 12:14 AM Page 1




వార్త

మనుషుల్ని యధాతథంగా అంగీకరించాలి, ఫలానా రకంగా ఉంటేనే అంగీకరిద్దాం అనికాదు.

న- ఫ్రాంజ్ స్కూబర్ట్

# ఖజానాకు 'ఉచిత' కుదుపులు!

దేశంలో పేదరికం తగ్గిందని చెప్తున్న లెక్కలు విస్తుపోయేలా ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చి 79ఏళ్లునిండిన పరిస్థితుల్లో పేదరికం తగ్గిందని చెప్పుకోకపోతే నవ్వులాటగా ఉంటుంది. కనుక వాటిని కాసేపు ఒప్పుకుంటేనే మంచిది. కాగా దారిద్ర్య రేఖకు దిగువనున్న వారి అభ్యున్నతికి చేసే ఏ ప్రయత్నమైనా హర్షిందగినదే. నిజమైన నిరుపేదలకు అందాల్సిన ఉచిత వరాలకు ఊపిరిపోస్తే చాలీచాలని బతుకులకు కడుపునింపినట్లే అవుతుంది. ఒకనొక దశ వరకే ఉచితాలని, లబ్ధికలిగించే ఏ ప్రయోజనాన్ని అందించి వారిప్రగతికి బాటలు వేయడాన్నిఎవరూ కాదనలేరు. కానీ కారులో వచ్చి రేషన్ బియ్యంతీసుకునే వారికి ఇక అలాంటి సౌకర్యాలు పొడిగిస్తేసమంజసమా? అసమంజసమా తేల్చాల్సింది ఏలినవారే. కానీ అలాంటి వారు అత్యున్నత స్థాయికి ఎదిగినా వారికి ఇప్పటికీ ఉచితాలు అందుతూ ఉండటమే ఆశ్చర్య కరమైన విషయం. పేదరికం తగ్గిందంటూ ప్రకటన లిచ్చే విశ్లేషణలు కొనసాగించే ప్రస్తుత కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పేదరికం నుంచి బయటపడిన వారికి ఇంకా లబ్ధి చేకూర్చడమే అనుచితంగా చెప్పుకోవాలి. ఒకప్పటి ఇరవై సూత్రాల కార్యక్రమం వంటి గరీబీ హఠావో పథకాలన్నీ పేదలనుద్దేశించి పెట్టుకున్న లక్ష్యాలే. అప్పట్లోనూ కొన్నిఅక్రమాలు జరిగాయనే ఆరోపణలున్నా కాస్త తక్కువేనని చెప్పాలి. ఆ తర్వాత కాలంలో ఎన్నికల్లో లబ్ధి కోసం ప్రవేశపెట్టిన అన్ని పథకాల్లోనూ దాదాపు 40 శాతం వరకు అనర్హుల పేర్లు జాబితాలో చోటుచేసుకున్నాయన్న విశ్లేషణలున్నాయి. ఆ తరువాత దాదాపు అన్నిపథకాలు గబ్బుపట్టిపోయాయి. ఈ నేపథ్యంలోనే ఉచితానుచితాల ప్రస్తావన, విశ్లేషణ విస్తృతంగా జరుగుతోంది. ఎంతో మంది మేధావులు సైతం ఉచితాలన్నీ అనుచితాలేనని అవేవీ సముచితాలు కావని చెప్పారు. ఇవన్నీ ఎలాఉన్నా ఉచితాలకోసం నిధులుమళ్లింపు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. తాజాగా ఉచితాలు ఉచితమేనా? అన్న మీమాంసపైతెలంగాణ హైకోర్టు సమక్షంలో మరో చర్చ, విశ్లేషణ మొదలైంది. తెలంగాణ అమలవుతున్న కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాల పట్టభద్రత, ఉచిత పథకాలకు నిధులు మళ్లింపు, నిధుల వినియోగంపై కాస్త అర్థవంతమైన విశ్లేషణలు బయటకొచ్చాయి. ఇందుకు సంబంధించిన అంశాలపై ఆ రాష్ట్ర ప్రభుత్వం నిధుల నిర్వహణపై జస్టిస్ ఎన్.వి.శ్రవణ్‌కుమార్ నేతృత్వంలోని ధర్మాసనం పలు అభిప్రాయాలను వ్యక్తం చేసింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై డేంజర్ బెల్స్ మోగుతున్నాయని, అందుచే పరిమితి లేకుండా ఇతరత్రా ఉచిత పథకాలకు నిధులు వలన రాష్ట్ర ఆర్థికపరిస్థితి గందరగోళంలో పడుతుందనే అట్టడుగు వర్గాలకు కేటాయించిన నిధుల వ్యవహారంలో మరింత విమర్శలు గురవుతున్నాయి. నీటిపారుదల, ఇతర ప్రాజెక్టుల కోసం నిర్బంధంగా భూములిచ్చిన బాధితులకు ఏళ్లతరబడి పరిహారం చెల్లించకుండా బకాయిలు పెట్టడంపై కోర్టు నిలదీసింది. పైగా ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు అందాల్సిన పెన్షన్లు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ సకాలంలో చెల్లించక పోవడానికి కారణం వారి సొమ్ము ఉచితాల పంపిణీకోసం మళ్లించడమే. ఈకారణం చేతనే అలా ఇబ్బందులు పడిన బాధితులు కూడా కోర్టులనాశ్రయిస్తున్నారు. అర్హులైన భూబాధితులకు చెల్లించేందుకు మొండి చెయ్యి చూపి శాసనసభ ఆమోదం లేని ఉచితపథకాలకు వందల కోట్లు కేటాయించడం సరికాదంటూ కోర్టుఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజాధనం మళ్లింపు కారణంగానే ఉండాలని, అనుచిత వ్యవహారాలను ప్రయారిటీగా భావించి ప్రభుత్వ నిర్ణయం తీసుకుంటే చివరాఖరుగా నష్టపోయేది ప్రజలే. ప్రభుత్వ ఖజానాను ఇబ్బంది పెట్టే విధంగా విచ్చలవిడి ఉచితపథకాలకు నిధులుమళ్లించటంలో ఒక సక్రమమైన ఆలోచన ఉన్నట్లు కనపడదు. 40ఏళ్ల పాటుప్రభుత్వ సర్వీసు చేసిన అసిస్టెంట్ ఇంజినీర్ తన రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించలేదని వేసిన పిటీషన్ విచారణలో జస్టిస్ నాగేష్ భీమపాక కొన్ని వ్యాఖ్యలు చేశారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధికారణాలు ప్రభుత్వ విధానపర అంశాలే అయినా వాటి వెనక కలిగే దుష్ప్రభావాలను గురించి పునరాలోచించుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది. ఉచిత కరెంటు, ఉచిత నీరు, ఉచిత బస్సు ప్రయాణం రైతు రుణమాఫీలు, సబ్సిడీలపై పథకాలపై వివరీక ఖర్చు చేస్తూ, దీర్ఘకాలంగా సేవలందించిన ఉద్యోగుల బకాయిలు చెల్లించకపోవడం దురదృష్టకరం. వెంటనే బకాయిలు విడుదల చేయాల్సిన ప్రయారిటీస్ పాటించాలని శాసన మండలి న్యాయమూర్తి హెచ్చరించారు. తాజా ప్రస్తావనలో ఉచితానుచితాల అర్హతలు అనర్హతలు కన్నా ఉచితాల కోసం మరోఅభివృద్ధికి కేటాయించిన ఉద్యోగులకు చెల్లించాల్సిన రిటైర్మెంట్ చెల్లింపునిధులను దారిమళ్లిస్తే భూ సేకరణ పరిహారానికి సంబంధించిన 19 కోర్టు ధిక్కరణ కేసులు పెండింగ్‌లో ఉండగా నిధుల సమస్య రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని న్యాయమూర్తి చెప్పడం చూస్తే ప్రభుత్వం నిధుల మళ్లింపులో సమంజసమైన రీతిలో వ్యవహరించలేదని అర్థమౌతుంది. కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలుపై ప్రభుత్వం 2014నుండి జారీ చేసిన పలుమెమోలు జీవోలను ప్రశ్నిస్తూ దాఖలైన పిటీషనుపై జస్టిస్ ఎన్వి శ్రవణ్‌కుమార్ విచారించారు. ప్రజల సొమ్మును సంక్షేమ పథకాలకు వెచ్చిస్తూ చట్టబద్ధంగా చెల్లించాల్సిన బకాయిలను చెల్లించలేకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. ప్రజల హక్కులను పరిరక్షించడంతోపాటు భవిష్యత్ తరాల ప్రయోజనాలను కాపాడేవిధంగా ప్రభుత్వ విధానాలను విశాలదృక్పథంతో నిర్ణయించాలి ఉండటం తప్పు అప్పు చేసి పథకాలఅమలు చేసే దుస్థితి కొనసాగకూడదని ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. చట్టబద్ధమైన విధానాల అమలులో నిర్ణయాలు తగు విధంగా ఉండకపోతే విమర్శలు తలెత్తకపోవడమంటే ఇదేనేమో!



అతిగా జాగ్రత్త పడడం దౌర్భాగ్యని లక్షణమైతే, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడం అవివేకి లక్షణం.

సెసిల్



నీ తప్పులను, నీ తెలివి తక్కువ పనులను నీ ముందు నిరాపించి నివేదించేవాడే నిజమైన స్నేహితుడు.

జాన్ రస్కిన్

# ప్రజాస్వామ్యానికి తూట్లు పొడవద్దు!

కోట్లాది రూపాయల ప్రజాధనం వ్యయమయ్యే పార్లమెంటు సమావేశాల్లో సమగ్ర చర్చలకు నోచుకోకపోవడం అత్యంత బాధాకరమని ప్రజాస్వామ్యవాదులే ఆవేదన చెందుతున్నారు. పాలకులు ప్రజాప్రతినిధులమనుకునేవారు ప్రజాధనానికి కాపలాదారులమనే విషయాన్ని విస్మరించకూడదు. సమావేశాలకు ఒక్క నిమిషానికి రెండున్నర లక్షల రూపాయల ప్రజాధనం వ్యయం అవుతున్న విషయం పెద్దలు గుర్తుపెట్టుకోవాలి. పార్లమెంటు ఉభయ సభల్లో జరుగుతున్న తీరు ప్రజాస్వామ్యవాదులకు ఎంతో ఆవేదన కలిగిస్తున్నది. దేశంలో ఎన్నో రాష్ట్రాల శాసన, మండళ్ల సమావేశాలకు అనుకరణీయంగా, ఆదర్శంగా ఉండాల్సిన పార్లమెంట్ సమావేశాల పరిస్థితి ఇలా దిగజారడం అత్యంత దురదృష్టకరం. రాజకీయ వ్యవస్థపై విరక్తి కలుగుతున్నది. పరిపాలనా వ్యవస్థ పట్ల అవిశ్వాసం పెరుగుతున్నది. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకే ప్రమాదకరం.

దామెర్ల సాయిబాబ

ఎన్నో ప్రజాసమస్యలు, ప్రభుత్వ విధానాలు కూలంకషంగా చర్చించి నిర్ణయాలు తీసుకొని దేశ ప్రజలకు దిశ, దశ నిర్దేశించాల్సిన, ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మగా రాజ్యాంగానికి పుట్టినిల్లుగా భావిస్తున్న దేశ అత్యున్నతసభా సమావేశాలు ఎలాంటి చర్చలు జరగకుండానే గతవారంలో నిరవధికంగా వాయిదాపడడం ప్రజాస్వామ్య వాదులు జీర్ణించుకోలేకపోతున్నారు. భారత్ ప్రస్తుతం అనేక సమస్యలతో అట్టుడికిపోతున్నది. ముఖ్యంగా మొన్నటి కరోనా రక్కసి విలయతాండవాన్ని ఎదురొడ్డి నిలిచిన వ్యవసాయరంగం ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. దేశంలో కొన్నిచోట్ల కుంభవృష్టి, వరదలతోప్రజలు అల్లాడుతుంటే మరికొన్ని చోట్ల వర్షాలులేక వరుణ యాగాలు చేస్తూ పంటలను దక్కించుకునేందుకు అన్నదాతలు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు. ఇంకొకపక్క అదుపులేకుండా పెరిగిపోతున్న ధరలతో నిరుపేదలే కాదు, సామాన్యులను, మధ్యతరగతి వర్గాలు అతలాకుతలమౌతున్నాయి. ఉన్న డబ్బును ఎలా ఖర్చుపెట్టాలో తెలియని నల్ల ధన స్వాములకు ఏ వస్తువ ధర ఎంత పెరిగినా చీకుచింతా లేదు కానీ రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేదలు, మధ్య తరగతి, జీతాల మీదనే ఆధారపడే వర్గాల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది.ఇంకొక పక్క దేశంలో నిరుద్యోగ సమస్య విలయతాండం చేసున్నది.పరీక్షలు సమర్థవంతంగా ప్రభుత్వం నిర్వహించలేకపోవడంతో యువత ఉద్యమాల బాట పట్టింది. కేంద్రమంత్రి రాజీనామా చేయాల్సిన పరిస్థితులు ఏర్పాడ్డాయి. ఇలాంటి ఎన్నో సమస్యలతో దేశం అతలాకుతలం అవుతుంటే మొన్న పంతొమ్మిది రోజులపాటు జరిగిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈ సమస్యల ప్రస్తావనే లేకుండా అధికార విపక్షాలు ఆందోళనల మధ్య పుణ్యకాలం గడిచిపోయింది. ఒక్కటంటే ఒక్క అంశం కూడా సమగ్రంగా సజావుగా చర్చలు లేకుండానే సమావేశాలు ముగిసిపోయాయి. సమావేశాల కాలం కూడా యేడాదియేడాదికి కుదించుకుపోతున్నది. ఇటీవల కాలంలో ఎన్నడూ లేనంతగాతక్కువ సమయం ఈసారి సభలు జరిగాయి. చర్చలు లేకుండానే పది బిల్లులకు ఆమోదముద్ర వేస్తే కేవలం రెండు బిల్లుల పైన మాత్రమే కొంతలోకొంత చర్చ జరిగింది. ఒక బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి అప్పగించారు. ముఖ్యమైన ప్రశ్నోత్తరాల సమయం ఒక్క రోజు కూడా నిర్వహించలేకపోయారు. పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ఢిల్లీలో విద్యార్థులు చేపట్టిన నిరసనలపై పోలీసులు వ్యవహరించిన తీరు, అయోధ్య రామమందిరం విరాళాల దుర్వినియోగంపైఉభయ సభల్లో తీవ్రస్థాయిలో గందరగోళం జరిగింది. ప్రతిపక్షాల నినాదాలు, వాదోపవాదాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఉభయ సభల కార్యకలాపాలకు రోజూ అంతరాయమే. వాయిదాలపర్వంతోనే సమావేశాలు కొనసాగాయి. రాజ్యసభలో చివరి రోజు జీరో అవర్ ప్రశ్నోత్తరాలను రద్దు చేశారు. గనులు, ఖనిజాల సవరణ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించిన అనంతరం ఛైర్మన్ సిపి రాధాకృష్ణన్ ప్రసంగిస్తూ సభాకార్యక్రమాలకు అంతరాయం కలిగిన తీరుపై ఆందోళన వ్యక్తంచేశారు. సభ్యులు ఈ మహోన్నత సభా గౌరవాన్ని నిలబెట్టాలని భారత ప్రజాస్వామ్య అత్యున్నత సంప్రదాయాలకు అనుగుణంగా తమ పార్లమెంటరీ బాధ్యతలను నిర్వహించాలని సూచించారు.ఈ సమావేశాలు నిరంతరం, గందరగోళం, తరచూ అంతరాయాలతో నిండిపోయి సభా కార్యకలాపాలు పదేపదే పట్టాలు తప్పడం విచారకర

## ఒక్క మాట

మని ఆవేదన వ్యక్తం చేశారు. అందరూ సమష్టిగా సభా కార్యక్రమాల్లో పాల్గొని విలువైన సూచనలు ఇచ్చి అర్థవంతమైన చర్చలు జరిపి ఉంటే పరిస్థితి కచ్చితంగా భిన్నంగా ఉండేదని ఛైర్మన్ వెల్లడించిన అభిప్రాయం ఎంతో ఆలోచించదగింది. ఇప్పుడేకాదు ఇంతకుముందు కూడా దేశ అత్యున్నత సభాసమావేశాలు ఇలా వాయిదాలతో కాలం గడవడం తరచుగా జరుగుతూనే ఉన్నది. రాష్ట్రాల్లో శాసన మండళ్ల సభాసమావేశాలు కూడా ఇందుకు భిన్నంగా జరగడం లేదు. కేవలం గుప్పెడు మంది సభ్యులు సమావేశానికి అంతరాయం కలిగించాలనుకుంటే వాయిదాలు వేయించడం పెద్ద సమస్యగా కన్పించడంలేదు. ఇక ప్రజాస్వామ్యంలో సమావేశాలకు సంబంధించి సర్వాధికారి స్పీకరే. ఇందుకు సభ్యుల తోపాటు స్పీకర్ కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఏ కోణంలో చూసినా అత్యున్నత గౌరవం ఇవ్వాల్సిన కుర్చీ అది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎందరో పెద్దలు ఆ పదవిని అధిష్టించి ఆ పీఠానికి వన్నె తెచ్చారు. ఏదో ఒకరిద్దరు తప్ప, ఒకటి, రెండు సందర్భాల్లో తప్ప ఎంతో బాధ్యతాయుతంగా వ్యవహరిం చారు. సామాన్య ప్రజల్లో కూడా స్పీకరంటే ఇప్పటికీ ఎంతో గౌరవభావాలున్నాయి. పాలక పక్షాన్ని ఇబ్బంది పెట్టకుండా ఇటు ప్రతిపక్షాన్ని అసంతృప్తికి గురిచేయకుండా స్పీకర్ నిష్పక్షపాతంగా, చాకచక్యంగా వ్యవహరించాలి.ఇది కత్తిమీద సాములాంటిదే. సొంత పార్టీ ఆగ్రహానికి గురికాకుండా ప్రజాసమస్యలను సమగ్రంగా చర్చించేందుకు అవకాశం ఇస్తూ ప్రజాప్రయోజనాలను కాపాడుతూ అదేసమయంలో స్పీకర్ పదవికి పక్షపాత దృష్టి సోకకుండా వ్యవహరించాల్సిన చాలా క్లిష్టమైన బాధ్యత అది. చెప్పినంత సులభం కాదు. దీనికి ఎంతో ఓర్పు, నేర్పు, విషయ అవగాహన, అన్నింటికంటే మించి సమయస్ఫూర్తి ఎంతో అవసరం. ఇప్పటివరకు లోక్‌సభ స్పీకర్లుగా వ్యవహరించిన వారందరూ ఆ స్థాయిలో వ్యవహరించారని చెప్పలేం కానీ అధిక శాతం ఆ పదవికి వన్నె తెచ్చిన వారే. ప్రస్తుత స్పీకర్ ఓంబిర్లా బాధ్యతాయుతంగా సభ హుందాతనాన్ని నిలబెడుతూ నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తున్నా అటు ప్రతిపక్ష, ఇటు అధికార పక్ష నేతలను సమన్వయంతో నడిపించలేకపోతున్నారనేది ప్రజాస్వామ్యవాదుల ఆవేదన. ప్రతిష్టంభన ఏర్పడినప్పుడు అధికార, ప్రతిపక్ష పార్టీలతో సమావేశాలు ఏర్పాటు చేసి చర్చించి సామరస్యపూర్వకమైన పరిష్కారం కనుగొనే ప్రయత్నం త్రికరణశుద్ధిగా జరగలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాదు స్పీకర్‌కు ఎన్నో అధికారాలున్నాయి. గతంలో సభానిర్వహణకు తరుచుగా అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకున్న సందర్భాలు లేకపోలేదు. సభా కార్యక్రమాల అజెండాకు ఎంత ప్రాముఖ్యత ఉందో వేరే చెప్పక్కర్లేదు.కోడెల కొట్లాటల్లో దూడల కాళ్లు విరిగినట్లు ఈ వ్యూహప్రతివ్యూహాల్లో నష్టపోయింది, పోతున్నది దేశప్రజలే. లోక్‌సభలో చర్చ జరిగినంత మాత్రాన ఈ సమస్యలన్నిటికి పరిష్కారం దొరుకుతుందని ఆశించడం లేదు. పార్లమెంటులో తమ ప్రతినిధులు తమ సమస్యల గూర్చి చర్చించారని ప్రజలకు కొంత ఊరట కలుగుతుంది. అసలు సమావేశాలే జరగన్వి కపోతే ఏమనుకోవాలి? ఎందుకోఏమోకానీ, కారణాలు ఎవరో, కారకులు ఎవరో కానీ దేశంలో సమావేశాల కాలం క్రమేణా తగ్గిపోతున్నది.స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటిలోక్‌సభ సగటున యేడాదికి 175రోజుల పాటు భేటీ జరిగింది. రెండో లోక్‌సభ 116కు, తొమ్మిదో లోక్‌సభ 85కు, పదిహేడోవ లోక్‌సభకు వచ్చేసరికి ఆ సంఖ్య 55కు పడిపోయింది. ఆ కొద్దిరోజులు కూడా ప్రజాసమస్యలపై నూతన విధానాలపై సమగ్ర చర్చ జరగకపోవడం బాధాకరం. కోట్లాది రూపాయల ప్రజాధనం వ్యయమయ్యే పార్లమెంటు సమావేశాల్లో సమగ్ర చర్చలకు నోచుకోకపోవడం అత్యంత బాధాకరమని ప్రజాస్వామ్యవాదులే ఆవేదన చెందుతున్నారు. పాలకులు ప్రజాప్రతినిధులమనుకునేవారు ప్రజాధనానికి కాపలాదారులమనే విషయాన్ని విస్మరించకూడదు. సమావేశాలకు ఒక్క నిమిషానికి రెండున్నర లక్షల రూపాయల ప్రజాధనం వ్యయం అవుతున్న విషయం పెద్దలు గుర్తుపెట్టుకోవాలి. పార్లమెంటు ఉభయ సభల్లో జరుగుతున్న తీరు ప్రజాస్వామ్యవాదులకు ఎంతో ఆవేదన కలిగిస్తున్నది. దేశంలో ఎన్నో రాష్ట్రాల శాసన, మండళ్ల సమావేశాలకు అనుకరణీయంగా, ఆదర్శంగా ఉండాల్సిన పార్లమెంట్ సమావేశాల పరిస్థితి ఇలా దిగజారడం అత్యంత దురదృష్టకరం. రాజకీయ వ్యవస్థపై విరక్తి కలుగుతున్నది. పరిపాలనా వ్యవస్థ పట్ల అవిశ్వాసం పెరుగుతున్నది. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకే ప్రమాదకరం. ●

# వరదలూ వస్తున్నాయి, నదులూ ఎండుతున్నాయి!

సి.హెచ్.ప్రతాప్

నది అంటే కేవలం ఒక చోటు నుంచి మరో చోటుకు ప్రవహించే నీరు కాదు, అది మనిషి జీవనానికి ఆధారం, వ్యవసాయానికి జీవనాడి, పరిశ్రమలకు వనరు, భూగర్భజలాల పునరుత్పత్తికి కీలక ఆధారం, పర్యావరణ సమతుల్యతకు ప్రాణధార. అయితే నదుల విషయంలో నేడు ఒక విచిత్రమైన విరుద్ధ పరిస్థితి కనిపిస్తోంది. ఒక వైపు కొన్ని నదుల్లో ప్రవాహం క్రమంగా తగ్గుతుండగా, మరోవైపు అదే దేశంలో మరికొన్ని ప్రాంతాలు ఆకస్మిక భారీ వర్షాలు, వరదలతో మునిగిపోతున్నాయి. ఒకవైపు నీటి కొరత.. మరోవైపు నీటి విధ్వంసం ఈ వైరుధ్యం ప్రకృతి సృష్టించిన సమస్య మాత్రమేనా, లేక వర్షపు నీటిని నిల్వ చేసుకోవడం, సమర్థంగా వినియోగించడం, సమానంగా పంచడం, నదుల సహజ ప్రవాహాన్ని కాపాడటంలో మన లోపాలను కూడా ప్రతిబింబిస్తోందా? భారతదేశంలో నదుల పరిస్థితి ఒకే విధంగా లేదు. కేంద్ర జల సంఘం గణాంకాల ప్రకారం 2001-2011తోపోలిస్తే 2011-2021లో కృష్ణా నది సగటు ప్రవాహం 18.76 నుంచి 12.99 బిలియన్ క్యూబిక్ మీటర్లకు, కావేరి 6.97 నుంచి 4.35 బిలియన్ క్యూబిక్ మీటర్లకు తగ్గాయి. మరో వైపు గోదావరి ప్రవాహం 80.83 నుంచి 86.22 బిలియన్ క్యూబిక్ మీటర్లకు, నర్మద 18.95 నుంచి 23.34 బిలియన్ క్యూబిక్ మీటర్లకు పెరిగాయి. కాబట్టి ప్రాంతాల వారీగా నీటి లభ్యత, వర్షపాతం, వినియోగం, ప్రవాహ మార్పులను అర్థం చేసుకోవడం అవసరం.అయితే ప్రమాద సంకేతాలు స్పష్టంగానే ఉన్నాయి. 2024 అంచనాప్రకారం భారత నదీ పరివాహక ప్రాంతాల్లో సగటువార్షిక జల వనరులు సుమారు 2,115.95 బిలియన్ క్యూబిక్ మీటర్లు. కానీ వినియోగానికి అందుబాటులో ఉండే నీరు సుమారు 1,137 బిలియన్ క్యూబిక్ మీటర్లకే పరిమితమవుతోంది. 2025లో తలసరి వార్షిక నీటి లభ్యత ఇప్పటికే నీటిఒత్తిడి సూచికగా పరిగణించే 1,700 క్యూబిక్ మీటర్లస్థాయి కంటే తక్కువగా ఉంది. ఈ పరిస్థితికి ఒకే కారణం లేదు. వాతావరణ మార్పు, అనిశ్చిత వర్షపాతం, అడవుల క్షీణత, నదీ పరీవాహక ప్రాంతాల్లో నిర్మాణాల పెరుగుదల, చెరువులు- కుంటల ఆక్రమణలు, భూగర్భజలాల అధిక వినియోగం, నీటి వృథా, కాలుష్యం పరస్పరం సమస్యను తీవ్రతరం చేస్తున్నాయి. ముఖ్యంగా వర్షంపడే విధానం మారుతోంది. తక్కువ వ్యవధిలో అత్యంత భారీ వర్షం కురిసి వరదలు రావచ్చు. ఆ తర్వాత సుదీర్ఘ విరామం ఏర్పడి నదిలో ప్రవాహం తగ్గిపోవచ్చు. అంటే నీటి పరిమాణం కంటే దాని సమయం, స్థలం, నిల్వ సామర్థ్యం కూడా కీలకమవుతున్నాయి.భూగర్భజలాల పరిస్థితి ఈ సమస్యకు మరో అద్దం. 2025లో దేశంలో వార్షిక భూగర్భజలపునరుత్పత్తి 448.52 బిలియన్ క్యూబిక్ మీటర్లు కాగా, వెలికితీయదగిన వనరు 407.75 బిలియన్ క్యూబిక్ మీటర్లు,మొత్తం వార్షిక వెలికితీత 247.22 బిలియన్ క్యూబిక్ మీటర్లు. దేశవ్యాప్తంగా భూగర్భజల వినియోగ స్థాయి 60.63 శాతంగా ఉంది. 6,762 అంచనా యూనిట్లలో730 యూనిట్లు ఇప్పటికే ఓవర్ ఎక్స్‌ప్లోయిటెడ్‌గా గుర్తించబడ్డాయి. అయితే భూగర్భజలం, నదులు వేర్వేరు వ్యవస్థలు కావు. నేలలోకి చేరే వర్షపు నీరు భూగర్భజలాలను పునరుత్పత్తి చేయడమే కాకుండా, ఎండాకాలంలో నదులకు చేరే సహజ బేస్‌ఫ్లోకు కూడా తోడ్పడుతుంది. కాబట్టి బోర్లు లోతుగా తవ్వడం మాత్రమే పరిష్కారం కాదు, నీరు నేలలోకి చేరే అవకాశాలను పెంచడమే అసలు పరిష్కారం. అందుకేనీటి నిర్వహణలో దృష్టి భారీప్రాజెక్టులపైనే కాకుండా పరివాహక ప్రాంతాల సమగ్ర సంరక్షణపై ఉండాలి. చెరువులు, కుంటలు, సరస్సులు, వాగులు పునరుద్ధరించాలి. వరద మైదానాలను రక్షించాలి. పట్టణాల్లో వర్షపు నీరునేరుగా కాలువ ల్లోకి వెళ్లకుండా రీచార్జ్ వ్యవస్థలను విస్తరించాలి. వ్యవసా యంలో తక్కువ నీటితో అధిక దిగుబడి ఇచ్చే పద్ధతులను ప్రోత్సహించాలి. పరిశ్రమలు, నగరాలు శుద్ధిచేసిన వ్యర్థ జలాన్ని తిరిగి వినియోగించే విధానాన్ని విస్తరించాలి. అత్యంత ముఖ్యంగా వరద నిర్వహణ, కరవు నిర్వహణను రెండు వేర్వేరు సమస్యలుగా చూడటం మానాలి. ఒకేనీటి చక్రంలో భాగమైన ఈ రెండు పరిస్థితులకు ఒకే సమగ్ర పరిష్కారం అవసరం. వర్షం వచ్చినప్పుడు వరదగా పోకుండా నిల్వచేయాలి. ఎండాకాలంలో అదే నీరునదులు, చెరువులు, భూగర్భజలాల ద్వారా అందుబాటులో ఉండేలా చూడాలి. నీటి సంక్షోభం ప్రకృతి వైపరీత్యంకాదు. నిర్వహణకు ఎదురైన పరీక్ష అని జలవనరుల శాస్త్రవేత్తలు అభిప్రా

## ప్రజావాక్కు

### అగ్నిమాపక సదుపాయాలు కల్పించాలి

దైవదర్శనం కోసం పుణ్యక్షేత్రాలకు వెళ్లిన భక్తులు దేవుడిని దర్శించకముందే ప్రాణాలు కోల్పోవడం కంటే విషాదకరమైన ఘటన మరొకటి ఉండదు. పశ్చిమ బెంగాల్‌లోని తారాపీఠ్ ఆలయం సమీపంలోని హోటల్‌లో అగ్ని ప్రమాదంలో ఏడుగురు భక్తులు సజీవదహనం కావడం, బిహార్‌లోని అశోక్‌ధామ్ ఆలయం సమీపంలో తొక్కిసలాటలో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం, పుణ్యక్షేత్రాల్లో భద్రతా ప్రమాణాలపైమరోసారితీవ్రంగా ఆలోచించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి. దేశంలోని ప్రముఖ ఆలయాలు, పుణ్యక్షేత్రాలకు ఏడాదిపొడవునా పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. పర్వదినాలు, ప్రత్యేక ఉత్సవాలు, జాతరల సమయంలో ఈ రద్దీ అనూహ్యంగా పెరుగుతుంది. ఇంతటి జనసందోహాన్ని నిర్వహించేందుకు తగిన ప్రవేశ-నిష్క్రమణ మార్గాలు, అత్యవసర స్పందనా వ్యవస్థలు,అగ్నిమాపకసదుపాయాలు,వైద్యసేవలు, శిక్షణ పొందినసిబ్బంది అందుబాటులోఉన్నదాన్నదేకీలక ప్రశ్న.

- సి.సాయిరుత్విక్, శ్రీకాకుళం

### జీవో 97ను రద్దు చేయాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన శక్తి స్కీమ్ వల్లమొదటగా పాలిటెక్నిక్‌విద్యార్థులు మోసపోతున్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువతీ యువకులకు ఉద్యోగాలు లేక నిరుద్యోగంతో అల్లాడుతున్నారు. పేద మధ్య తరగతి విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితులను దృష్టిలోపెట్టుకుని వృత్తివిద్యాకోర్సులు చేసి త్వరగా స్థిరపడి కుటుంబానికి అండగా నిలబడాలని పాలిటెక్నిక్‌లాంటికోర్సులు చదివిప్రభుత్వ,ప్రైవేటురంగ సంస్థలలో ఉద్యోగాలు చేయాలని తాపత్రయ పడుతూ పాలిటెక్నిక్ విద్యనుఅభ్యసించి ఇంజనీర్‌లుగాసేవలు అందిస్తున్నారు.రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే ఫీజురాయితీ ఇవ్వకుండా పాలిటెక్నిక్‌లో 140శాతం ఫీజులు పెంచింది. ఇప్పటికైనా ప్రభుత్వం పునర్‌ఆలోచించి శక్తిస్కీమ్ రద్దు చేయాలి.

- మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

### సాంకేతికత పట్ల అవగాహన అవసరం

నేడు సమాజంలో ప్రతి పనికి సాంకేతికత వినియోగం ఎక్కువైంది. కావున ప్రతి విషయంలో సాంకేతికత పట్ల అవగాహన పెంచుకుని మన పనులకు ఇతరులపై ఎక్కువగా ఆధారపడకుండా మనమే పరిష్కరించుకోవడానికి అవకాశం ఉంటుంది.

- మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

### మత్తు పదార్థాలు మానివేస్తే మంచి భవిష్యత్తు

చిన్నా పెద్దా తేడాలేదు, మంచీచెడు తారతమ్యత లేదు. గురు శిష్యుల సంబంధాలు దెబ్బతింటున్నాయి. తండ్రీ కొడుకులకు తగాదాలుపెడుతున్నాయి.అన్నదమ్ముల ఆప్యాయతలు నశిస్తున్నాయి. కుటుంబాలు వికలమోతున్నాయి. వీటికి ప్రధాన కారణం మత్తు పదార్థాలు. సభ్యసమాజం ఛీత్కరించుకున్నా భూతంలా వెంటాడుతన్నవి. నేడు మత్తు పదార్థాల (డ్రగ్స్) వినియోగం యువతను,విద్యార్థులనుతీవ్రంగా నాశనం చేస్తోంది. ఇది సమాజంలో నేరాలకు, అనారోగ్యానికి, కుటుంబాల ఛిన్నాభిన్నానికి ప్రధాన కారణమవుతున్నాయి. వీటిని నివారించడానికి కుటుంబం, పాఠశాలలు, ప్రభుత్వం, సమాజం కలిసికట్టుగా బలమైన చర్యలు తీసుకున్నప్ప టికీ చెదురుమదురు సంఘటనలు జరుగుతునే ఉన్నాయి. కావునచట్టాలను కఠినంగా అమలు చేయడం,యువతకు సరైన అవగాహన కల్పించడంద్వారానేఈమహమ్మారిని అరికట్టవచ్చు.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

### రచయితలను ఆదుకోవాలి

ఒక అక్షరం వేయి గుండెలను మేలుకొలుపుతుంది. ఒకపాట ఒక నియంతను గద్దె దింపుతుంది. ఒక పుస్తకం సమాజాన్ని జాగతృతంచేసి దేశ ప్రగతికి అవసరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి బాటలు వేస్తుంది.పుస్తకాన్ని ఎటువంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంసహాయం లేకుండా ఎక్కడైనా ఎప్పుడైనా పాఠకుడు చదవబానికి అవకాశం ఉంది. అదే డిజిటల్ మాధ్యమానికి ఆ సౌలభ్యంలేదు.సమాజాన్ని సరైన పంథాలో పెట్టడానికి రాబోయే కాలంలో ప్రజలకు ఎదురయ్యే కష్టాలను ఏకరువు పెట్టడానికి రచయిత తన కాలాన్ని కత్తిలా ఉపయోగించి అక్షరయజ్ఞం చేస్తాడు. ప్రతిఫలాన్ని ఆశించకుండా తన విజ్ఞానాన్ని ఆర్థిక స్థోమతను వినియోగించి రచనలు చేసి ముద్రించి గ్రంథాలను విఫణివీధిలోకి తెస్తున్నాడు.

- జి. నరసింహాప్రసాద్, నాగారం

### పరిశుభ్రత ప్రతి పౌరుడి కర్తవ్యం

నేడు కొందరు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడం, ప్లాస్టిక్ సీసాలు, కవర్లు, ఆహార అవశేషాలు రోడ్లపై పడేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. చెత్తను నిర్లక్ష్యంగా పారేయడంవల్ల దుర్వాసన, దోమలు,ఈగలు పెరిగి అనేక వ్యాధులు వ్యాపించే ప్రమాదంఉంది.మన ఇల్లు ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో, మన వీధులు, పార్కులు, బహిరంగ ప్రదేశాలు కూడా అంతే శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.


గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# చట్ట సభల్లో బిసిలకు సాధికారత ఇంకెప్పుడు?

దాడిశెట్టి శ్యామ్ కుమార్

దేశంలో చాలా రాష్ట్రాల్లో తరచుగా బీసీల సాధికారత పై చర్చ జరుగుతున్నది. ప్రధానంగా విద్యా ఉద్యోగ ఉపాధి అవకాశాల్లో చట్టసభల్లో రాజ్యాధికారం తోపాటు ఆర్థిక సామాజిక అనేక రంగాలలో ప్రత్యక్షంగా, పరోక్షంగా బీసీ సామాజిక వర్గాలు ఎంతో కొంత వెనుకకు నెట్టివేయ పడుతున్నాయనే సంశయం బీసీ వర్గాల్లో కొనసాగుతూ వస్తున్నది. దేశంలో ఎలక్షన్లు వచ్చినప్పుడల్లా ప్రధాన రాజకీయ పార్టీలలో ఎక్కువగా ఉన్నత సంపన్న వర్గాల వారే అభ్యర్థులుగా ఉండడంతో చట్టసభల్లోకి బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు తగినంతగా రాలేకపోతున్నారని, దాదాపు అన్ని నియోజకవర్గాల్లో అత్యధిక శాతం ఉన్న బీసీలు కేవలం ఓటు బ్యాంకుగానే మిగిలిపోతున్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. కారణాలేవైనా చట్ట సభల్లోకి వెళ్లాలంటే ప్రజల ఆదరణతో పాటు ఆర్థిక స్తోమత కలిగి ఉంటే సరిపోతుందనే రీతిలో ఎలక్షన్లు కూడా జరుగుతున్నాయానే అనుమానాలు సమాజంలో లేకపోలేదు. ఎలక్షన్లు వచ్చినప్పుడల్లా ఓట్లు నోట్లతో కాకుండా స్వచ్ఛందంగా ఓటర్లు సరైన నాయకత్వాన్ని ఎన్నుకునే రీతిలో ఉండాలి కానీ ఎన్నికల్లో కొందరు ఓటర్లు నోట్లతో తడబడుతున్నారేమో అనిపిస్తుంటుంది. సాధారణంగా దేశంలో అనేక రంగాల్లో శ్రామిక జీవనం గడుపుతున్న వాళ్లలో బీసీ, ఎస్సీ ఎస్టీలు మైనార్టీలతో పాటు వివిధ కులాల్లోని ఆర్థికంగా వెనుకబడిన వారే ఉంటున్నారన్న భిన్న అభిప్రాయాలు ఉన్నప్పటికీ, దేశంలో కుల ప్రాతిపదికన మిగతా కులాలతో పోలిస్తే ఉన్నత సంపన్న వర్గాలు ఎంతో కొంత పారిశ్రామిక రంగంలో ఆర్థిక వ్యవస్థలో మాత్రం బలోపేతంగా ఉంటున్నారనే భిన్న అభిప్రాయాలు తరచుగా వినిపిస్తుంటాయి. అడపా దడపా ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ కూడా వివిధ సామాజిక వర్గాల అవసరాలను,ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు రాష్ట్రాలలో ఏర్పాటు అవుతున్న ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నప్పటికీ బీసీ వర్గాల స్థితిగతులు ఆశించిన స్థాయిలో లేవనే వాదనలు వినిపిస్తుండడంశోచనీయం. అందుకు చట్టసభల్లో వెనుకబడిన సామాజిక వర్గాలకు చెందిన నాయకత్వం సరిపడా లేకపోవడం కూడా ఒకలోపంగా మారుతుందేమో. దీనివల్ల చట్టసభల్లో కొంత ఉన్నత వర్గాల నుండి గెలుపొందిన వారి ప్రాబల్యం ఉండడం ఒక ఎత్తైతే వెనుకబడిన తరగతుల సామాజిక వర్గాలకు కావాల్సిన విధివిధానాలు రూపొందించాల్సి వచ్చే సందర్భాల్లో బీసీ సామాజిక వర్గాల ప్రాధాన్యత తగినంత ఉంటే బీసీకులాల వారికి మేలు జరుగుతుందనే నమ్మకం బీసీ సామాజిక వర్గాలలో ఉండడం మరోఎత్తు అవుతున్నది. అయితే ఒక వేళ




చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు అనివార్యమైనా, కాకపోయినా మునుముందు బీసీ సామాజిక వర్గంవారు ఎలక్షన్లు వచ్చినప్పుడు రాజకీయ పార్టీలకతీతంగా బీసీ అభ్యర్థులకు మాత్రమే ఓట్లువేసి, గెలిపిస్తే తద్వారా చట్టసభల్లోకి బీసీలు అధిక సంఖ్యలో రాగలుగుతారని, రిజర్వేషన్ల గురించి వేచిచూడడం కన్నా బీసీలు ఐక్యంగా ఎలక్షన్లలో రాజకీయాలతో సంబంధం లేకుండా బీసీతరఫు నుండి పోటీ చేసే అభ్యర్థులకే ప్రాధాన్యత ఇచ్చే విధంగా బీసీ ఓటర్లు బీసీ అభ్యర్థులను చట్ట సభల్లోకి తీసుకుపోవాల్సిన ఆవశ్యకత ఉంటుందనే విషయమై కొంతమంది బీసీవర్గాల మేధావుల్లో, ప్రజల్లో చర్చ లేకపోలేదు. తెలంగాణ ప్రభుత్వం కూడా విద్య, ఉద్యోగ ఉపాధి రాజకీయఅంశాల్లో బీసీల రిజర్వేషన్ల పెంపు విషయమై సానుకూలంగా ఉన్నప్పటికీ ఆ ప్రక్రియ ఇంకా పూర్తి కావాల్సి ఉంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జనాభా లెక్కలు,కులగణన లాంటి అంశాలను పరిగణలోకి తీసుకుని ఎలక్షన్లు వచ్చేవరకైనా కుల ప్రాతిపదికన రిజర్వేషన్ల ప్రక్రియను చట్టసభలు ఆమోదించే విధంగా రాజకీయా లకతీతంగా అన్నిపార్టీలలో ఉన్న బీసీ ప్రతినిధులు మరింత ఐక్యతతో ప్రయత్నిస్తే కచ్చితంగా దేశవ్యాప్తంగా జనాభా కనుగుణంగా ఉన్నటు వంటి వెనుకబడిన తరగతుల కులాల వారి ప్రాతినిధ్యం చట్టసభల్లో మరింత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేసేవారు లేకపోలేదు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో రాబోవు కాలంలో బీసీల ప్రాధాన్యతను అన్ని రాజకీయ పార్టీలుమరింతగా గుర్తించేందుకు సాధికారత కోసం బీసీ సామాజిక వర్గంలోని కొంతమంది ప్రయత్నాలు ముమ్మరం చేస్తూనే, బీసీ రిజ ర్వేషన్ పెంపు బిల్లుపై ప్రధాన పార్టీలపై ఒత్తిడి పెంచుతూ బీసీ సామాజిక వర్గంలోని నాయకులనే ఆయా సామాజిక వర్గం ఓటర్లు ఎన్నుకునే విధంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తుండడం గమనార్హం.రాబోయే పార్లమెంట్ అసెంబ్లీ ఎలక్షన్లలోపు పూర్తిస్థాయిలో రిజర్వేషన్‌పెంపు బిల్లు సఫలీ కృతం అయితే దేశంలో బీసీ ప్రజలు ఓటు బ్యాంకుగానే కాకుండా రాజ్యాధికారంలో తమవంతు పాత్రను పోషించడంతోపాటు, వెనుకబడిన తరగతుల కులాలసాధి కారత దిశగా బీసీ ప్రజల అభ్యున్నతికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందనిఅంచనా. ఏదిఏమైనప్పటికీ వాస్తవ పరిస్థితులు ఎలాఉన్నా వెనుకబడిన తరగతుల కులాలు చట్టసభలో రాజకీయంగా బలపడేందుకు ప్రయత్నిస్తుండడంతో రాజకీయపార్టీలు కూడా బీసీ,ఎస్సీ,ఎస్టీ ఇతర సామాజిక వర్గాలకు మరింత ఎక్కువ ప్రాధాన్యత కల్పించేదిశగా ప్రత్యేక దృష్టి సారిస్తుండడం గమనార్హం. తద్వారా జనాభా ప్రాతిపదికన ఆయా సామాజిక వర్గాలకు చెందిన కులాలకు సాధ్యమైనంతగా చట్టసభలతో పాటు అన్నిరంగాల్లో కావాల్సినంత రిజర్వేషన్ కల్పిస్తూ అన్ని సామాజిక వర్గాల ప్రాతినిధ్యం ఉండేలా చేస్తే అన్ని వర్గాల ప్రజలకు మరింత ప్రయోజనం ఉంటుంది. ●

22-8Pg5:22-8Pg5.qxd 8/22/2026 12:15 AM Page 1



# డిగ్రీ ఉన్నా యువతకు ఏవీ ఉద్యోగాలు?

## నీతి ఆయోగ్ ప్రత్యేక నివేదిక



**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** భారతదేశంలో ఉన్నత విద్య పూర్తిచేస్తున్న వారి సంఖ్య ఏటేటా పెరుగుతున్నా, వారి అర్హతకు తగిన ఉద్యోగాలు పొందడంలో తీవ్రంగా విఫల మవుతున్నారని నీతి ఆయోగ్ ఆందోళన వ్యక్తం చేసింది. దేశంలోని కళాశాల విద్యకు, ఉద్యోగ మార్కెట్ అవసరాలకు మధ్య తీవ్ర అంతరం ఉందని తన తాజా నివేదికలో స్పష్టం చేసింది. "వికసిత్ భారత్ 2047 కోసం నైపుణ్యాలపై పునరాలోచన పేరుతో ఆగస్టు మధ్యలో విడుదల చేసిన ఈ పత్రంలో పలు కీలక విషయాలను వెల్లడించింది. నివేదిక ప్రకారం, దేశంలో డిగ్రీ పూర్తి చేస్తున్న వారిలో కేవలం 8.25 శాతం మంది మాత్రమే తమ చదువుకు సంబంధించిన ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. కళాశాలల్లో బోధించే సిలబస్‌కు, పరిశ్రమల వాస్తవ అవసరాలకు మధ్య ఏమాత్రం పొంతన ఉండటం లేదని నీతి ఆయోగ్ తేల్చి చెప్పింది. చాలా విద్యాసంస్థల్లో పాఠ్యప్రణాళికలు కాలం చెల్లినవిగా ఉన్నాయని, అవి పరిశ్రమల డిమాండ్లకు అనుగుణంగా లేవని పేర్కొంది. బీఏ, బీకాం, బీఎస్సీ వంటి సాధారణ డిగ్రీలు నేరుగా ఉద్యోగాలను అందించడంలో విఫలమవుతున్నాయని, కనీస స్థాయి ఉద్యోగాలకు కూడా అదనపు ప్రాక్టికల్ నైపుణ్యాలు అవసరమవుతున్నాయని వివరించింది. ఈ సమస్యపై విద్యార్థుల్లోనూ స్పష్టమైన అవగాహన ఉన్నట్లు నివేదిక తెలిపింది. తమ చదువులో నైపుణ్యాల కొరత ఒక ప్రధాన సమస్య అని 34 శాతం మంది విద్యార్థులు అభిప్రాయపడగా, ఇంటర్వ్యూలకు సరిగా సిద్ధం కాలేకపోతున్నామని మరో 18 శాతం మంది పేర్కొన్నారు. పరిమితంగా ఉండే ప్రభుత్వ ఉద్యోగాల కోసం నెలకొన్న తీవ్రమైన పోటీనే ఈ సంక్షోభానికి నిదర్శనమని నీతి ఆయోగ్ అభిప్రాయపడింది. ఇటీవలి కాలంలో కేవలం 55వేల ప్రభుత్వ పోస్టుల కోసం ఏకంగా 1.86 కోట్ల దరఖాస్తులు రావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోందని తెలిపింది. ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు నీతి ఆయోగ్ కొన్ని కీలక పరిష్కారాలను సూచించింది. 6వ తరగతి నుంచే విద్యార్థులకు ఉపాధి, వ్యవస్థాపక నైపుణ్యాలపై శిక్షణ ప్రారంభించాలి. అప్రెంటిస్‌షిప్‌లను ఉద్యోగాలు పొందేందుకు ఒక ప్రధాన మార్గంగా మార్చాలి నియామకాల్లో డిగ్రీలకే అధిక ప్రాధాన్యం ఇవ్వకుండా, అభ్యర్థుల వాస్తవ నైపుణ్యాలను అంచనా వేసే విధానం తీసుకురావాలి. డిగ్రీ కోర్సుల్లో పరిశ్రమలకు సంబంధించిన ప్రాక్టికల్ శిక్షణను తప్పనిసరి చేయాలి. కేవలం పట్టభద్రుల సంఖ్యను పెంచడం వల్ల ప్రయోజనం లేదని, నైపుణ్యాల అంతరాన్ని పూడ్చకపోతే 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలన్న లక్ష్యానికి ఆటంకం కలుగుతుందని నీతి ఆయోగ్ హెచ్చరించింది. దేశానికి ఉన్న జనాభా ప్రయోజనం, అవకాశంగా మారాల్సింది పోయి భారంగా మారే ప్రమాదం ఉందని స్పష్టం చేసింది.



# ఎమ్మెల్యేలందరికి 'కారు' పథకం!

## తమిళ సిఎం విజయ్ ప్రతిపాదనను తిరస్కరించిన డిఎంకె

**చెన్నై, ఆగస్టు 21:** తమిళనాడులో అధికార టీవీకే, ప్రతిపక్ష డీఎంకే మధ్య వాహనాల కేటాయింపు వ్యవహారం రాజకీయ దుమారానికి దారితీసింది. రాష్ట్రంలోని ఎమ్మెల్యేలందరికీ ప్రభుత్వ ఖర్చుతో కార్లు అందజేస్తామని ముఖ్యమంత్రి విజయ్ చేసిన ప్రకటనను డీఎంకే తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ ప్రతిపాదనను తమ పార్టీ తిరస్కరిస్తున్నట్లు ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ స్పష్టం చేశారు. శుక్రవారం అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి విజయ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 234మంది ఎమ్మెల్యేలకు నియోజకవర్గ పనుల నిమిత్తం ప్రభుత్వ వాహనాలు సమకూర్చుతామని ప్రకటించారు. వీటితో పాటు డ్రైవర్, ఇంధనం, నిర్వహణ ఖర్చుల కోసం నెలకు రూ. 75,000 అలవెన్స్ కూడా మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఆర్థిక నేపథ్యంలేని కొత్త ఎమ్మెల్యేలకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని, పారదర్శకమైన, అవినీతిరహిత పాలనకు ఈ నిర్ణయం దోహదపడుతుందని ప్రభుత్వం పేర్కొంది. అయితే, ప్రభుత్వ నిర్ణయంపై డీఎంకే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రాష్ట్రం అప్పుల్లో ఉందని పదేపదే చెబుతున్న టీవీకే ప్రభుత్వం, ఇప్పుడు ఎమ్మెల్యేలకు కార్లు పంపిణీ చేయడమేమిటని ఉదయనిధి స్టాలిన్ ప్రశ్నించారు. తమ పార్టీకి చెందిన 59 మంది ఎమ్మెల్యేలు ఈ కార్లను తీసుకోబోరని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యేల ఎన్నికల అఫిడవిట్లను పరిశీలించి, సొంత వాహనాలు లేని వారికి మాత్రమే ఈ సౌకర్యం కల్పించాలని ఆయన సూచించారు. డీఎంకే విమర్శలపై మంత్రి ఆధవ్ అర్జున స్పందించారు. ఈ పథకం కింద సొంతంగా కారు లేని ఎమ్మెల్యేలకు మాత్రమే వాహనాలు కేటాయిస్తామని ఆయన స్పష్టతనిచ్చారు. ఇది విలాసంకాదని, ప్రజాసేవకు అవసరమైన కనీస సదుపాయమని వ్యాఖ్యానించారు. అనేక బంగ్లాలు ఉన్నప్పటికీ ఉదయనిధి స్టాలిన్ ప్రభుత్వ క్వార్టర్స్‌లో ఎందుకు నివసిస్తున్నారని ఆయన నిలదీశారు. ముఖ్యంగా చిన్న పార్టీల నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలకు ఈ వాహనాలు ఎంతో అవసరమని ప్రభుత్వం తన నిర్ణయాన్ని సమర్థించుకుంది.

# షిర్డీ సాయిబాబాపై అభ్యంతర విడియోలు

## ఢిల్లీ కోర్టులో షిరిడి సంస్థాన్ పిటిషన్

**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** షిర్డీ సాయిబాబాపై యూట్యూబ్, ఇతర ఆన్‌లైన్ వేదికల్లో ఉన్న అభ్యంతరకర వీడియోలు, కథనాల తొలగింపు విషయంలో ఢిల్లీ హైకోర్టు మరోసారి జోక్యం చేసుకుంది. ఆదేశాలు జారీ చేసినప్పటికీ కొన్ని యూఆర్‌ఎల్‌లు ఇంకా తొలగించలేదని షిర్డీ సంస్థాన్ ట్రస్ట్ ఆశ్రయించడంతో కేంద్ర ప్రభుత్వం, గ్రీవెన్స్ అప్పిలేట్ కమిటీ (జీఏసీ), గూగుల్‌కు ఉన్నత న్యాయస్థానం కొత్తగా నోటీసులు జారీ చేసింది. సాయిబాబాను చాంద్ మియా, జిహాదీ, హంతకుడు రేపిస్ట్, బ్రిటిష్ గూఢచారి, దొంగ వంటి తీవ్రమైన పదజాలంతో చిత్రీకరిస్తూ, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా మార్చి నెల నుంచి కొన్ని వీడియోలు, కంటెంట్ ప్రచారంలో ఉన్నాయని ష్రీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ (షిర్డీ) తమ పిటిషన్‌లో ఆరోపించింది. ఈ కంటెంట్ కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీస్తోందని పేర్కొంది. ఈ కంటెంట్ తొలగించాలని మొదట యూట్యూబ్‌ను సంప్రదించగా, కోర్టు ఆదేశాలు లేకుండా కుదరదని వారు తిరస్కరించారు. దీంతో ట్రస్ట్ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ స్వర్ణ కాంత శర్మ నేతృత్వంలోని ధర్మాసనం, ఆగస్టు 11న ఈ అంశంపై 7 రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాలని గ్రీవెన్స్ అప్పిలేట్ కమిటీ (జీఏసీ)ని ఆదేశించింది. ఆగస్టు 13న సమావేశమైన జీఏసీ, ఈ వీడియోలు మత విశ్వాసాలను దెబ్బతీస్తాయని, సామాజిక సామరస్యానికి విఘాతం కలిగిస్తాయని నిర్ధారించి, వాటిని తొలగించాలని ఆదేశాలు ఇచ్చింది. జీఏసీ ఆదేశాల తర్వాత కూడా కొన్ని వీడియోలు, సుమారు 200కు పైగా యూఆర్‌ఎల్‌లు ఇంకా ఆన్‌లైన్‌లోనే ఉన్నాయని ఆగస్టు 20న ట్రస్ట్ మళ్లీ కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. దీంతో హైకోర్టు తాజాగా నోటీసులు జారీ చేసింది. కొత్త ఫిర్యాదులు వస్తే వాటిని కూడా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. ఈ కేసులో తదుపరి విచారణను సెప్టెంబర్ 7వ తేదీకి వాయిదా వేసింది. అభ్యంతరకర కంటెంట్‌ను 24గంటల్లోగా తొలగించాలని ఇంటర్మీడియ రీలకు ఆదేశాలు జారీ చేశామని కేంద్ర ప్రభుత్వం కోర్టుకు తెలియజేసింది.

# దేశభద్రతకు సరిహద్దుల పటిష్టత అత్యంత ఆవశ్యకం

## ఎస్ఎస్‌పి కేంద్రకార్యాలయ భవన నిర్మాణాలకు అమిత్‌షా భూమిపూజ



**కోల్‌కత్తా, ఆగస్టు 21:** కొత్తగా నిర్మించనున్న భారీ ఎస్ఎస్‌బీ పరిపాలనా భవనం సరిహద్దు రక్షణ చర్యలను నిరంతరం పర్యవేక్షించడానికి, పెద్ద ఎత్తున బలగాలను మోహరింపజేయడానికి ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. జాతీయ భద్రత విషయంలో కేంద్రం వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దేశంలో శాంతిభద్రతలు వర్ధిల్లాలన్నా, పశ్చిమ బెంగాల్‌తో పాటు దేశమంతటా సురక్షిత వాతావరణం నెలకొనాలన్నా సరిహద్దు వెంబడి శత్రువుల కదలికలను పూర్తిగా అరికట్టడం అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ దిశగా భద్రతా బలగాలకు అవసరమైన అన్ని వసతులను కల్పిస్తున్నట్లు వెల్లడించారు. పశ్చిమ బెంగాల్‌లో అత్యంత వ్యూహాత్మక ప్రాంతమైన సిలిగురి కారిడార్ రక్షణను మరింత బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం నూతన చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సిలిగురిలో దాదాపు 80 ఎకరాల విస్తీర్ణంలో సశస్త్ర సీమ బల్ ఫ్రాంటియర్ ప్రధాన కార్యాలయ పరిపాలనా భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి సువేందు అధికారితో కలిసి కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో అమిత్ షా మాట్లాడారు. దేశ సరిహద్దులు బలోపేతం కానంత వరకూ భారత్ ఎంత మాత్రం సురక్షితంగా కాదని తేల్చి చెప్పారు. నలుమూలలా వ్యాపించి ఉన్న సరిహద్దులను మరింత పటిష్ట పర్చుకోవాల్సి ఉందని అన్నారు. సిలిగురి కారిడార్‌ను దేశంలో అత్యంత సున్నితమైన, భౌగోళిక వ్యూహాత్మక ప్రతిపత్తి కలిగిన ప్రాంతమని ఆయన వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు దీనికి తగిన ప్రాధాన్యత దక్కలేదని పేర్కొన్నారు. దేశంలోని ఈశాన్య రాష్ట్రాలను ప్రధాన భూభాగంతో అనుసంధానించే ఈ చికెన్స్ నెక్ ప్రాంత భద్రత దేశ సార్వభౌమాధికారానికి ఎంతో కీలకమని అమిత్ షా అన్నారు. ఇక్కడ ఈ సందర్భంగా గత తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై అమిత్ షా తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్‌బంగ్లాదేశ్ సరిహద్దుల వెంబడి చొరబాట్లను నిరోధించేందుకు కంచె వేయాలని కేంద్రం భావించినప్పటికీ దీనికి కావలసిన భూమిని కేటాయించడంలో గత మమత బెనర్జీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. సరిహద్దుల రక్షణ పటిష్ట పర్చడానికి తాము 2014 నుంచి దాదాపు 1,129 ఎకరాల భూమిని పదేపదే కోరుతున్నప్పటికీ నాటి పాలకుల నుంచి సరైన సహకారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ రక్షణ కోసం రేయింబవళ్లు శ్రమిస్తున్న సేనలను రాజకీయాలకు అతీతంగా చూడాలని అమిత్ షా ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు.

# మోడీ మాదేవుడు.. ప్రెస్‌క్లబ్‌లో మోడీ చాలీసా




**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** ప్రధాని నరేంద్ర మోడీని దేవుడిగా చిత్రీకరిస్తూ ఢిల్లీలోని ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియాలో నిర్వహించిన మోడీ చాలీసా కార్యక్రమం పెనుదుమారం రేపింది. ఈ కార్యక్రమానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. బీహార్ రాష్ట్ర ట్రాన్స్‌జెండర్ సంక్షేమ బోర్డుసభ్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని మోడీ శ్రీరాముడి రూపంలో చిత్రీకరించిన భారీ కటౌట్‌ను దేవుడి రూపంలో నిలబెట్టి, జైజై మోడీ, హర్‌హర్ మోడీ అంటూ నినాదాలు చేస్తూ హారతులు ఇచ్చారు. ఈ ఘటనపై తీవ్రవ్యతిరేకత రావడంతో ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియా (పీసీఐ) వెంటనే స్పందించి వివరణ ఇచ్చింది. ఈ కార్యక్ర మంతో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. ఓ ప్రెస్ కాన్ఫరెన్స్ కోసం నిర్వాహకులు హాల్‌ను అద్దెకు తీసుకున్నారని, కానీ వారు నిబంధనలను ఉల్లంఘించి మతపరమైన కార్యక్రమాన్ని నిర్వహించారని పీసీఐ ఎక్స్ వేదికగా తెలిపింది. విషయం తెలియగానే తమ అధికారులు జోక్యం చేసుకుని కార్యక్రమాన్ని మధ్యలోనే నిలిపివేశారని పేర్కొంది. ఈ కార్యక్రమాన్ని బీహార్ ట్రాన్స్‌జెండర్ సంక్షేమ బోర్డు వైస్‌ప్రెసిడెంట్ రాజన్ సింగ్ గట్టిగా సమర్థించుకున్నారు. మోడీ ప్రభుత్వం వల్లే తమ కమ్యూనిటీకి తొలిసారిగా హక్కులు, ఉపాధి అవకాశాలు లభించాయని ఆయన అన్నారు. అందుకే తాము ఆయన్ను దైవంగా భావిస్తున్నామని తెలిపారు.

# వ్యూహాం మార్చిన రాహుల్..

## జెన్‌జీ, యువతుల సమస్యలపైనే ఎక్కువ ఫోకస్



**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** భారీ సభలు, సుదీర్ఘ సమయం ప్రసంగాలు, రాజకీయ నినాదాలు లాంటి సంప్రదాయ ప్రచారానికి భిన్నంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇప్పుడు యువతతో నేరుగా మాట్లాడుతున్నారు. ముఖ్యంగా జనరేషన్‌జెడ్ (జెన్‌జీ), యువతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వారితో ముఖాముఖి చర్చిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగానూ అదే తరహా సంభాషణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. యువతను చేరుకునే ఈ ప్రయత్నం ఛాత్రోంకీ గూంజ్ కార్యక్రమంతో మరింత ఊపందుకుంది. పోటీ పరీక్షల ఒత్తిడి, పేపర్ లీకులు, విద్యా వ్యవస్థలో జాప్యం వంటి సమస్యలపై ఇందులో చర్చలు జరిగాయి. కోటా, డెహ్రాడూన్, ప్రయాగ్‌రాజ్ వంటి కేంద్రాల్లో మొదలైన ఈ కార్యక్రమం క్రమంగా విస్తరించింది. ఇటీవల పూణెలో జరిగిన కార్యక్రమాల్లో రాహుల్ గాంధీ యువతుల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. కెరీర్‌లో ఎదురయ్యే అడ్డంకులు, భద్రత, ఉద్యోగ ప్రదేశాల్లో పరిస్థితులు, కుటుంబం, సమాజం విధించే ఆంక్షలపై వారితో మాట్లాడారు. సమాజం తమను ఎలా చూస్తోంది భయాన్ని ఎలా ఉపయోగిస్తున్నారు ఎలాంటి హింసను ఎదుర్కొం టున్నారు. అది ఎక్కడ జరుగుతోంది వంటి అంశాలపై యువతులు తమ అనుభవాలను పంచుకోవాలని రాహుల్ కోరారు. మహిళా సహచరులు పంచుకున్న వ్యక్తిగత అనుభవాలను కూడా రాహుల్‌గాంధీ చర్చకు తీసుకొచ్చారు. శ్రద్ధ పేరుతో నియంత్రణ, చిన్న వయసులో పెళ్లి, పితృస్వామ్య భావజాలం, నైతిక పోలిసింగ్, భద్రత, వైద్య సదుపాయాల కొరత, వ్యక్తిగత నిర్ణయాలపై ఆంక్షల వంటి అంశాలు చర్చకు వచ్చాయి. డిజిటల్ వేదికల్లోనూ ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రశ్నలుసమాధానాలు, రీల్స్ వంటి సులభమైన ఫార్మాట్లతో యువతను చేరుకుంటున్నారు. గిగ్ ఎకానమీలో ఉద్యోగ భద్రత, మానసిక ఆరోగ్యం వంటి ఆధునిక సమస్యలపై మాట్లాడుతున్నారు. రాహుల్‌గాంధీ వ్యూహంలో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు అన్నారు. భారీ ప్రసంగాల నుంచి నేరుగా సంభాషణ వైపు ఆయన అడుగులు వేస్తున్నారు. యువత ఏం ఆలోచిస్తోంది ఏ సమస్యలను ఎదుర్కొంటోంది తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. రాజకీయ సంభాషణను ఏకపక్ష ప్రసంగం నుంచి రెండు వైపుల చర్చగా మార్చడమే ఈ వ్యూహం లక్ష్యంగా కనిపిస్తోంది.

# రాజధానిలో పెరుగుతున్న స్వైన్‌ఫ్లూ కేసులు

## పరిస్థితిని సమీక్షించిన కేంద్రమంత్రి జెపి నడ్డా




**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** దేశంలో వాతావరణంలో వచ్చిన ఆకస్మిక మార్పులతో పాటు మారుతున్న ఉష్ణోగ్రతలు ప్రజారోగ్యానికి సవాలుగా మారాయి. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీలో ఉక్కపోత, తేమతో కూడిన వాతావరణం కారణంగా స్వైన్ ఫ్లూ (హెచ్1ఎన్1) కేసులు వేగంగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా వ్యాధి పరిస్థితులు, ఆసుపత్రుల సన్నద్ధతపై కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా శుక్రవారం ఉన్నత స్థాయి అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఢిల్లీ ఆరోగ్య శాఖ మంత్రి పంకజ్ కుమార్ సింగ్‌తో పాటు పలువురు సీనియర్ వైద్యాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమీక్షా సమావేశంలో భాగంగా దేశవ్యాప్తంగా నమోదు అవుతున్న ఊపిరితిత్తుల సంబంధిత ఇన్ఫెక్షన్లు, తీవ్రమైన శ్వాసకోశ సమస్యల ట్రెండ్స్‌ను మంత్రి నిశితంగా పరిశీలించారు. వ్యాధి తీవ్రతను అంచనా వేయడానికి ల్యాబ్ పరీక్షలు, నమూనాల సేకరణ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని నడ్డా స్పష్టం చేశారు. ఢిల్లీ ఆసుపత్రుల్లో బెడ్లు, మందులు సిద్ధం హైఅలర్ట్‌లో ఉన్న రాజధాని ఢిల్లీలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల సన్నద్ధతను ప్రత్యేకంగా సమీక్షించారు. బాధితులకు తక్షణ వైద్యం అందించేందుకు అవసరమైన ఐసొలేషన్ వార్డులు, ఐసీయూ బెడ్లు, ప్రాణరక్షక మందులను సరిపడా అందుబాటులో ఉంచాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. ముందస్తు ఏర్పాట్లలో ఎలాంటి నిరక్ష్యానికి తావులేకుండా చూడాలని ఆదేశించారు.

## జ్యుడీషియల్ సర్వీసుల్లోకి వచ్చే అభ్యర్థులకు


# యేడాది న్యాయవాద ప్రాక్టీస్ తప్పనిసరి



**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** జ్యుడీషియల్ సర్వీసుల్లోకి నేరుగా ప్రవేశించాలనుకునే న్యాయ విద్యార్థులకు సుప్రీంకోర్టు గుడ్ న్యూస్ చెప్పింది. సివిల్ జడ్జి (జూనియర్‌డివిజన్) పోస్టులకు దరఖాస్తు చేసు కునే అభ్యర్థులకు మూడేళ్ల న్యాయవాద వృత్తి ప్రాక్టీస్ నిబంధనను ఒక సంవత్సరానికి తగ్గించింది. మూడేళ్ల ప్రాక్టీస్ నిబంధనను తొలగించాలన్న అభ్యర్థనను పూర్తిగా తోసిపుచ్చనప్పటికీ, యువ న్యాయవాదులు ఎదుర్కొంటున్న ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని మార్పులు చేసింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఆగస్ట్ జార్జ్ మసీహ్, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. ఈ అంశంపై జస్టిస్ వినోద్ చంద్రన్ భిన్నాభిప్రాయం వ్యక్తం చేశారు. సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పోస్టుల ప్రత్యక్ష నియామకాలకు కనీస అనుభవం ఉండాలన్న ప్రాథమిక ఉద్దేశాన్ని సమర్థిస్తూనే, నిబంధనలు కఠినంగా ఉండి యువ లా గ్రాడ్యుయేట్లకు ఇబ్బంది కలగకూడదని సుప్రీం కోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. 2025 మే 20 నుంచి 2027 మార్చి 31 మధ్య వెలువడే సివిల్ జడ్జి పరీక్షల నోటిఫికేషన్లకు హాజరయ్యే లా గ్రాడ్యుయేట్లకు ఎటువంటి ప్రాక్టీస్ అనుభవం లేకపోయినా దరఖాస్తు చేసుకునేందుకుసుప్రీంకోర్టు మినహాయింపు నిచ్చింది. ఈకాలంలో ఎంపికైన అభ్యర్థులు నేరుగా ట్రెయినీజ్యుడీషియల్ ఆఫీసర్లుగా నియమితులవుతారు. అలానే వీరు స్టేట్ జ్యుడీషియల్ అకాడమీలో ఒక సంవత్సరం పాటు శిక్షణ పొందాలి.

# ప్రతి ప్రశ్నకు రూ.200 వసూలు

## ఆన్సర్ కీ ఛాలెంజ్ ఫీజుపై ఎన్‌టిఎ స్పష్టత




**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** యుజిసి నెట్ ఆన్సర్ కీపై అభ్యంతరాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) నిర్ణయించిన ఫీజుపై విమర్శలు వస్తున్నాయి. ప్రతి ప్రశ్నకు (యుజిసి నెట్) రూ. 200 చొప్పున అంటే అభ్యర్థులపై అధిక భారం పడుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్‌టిఎ దీనిపై స్పందిస్తూ ఫీజు చెల్లింపు ప్రక్రియపై వివరణ ఇచ్చింది. అభ్యంతరాలు సరైనవతే రీఫండ్ ఉంటుందని స్పష్టం చేసింది. 'ప్రతి విద్యార్థికి న్యాయం జరిగేలా ఈ ఆన్సర్ కీ ఛాలెంజ్ సిస్టమ్‌ను రూపొందించాం. ఒక ప్రశ్నకు సంబంధించిన సమాధానంపై ఎవరైనా విద్యార్థి అభ్యంతరం వ్యక్త చేస్తే దాన్ని సబ్జెక్ట్ నిపుణులు పరిశీలిస్తారు. ఒకవేళ సదరు విద్యార్థి అభ్యంతరం సరైనది అయితే.. ఆన్సర్ కీని సవరిస్తాం. కొత్త సమాధానం పరీక్ష రాసిన విద్యార్థులందరికీ వర్తిస్తుంది. సదరు అభ్యర్థి ఛాలెంజ్ సరైనదే అని రుజువైతే ఆ ప్రశ్నకు ప్రతి ప్రశ్నకు రూ.200 చొప్పున ఫీజును నిర్ణయించాం. అంతేగానీ దీన్నుంచి లాభం పొందడానికి కాదు' అని ఎన్టీఏ వెల్లడించింది.

జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జెఆర్‌ఎఫ్), అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల అర్హతకు, పిహెచ్‌డి ప్రోగ్రాముల్లో ప్రవేశం కోసం నిర్వహించిన సిఎస్ఐఆర్-యుజిసి నెట్ ప్రాథమిక కీను ఎన్‌టిఎ ఇటీవల విడుదల చేసింది. ఆన్సర్ కీలో ఏదైనా సమాధానం తప్పుగా ఉందని అభ్యర్థులు భావిస్తే ప్రతి ప్రశ్నకు రూ. 200 చెల్లించి కీపై తమ అభ్యంతరాలను తెలియచేయొచ్చని ప్రకటించింది. జూన్ 22 నుంచి 30 వరకు 87 సబ్జెక్టుల్లో యుజిసి నెట్ పరీక్షను నిర్వహించింది. అయితే, ఇందులో ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ సబ్జెక్టులకు సంబంధించి ప్రశ్నపత్రాల్లో వివిధ రకాల లోపాలపై ఫిర్యాదులు రావడంతో ఆ పరీక్షలను రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈ సబ్జెక్టులకు సెప్టెంబరులో మరోసారి పరీక్ష నిర్వహించనుంది.


# ఆసుపత్రి నుంచి జైలుకు ఇమ్రాన్‌ఖాన్



**రావల్పిండి, ఆగస్టు 21:** పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను ఇస్లామాబాద్‌లోని ఆసుపత్రిలో వైద్య పరీక్షలు పూర్తయ్యాయి. దీంతో ఆయన్ను తిరిగి అడియాలా జైలుకు తరలించారు. వైద్యుల బృందం ఆయనను పరీక్షించి జైలులో కొనసాగేందుకు ఆరోగ్యపరంగా ఎలాంటి ఇబ్బంది లేదని నిర్ధారించినట్లు పాకిస్థాన్ మీడియా కథనాలు వెలువడ్డాయి. పాకిస్థాన్ సమాచార శాఖ మంత్రి అత్తావుల్లా తరార్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ నేత్ర వైద్య నిపుణుడు, కార్డియాలజిస్ట్, ఫిజీషియన్ సహా నిపుణుల బృందం ఇమ్రాన్ ఖాన్‌కు సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించిందని తెలిపారు. వైద్యులు ఆయనను మెడికల్‌గా ఫిట్‌గా ప్రకటించారు. పరీక్షల ప్రక్రియ పూర్తైన తర్వాత తిరిగి అడియాలా జైలుకు తరలించారని పేర్కొన్నారు. ఇమ్రాన్ ఖాన్‌ను ప్రైవేట్ ఆసుపత్రి అయిన షిఫా ఇంటర్నేషనల్ హాస్పిటల్‌కు తరలించి వైద్య పరీక్షలు నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే ఆయనను ప్రభుత్వ ఆధ్వర్యంలోని పాకిస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు తీసుకెళ్లినట్లు మంత్రి అత్తావుల్లా తరార్ తెలిపారు. 73 ఏళ్ల ఇమ్రాన్ ఖాన్‌ను అర్ధరాత్రి సమయంలో వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించారు. ఆయన ఆరోగ్యంపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రత్యేక వైద్య సేవలు అందించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య ఇమ్రాన్ ఖాన్‌ను జైలు నుంచి ఆసుపత్రికి తరలించారు. పరీక్షల అనంతరం తిరిగి జైలుకు తరలించినట్లు జియో న్యూస్ పేర్కొంది.

# సంక్షిప్త వార్తలు

## పశ్చిమాసియాను వీడిన యుఎస్ యుద్ధనౌక



**వాషింగ్టన్, ఆగస్టు 21:** అమెరికా యుద్ధనౌక యుఎస్ఎస్ అబ్రహం లింకన్ పశ్చిమాసియా సముద్రజలాల నుంచి తిరుగుప్రయాణం మొదలుపెట్టింది. ఇరాన్‌తో యుద్ధం నేపథ్యంలో గత 9నెలల నుంచి ఆయుద్ధనౌక హర్మూజ్ సమీపంలో ఉన్నది. అయితే ఇరాన్‌పై యుద్ధంచేసిన ఆ యుద్ధనౌక సైనికులు ప్రస్తుతం మానసికంగా, శారీరకంగా క్షీణించినట్లు తెలిసింది. ఆహార నిల్వలు కూడా తగ్గడంతో యుద్ధనౌక వెనుతిరుగుతున్నట్లు భావిస్తున్నారు. శాన్‌డియాగోకు నౌకపయనమైనట్లు తెలుస్తోంది. దీని స్థానంలో యుఎస్ఎస్ జార్జ్ వాషింగ్టన్ యుద్ధనౌక అక్కడకు చేరుకుని ఆపరేషనల్ డ్యూటీస్ నిర్వర్తించనున్నది.

## 22 మంది భారతీయులు ఉన్న రెండు నౌకలు హైజాక్



**మొగదిషు, ఆగస్టు 21:** యెమెన్, సోమాలియా తీరాల్లో వేర్వేరు ఘటనల్లో 22 మంది భారతీయులతో ప్రయాణిస్తోన్న రెండు వాణిజ్య నౌకలను సముద్రపు దొంగలు హైజాక్ చేశారు. ఈ విషయాన్ని సోమాలియా షిప్పింగ్ మంత్రిత్వశాఖ వెల్లడించింది. అధికారులు వెల్లడించిన ప్రకారం ఈ నెల 17న సోమాలియా తీరంలో కామెరూన్ పతాకంతో వెళ్తోన్న 'లుటుఫ్' అనే కార్గో నౌక హైజాక్ అయ్యింది. తుర్కియే ఆయుధాలను తరలిస్తోన్న ఆ నౌకలో 10మంది సిబ్బంది ఉండగా. వారిలో ఆరుగురు భారతీయులు కాగా మిగిలినవారు తుర్కియే, జార్జియా, సెర్బియాకు చెందిన వారు.

## అలాస్కాలో కుప్పకూలిన చార్టర్ విమానం: 8మంది మృతి




**వాషింగ్టన్, ఆగస్టు 21:** అమెరికాలోని అలాస్కాలో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. పశ్చిమ అలాస్కాలోని మారుమూల ప్రాంతంలో ఓచార్టర్ ప్లేన్ కుప్పకూలింది. ఈ ఘటనలో విమానంలో ప్రయాణిస్తున్న 8మంది మృతిచెందినట్లు అమెరికా సైన్యం వెల్లడించింది. ప్రమాదానికి గురైన విమానంలో ఇద్దరు పైలట్లు, ఆరుగురు ప్రయాణికులుఉన్నట్లు అమెరికా నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీబోర్డు (ఎన్‌టిఎస్‌బి) అలాస్కా ప్రాంత అధికారి క్లింట్ జాన్సన్ తెలిపారు. గురువారం యాంకరేజ్ నుంచి విమానం బయలుదేరి కేప్ న్యూనెహామ్ ప్రాంతానికి చేరుకుంటుండగా ప్రమాదం జరిగింది.

## హత్యకేసులో శిక్ష అనుభవిస్తున్న 105యేళ్ల వ్యక్తి విడుదల

**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** మర్డర్ కేసులో జైలుశిక్ష అనుభవిస్తున్న 105ఏళ్ల వ్యక్తిని రిలీజ్ చేయనున్నారు. ఆ కేసును శుక్రవారం సుప్రీంకోర్టు కొట్టివేసింది. అతనిపై ఉన్న జీవితకాల శిక్షను ఎత్తివేసింది. అతని వయసును దృష్టిలో పెట్టుకుని సుప్రీం తన తీర్పును వెలువరించింది. రసిక్ చంద్ర మోండల్‌పై 1994లో అతను 68 ఏళ్ల వయసు ఉన్నప్పుడు మర్డర్ కేసు నమోదు అయ్యింది. ఆ కేసులో 2024 నవంబర్ 29 వరకు జైలులో ఉన్నాడు. ఆ ఏడాది అతనికి సుప్రీంకోర్టు బెయిల్ మంజూరీ చేసింది. అయితే ఆకేసును మూసివేస్తున్నట్లు శుక్రవారం కోర్టు తెలిపింది.

## సమాజ్‌వాది పార్టీలో చేరిన షయాన్ మసూద్



**లక్నో, ఆగస్టు 21:** ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ సీనియర్ నేత, సహారన్‌పూర్ ఎంపీ ఇమ్రాన్ మసూద్‌కు రాజకీయంగా గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన అల్లుడు షయాన్ మసూద్ కాంగ్రెస్‌ని వీడి, సమాజ్‌వాదీపార్టీ(ఎస్పీ)లో చేరారు. ఈ పరిణామం పశ్చిమ యూపీరాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. లక్నోలోని సమాజ్‌వాదీపార్టీ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు, మాజీముఖ్యమంత్రి అఖిలేష్‌యాదవ్ సమక్షంలో షయాన్‌మసూద్ అధికారికంగా పార్టీలో చేరారు.

## కుప్పకూలిన గని: 100 మందికిపైగా మృతి



**బాంగ్యుయ్, ఆగస్టు 21:** ఆఫ్రికాలో పెను విషాదం చోటుచేసుకుంది. కామె రూన్, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ (సీఏఆర్) సరిహద్దులో ఉన్న ఓ బంగారు గని కుప్పకూలడంతో 100మందికి పైగా కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో జంబోయే గ్రామంలో ఈ ఘోర దుర్ఘటన జరిగినట్లు అధికారులు వెల్లడించారు. కామెరూన్ ఈస్ట్ రీజియన్ గవర్నర్ గ్రెగోయిర్ వోంగో మాట్లాడుతూ ప్రమాదం జరిగిన గని సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ భూ భాగంలో ఉందని తెలిపారు. ఈ ఘటనలో సుమారు ముగ్గురి నుంచి ఐదుగురు కామెరూన్ జాతీయులు మరణించి ఉంటారని అంచనా వేశారు.

22-8Pg6exHMNWJQE:22-8Pg6exHMNWJQE.qxd 8/22/2026 12:12 AM Page 1



# బిసిలకు 33.33శాతం రిజర్వేషన్లు యథాతథంగా అమలు

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ .సురేశ్ కుమార్
- 123 పురపాలక సంఘాలకు గానూ 100 చోట్ల త్వరలో ఎన్నికలు నిర్వహణ



**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిలో స్థానిక ఎన్నికల్లో బిసిలకు 33.33 శాతం రిజర్వేషన్లను యథాతథంగా అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పును పరిగణనలోకి తీసుకుని, వెనుకబడిన తరగతులకు మున్సిపల్ ఎన్నికల్లో రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు వివరించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఓటర్ల జాబితా తయారీ, వార్డుల విభజన, రిజర్వేషన్ల ఖరారు వంటి చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చామన్నారు. ఎన్నికల నిర్వహణ.సన్నద్ధత తదితరంశాలపై ఉత్వర్వులు జారీ చేసినట్లు వివరించారు. ఎన్నికలు నిర్వహించాల్సిన పట్టణాలు, నగర పంచాయతీలు, నగరపాలక సంస్థలకు సంబంధించి సీఎం చంద్రబాబు నివేదికను అందించినట్లు వివరించారు. పురపాలక శాఖ కమిషనర్ వెల్లడించిన మేరకు ఆయన ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ప్రకారం, రాష్ట్రంలోని మొత్తం 123 పురపాలక సంఘాలకు గానూ 100 చోట్ల త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే ఐదేళ్ల పదవీకాలం ముగిసిన 87 పురపాలక సంఘాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది నవంబర్ నాటికి పదవీకాలం పూర్తి చేసుకోనున్న మరో 13 చోట్ల ఎన్నికలు జరగనున్నాయి. న్యాయపరమైన సమస్యల కారణంగా 23 పురపాలక సంఘాల్లో ఎన్నికలు సాధ్యపడవని నివేదికలో స్పష్టంగా వివరించారు. 2021లో ఎన్నికలు జరిగిన 100 పుర, నగరపాలక సంస్థల్లో 87 చోట్ల ఈ ఏడాది మార్చితోనే పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. మరో 13 చోట్ల నవంబరు 22తో ముగియనుంది. సమీప గ్రామ పంచాయతీలను విలీనం చేసే చట్టం5పై దాఖలైన పిటిషన్లతో గతంలో 23 చోట్ల ఎన్నికలు నిలిచిపోయాయి. అయితే వీటిలో మంగళగిరి–తాడేపల్లి, శ్రీకాళహస్తి, కావలి, అల్లూరుకి సంబంధించిన కేసులు ఇటీవల ఉపసంహరించుకున్నట్లు తెలుస్తోంది. మిగిలిన కేసుల పరిష్కారంపైనా వేగంగా చర్యలు తీసుకుంటున్నట్లు పురపాలక శాఖ ఎస్ఇసికి నివేదించింది. ఈ క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ముమ్మరం చేసింది. ప్రభుత్వ శాఖల సన్నద్ధతపై నివేదికలు అందడంతో, కోర్టు కేసుల అడ్డంకులు తొలగిన వెంటనే షెడ్యూల్ విడుదల చేసే దిశలో ఆలోచన చేస్తుంది. ఇక రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే 87 పుర, నగరపాలికలతో పాటు 13,341 గ్రామ పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర పురపాలక, పంచాయతీరాజ్ శాఖలు స్పష్టం చేశాయి. ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ మేరకు రెండు శాఖలు వేర్వేరుగా నివేదికలు సమర్పించాయి. డివిజన్లు, వార్డుల పునర్విభజనపై కోర్టులో ఉన్న కేసులు పరిష్కారమైతే 87 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో ఎన్నికల ప్రక్రియను వెంటనే ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ స్పష్టం చేసింది.

# తిరుమలలో గోబీ వినియోగం నిషేధం

**తిరుమల,ఆగస్టు 21ప్రభాతవార్తప్రతినిధి:** దేశవిదేశాల నుండి తిరుమలకు వచ్చిన భక్తులకు మరింత శుచిగా నాణ్యతతో ఆహారపదార్థాలు అందించాలని టిటిడి అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా తిరుమలలోని అన్ని ఫాస్ట్‌ఫుడ్‌కేంద్రాలు, హోటళ్ళలో గోబీతో తయారుచేసే ఆహారపదార్థాలు నిషేధించినట్లు డిప్యూటీ ఇఒ ఆరోగ్యవిభాగం సోమన్నారాయణ తెలిపారు. శుక్రవారం తిరుమలలో హోటళ్ళ యాజమాన్యంతో సమావేశం నిర్వహించి గోబీని పూర్తిగా నిషేధించాలని, వినియోగం చేయరాదని తెలిపారు. గోబీ రైస్, గోబీ మంచూరియాను కొందరు ఇష్టంగా తింటారు. ఇందులో పిల్లలు ఎక్కువగా ఉంటారు. అయితే ఇది విషపూరితంగాను, క్యాన్సర్ అంశాలు ఎక్కువగా ఉన్న కారణమేగాక పురుగులు ఉన్నాయనే నెపంతో తిరుమలలో దీన్ని నిషేధించారు. ఇప్పటికే చైనీస్‌ఫుడ్స్‌ను తిరుమలలో నిషేధించారు. గోబి బాగా రంగుతో కనిపించడానికి, రుచి వచ్చేందుకు కృత్రిమ రంగులు, రసాయనాలు కలుపుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. కర్ణాటక, గోవా రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలలో గోబీ మంచూరియా, గోబీ రైస్ విక్రయాలపై నిషేధం విధించారు.

# వైఎస్సార్సీపీ సభ్యులు శాసన మండలిలో అనుచితంగావ్యవహరించారు: వర్ల రామయ్య

**విజయవాడ,ఆగస్టు 21,ప్రభాతవార్తప్రతినిధి:** పెద్దల సభగా పిలిచే శాసనమండలిలో వైఎస్సార్సీపీ సభ్యుల తీరు మండలి ఔన్నత్యాన్ని దిగజార్చిందని ఎమ్మెల్సీ వర్ల రామయ్య విమర్శించారు. వైఎస్సార్సీపీ సభ్యులు పెద్దల్లా" కాకుండా గద్దల్లా" వ్యవహరించారన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏ మాత్రం వైసిపి సభ్యులు మండలిలో సంస్కారంతో వ్యవహరించలేదన్నారు. శాసన మండలిలో తాను తొలిసారి అడుగుపెట్టిన సందర్భంలో వైసిపి సభ్యుల వ్యవహార సరళి గమనించి ఆశ్చర్యపోయానన్నారు. మండలి ఛైర్మన్‌ను చుట్టుముట్టి ప్లకార్డులతో నినాదాలు చేయడం క్షమించరాని చర్యని మండిపడ్డారు. దళిత వర్గానికి చెందిన ఛైర్మన్‌ను అవమానించేలా వైఎస్సార్సీపీ సభ్యులు వ్యవహరించారని ధ్వజమెత్తారు. మెగా డీఎస్సీలో అవకతవకలు జరిగితే అసెంబ్లీలో చర్చిద్దామని మంత్రి లోకేశ్ సవాల్ చేశారని గుర్తు చేశారు. అసెంబ్లీకి రాకుండా మండలిని అగౌరవపరచడం జగన్ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. మెగా డీఎస్సీలో ఎలాంటి అవకతవకలు జరగలేదని అధికారులు స్పష్టం చేసినా జగన్ అదే అంశాన్ని పట్టుకుని వేలాడుతున్నారని వర్ల రామయ్య ఆక్షేపించారు.



# సిఎస్ఓ ను విధుల నుండి శాశ్వతంగా తొలగింపు

**శ్రీశైలం ప్రాజెక్టు ఆగస్టు 21, ప్రభాతవార్త:** శ్రీశైల దేవస్థానంలో చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్గా విధులు నిర్వహిస్తున్న బి. శ్రీనివాసరావును శాశ్వతంగా విధుల నుండి తొలగిస్తూ శ్రీశైల దేవస్థానం ఈవో ఎం. శ్రీనివాసరావు ఉత్తర్వులను జారీ చేశారు. ఈనెల 12వ తేదీన సామాజిక మాధ్యమాలలో చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మరియు సర్కిల్ ఇన్స్పెక్టర్ కు ముందు జరిగిన (పాత)ఆడియో సంభాషణలు వైరల్ గా మారడంతో ఈ విషయంపై శ్రీశైలం దేవస్థానం కు ముందుగా లిఖితపూర్వకంగా చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ తెలపకపోవడంతో చర్యలు గైకొనడం జరిగిందని లేఖలో తెలిపారు. ఆడియో సంభాషణలపై దేవస్థానం నుండి సి.ఎస్.ఓ.ను వివరణ కోరగా పని ఒత్తిడి ఉండడంతో లిఖితపూర్వకంగా తెలియపరచలేదు అన్న సమాధానం తెలపడంతో దేవస్థానం ప్రతిష్టకు భంగం కలిగే విధంగా వ్యవహరించడంతో చర్యలకు ఉపక్రమించినట్లు ఆ లేఖలు పేర్కొన్నారు.

# స్థానిక ఎన్నికల విధానాల రూపకల్పనకు ప్రత్యేక కమిటీ

**విజయవాడ.ఆగస్టు 21,ప్రభాతవార్తప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికలలో జనసేన అనుసరించాల్సిన విధి విధానాలు రూపకల్పనకి ప్రత్యేక కమిటీని పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శుక్రవారం ప్రకటించారు. ఈ కమిటీలో 14 మంది సభ్యులను నియమించారు. విధి విధానాలతోపాటు క్షేత్ర స్థాయిలో శ్రేణుల ఆలోచనలను ఈ కమిటీ పరిగణనలోకి తీసుకుంటుంది. పవన్ కళ్యాణ్ జనసేన శాసన సభ పక్షం సమావేశంలో జన సైనికులు, వీర మహిళల పోరాట స్ఫూర్తిని కొనసాగించేలా.... వారి ఆత్మ గౌరవాన్ని నిలిపేలా స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుదామని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో కమిటీని నియమించారు. కమిటీ సభ్యులుగా మండలి బుద్ధ ప్రసాద్, . టి.శివ శంకర్. కందుల దుర్గేష్, వల్లభనేని బాలశౌరి, బొలిశెట్టి శ్రీనివాస్, దేవ వరప్రసాద్, . సీహెచ్ వంశీకృష్ణ యాదవ్. లోకం మాధవి, పత్సమట్ల ధర్మ రాజు తదితరులు పాల్గొన్నారు.

# వరలక్ష్మీ వ్రతం పూజలతో పునీతం



**శ్రీకాళహస్తి,ఆగస్టు 21 ప్రభాతవార్త:** పుణ్యక్షేత్రం దక్షిణ కైలాసం.భక్తి భావంతో పునీతం. శ్రావణ మాసం మహిళలకు ప్రత్యేకం. నెల నెలా ఓ ఉత్సవాన్ని శ్రీకాళహస్తీశ్వరాలయం నిర్వహించటం ఆనవాయితి. శ్రావణ మాసం వరలక్ష్మీ వ్రతాన్నిగతంలో ప్రసన్నవరదరాజస్వామి ఆలయం కళ్యాణమండపంలో నిర్వహించటం ఆనవాయితి.అయితే గత కొన్ని సంవత్సరాలుగా ఆలయం జీర్ణోద్ధారణ జరుగుతున్నందువల్ల శ్రీకాళహస్తీశ్వరాలయంలోనే నిర్వహించారు. కొంత కాలం ఆలయానికి సమీపంలోని బ్రహ్మగుడి వద్ద నిర్వహించే వారు.అయితే ఈ ఏడాది వరలక్ష్మీ వ్రతాన్ని ఇఓబికె వెంకటేశులు ఆలయ ప్రాకారం లోపలే నిర్వహిస్తే భక్తి భావం ఉంటుందనే భావంతో రాహుకేతుదోష నివారణ పూజలు నిర్వహించే మండపంలో ఏర్పాటు చేసారు. శ్రీకాళహస్తీశ్వరాయం శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతపూజలు నిర్వహించారు. మహిళలు విశేష సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు.మహిళా భక్త జనులతో నిర్వహించటం వేలాది మంది మహిళలు నోములు నోచుకున్నారు. సూర్యభగవానుడు తమ ప్రతాపం చూపుతున్నా, పట్టణ నలుమూలల నుంచే కాకుండా చుట్టు పక్కల గ్రామాల నుంచి కూడా మహిళా భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు. గతం కన్నా ఈ ఏడాది మహిళ సంఖ్య బాగా పెరిగింది. శ్రావణ మాసం మహిళలు నియమనిష్టలతో నిర్వహించే వ్రతం 'వరలక్ష్మీ వ్రతం' ఇందుకు ప్రతి ఏడాది శ్రీకాళహస్తీశ్వరాయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయటం ఆనవాయితి. ఇక్కడి కార్యక్రమాల్ని ప్రత్యేకంగా ఇఓ బికె వెంకటేశులు మూడు రోజులుగా పర్యవేక్షించారు. అధికారుల పర్యవేక్షణలో జరిగే కార్యక్రమాలు కాబట్టి మహిళలకు సంబంధించి ఎలాంటి విమర్శలు ఆరోపణలు ఆరోపణలు లేకుండా ఏర్పాట్లును చేపట్టారు.

# బిసిలకు దక్కాల్సిన రాజకీయ హక్కులు వారికే దక్కాలి

- స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వ నిర్ణయం చరిత్రాత్మకం.
- సీఎం చంద్రబాబుకు అభినందనలు.,

**విజయవాడ, ఆగస్టు 21,ప్రభాతవార్తప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో బీసీలకు 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్ అన్నారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచే ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని చెప్పారు.శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు స్థానిక సంస్థల్లో తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. గతంలో అమలులో ఉన్న బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడం వల్ల బీసీల రాజకీయ ప్రాతినిధ్యం దెబ్బతిన్నదన్నారు. ఆ సమయంలో స్థానిక సంస్థల ఎన్నికలు కూడా ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా బెదిరింపులు, అక్రమాలు, దౌర్జన్యాల మధ్య జరిగాయని విమర్శించారు...బీసీల హక్కులను ఇతర వర్గాలకు మళ్లించొద్దు..బీసీ సమాజం ఎన్నో దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న రాజకీయ హక్కులను ఓటుబ్యాంక్ రాజకీయాల కోసం ఇతర వర్గాలకు కేటాయించడం సరికాదని గోపి శ్రీనివాస్ అన్నారు. గతంలో స్థానిక సంస్థల్లో ముస్లింలకు బీసీ కోటా ద్వారా కల్పించిన రాజకీయ ప్రాతినిధ్యంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.ఇది ఏ వర్గానికీ వ్యతిరేకమైన డిమాండ్ కాదు. ఎవరికైనా రాజకీయ అవకాశాలు కల్పించాలంటే వారికి చట్టబద్ధంగా ఉన్న ఇతర మార్గాల్లో అవకాశాలు కల్పించాలి. బీసీలకు కేటాయించిన రాజకీయ రిజర్వేషన్లు మాత్రం బీసీలకే దక్కాలి" అని స్పష్టం చేశారు. ఈ అంశాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్తామని తెలిపారు. ప్రతి అంశాన్ని పరిశీలించి ప్రజానుకూల నిర్ణయాలు తీసుకునే ముఖ్యమంత్రి తమకు ఉన్నారు, బీసీలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందనే నమ్మకం ఉందన్నారు."..మోదీ హయాంలో సామాజిక న్యాయానికి పెద్దపీట..ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం బీసీల సామాజిక, రాజకీయ, విద్యా అభ్యున్నతికి అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని గోపి శ్రీనివాస్ తెలిపారు. 102వ రాజ్యాంగ సవరణ ద్వారా జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్‌కు రాజ్యాంగబద్ధత కల్పించడం, రాష్ట్రాలకు కూడా బీసీ జాబితాల విషయంలో అధికారాలను కల్పిస్తూ 105వ రాజ్యాంగ సవరణ చేయడం సామాజిక న్యాయంలో కీలక మైలురాళ్లని పేర్కొన్నారు. అదేవిధంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించడం ద్వారా ఆయా వర్గాల్లోని పేదలకు కూడా అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. కేంద్ర విద్యాసంస్థలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ల అమలు ద్వారా పేద, మధ్యతరగతి బీసీ కుటుంబాల విద్యార్థులకు ఉన్నత విద్యలో అవకాశాలు పెరిగాయని తెలిపారు.



బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్

# తిరుమల సమాచారం



## మళ్లీ కొండ కిటకిట

- వెంకన్న సర్వదర్శనానికి 24గంటలు

**తిరుమల,ఆగస్టు 21 ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమల భక్తజనసంద్రంగా మారింది. వారాంతపుకావడం వరుస సెలవు రావడంతో ఏడుకొండల వెంకన్న దర్శనానికి భక్తులు భారీగా చేరారు. శుక్రవారం ఉదయానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లలోని 32 కంపార్టుమెంట్లు నిండిపోయి భక్తులు వెలుపల క్యూలైన్లలో బారులుతీరారు. దీంతో స్వామివారి సర్వదర్శనానికి మధ్యాహ్నానికి 24గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనానికి ఆరుగంటలపైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు. సాయంత్రం వరకు 42వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 20వేలమంది భక్తులు అర్ధరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. తిరుమలకు చేరుకునే సామాన్యభక్తుల సంఖ్య అనూహ్యంగా పెరగడంతో గదుల కోసం నిరీక్షణ తప్పడంలేదు.

## వెంగమాంబ బృందావనంలో పుష్పాంజలి



**తిరుమల,ఆగస్టు 21 ప్రభాతవార్తప్రతినిధి:** మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 209వ వర్ధంతిని పురస్కరించుకుని తిరుమలలో వెంగమాంబ బృందావనంలో టిటిడి అధికారులు శుక్రవారం పుష్పాంజలి సమర్పించారు. ఈ సందర్భంగావెంగమాంబ వంశీయులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంగమాంబ ప్రాజెక్టు అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## వెంగమాంబ విగ్రహానికి పుష్పాంజలి



భక్త కవయిత్రి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 209వ వర్ధంతిని పురస్కరించుకుని తిరుపతిలోని ఎం.ఆర్.పల్లి సర్కిల్ వద్ద ఉన్న వెంగమాంబ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టు ప్రత్యేక అధికారి డాక్టర్ వేమ వెంకటరత్నం శుక్రవారం పుష్పాంజలి ఘటించారు. వర్ధంతి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు అన్నమాచార్య కళామందిరంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులచే సంగీత కచేరి నిర్వహించారు.

## శ్రీవారి చెంత సేవకుడిగా సేవాభాగ్యం

- నేడు ఎస్వీబిసి ఛైర్మన్‌గా శ్రీధర్‌వర్మ

తిరుమలలోనే పుట్టి శ్రీవారిచెంతనే పెరిగి విద్యాభ్యాసం నేర్చుకున్న టిడిపి నేత బి.శ్రీధర్‌వర్మ ఆస్వామిచెంత సేవకుడిగాసేవలందించే భాగ్యం కలిగింది. టిడిపి సీనియర్ నేత, దివంగత ఎన్టీఆర్ అభిమాని తిరుమల ఎన్టీఆర్ రాజు కుమారుడు బి.శ్రీధర్‌వర్మ టిటిడి ఎస్వీబిసి ఛైర్మన్‌గా శనివారం మధ్యాహ్నం బాధ్యతలు చేపట్టనున్నారు. ఆలయంలోపల ఆయనతో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర ప్రమాణస్వీకారం చేయించున్నారు. ఈ కార్యక్రమానికి శ్రీధర్‌వర్మ కటుంబసభ్యులు, ఎస్వీబిసి అధికారులతో బాటు టిటిడి వర్గాలు పాల్గొంటున్నాయి. తిరుపతికి చెందిన యువనేత శ్రీధర్‌వర్మకు అనూహ్యంగా ఎస్వీబిసి ఛైర్మన్ పదవి లభించిన విషయం విదితమే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ళ తరువాత ఖాళీగా ఉన్న ఎస్వీబిసి ఛైర్మన్ పదవిలో శ్రీధర్‌వర్మను నియమించింది.

## 28న దత్తాత్రేయ మందిరంలో చండీ హోమం

**తిరుపతి,ఆగస్టు 21ప్రభాతవార్తప్రతినిధి:** అవదూత మొగలిచర్లలోని దత్తాత్రేయ మందిరంలో ఈనెల 28వతేదీ శుక్రవారం ఛండీహోమం నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ తెలిపారు.వేదశాస్త్రములు ,సనాతన ధర్మ సంప్రదాయాల ప్రకారం చండీ హోమంలో పాల్గొనడం ద్వారా జగన్మాత చండీదేవి అనుగ్రహాన్ని, ఆధ్యాత్మిక శక్తిని, విఘ్న నివారణను రక్షణను ప్రార్థించే మహత్తర అవకాశం లభిస్తుంది. ప్రకాశం జిల్లా లింగసముద్రం మండలం మొగలిచర్లలోని దత్తాత్రేయ స్వామి మందిరంలో చండీ హోమంలో ప్రత్యక్షంగా పాల్గొనదలచిన భక్తులు 7207875712,91828 82632,99089 73699 నంబర్లకు సంప్రదించాలని మందిరం కన్వీనర్ పవని విష్ణుకౌశిక్ తెలిపారు. చండీహోమంరోజు మధ్యాహ్నం,రాత్రి వేళల్లో మందిరంలో భక్తులకు అన్నదానం ఉంటుంది.

## తిరుమలేశుని వాహనసేవల్లో విదేశీ కళాకారుల భక్తులకు అవకాశం

**తిరుమల,ఆగస్టు 21ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠంగా విరాజిల్లుతున్న తిరుమలపుణ్యక్షేత్రంలో తొమ్మిదిరోజులు జరిగే శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల ముందు భక్తితో కళాకారులు తమకు తోచిన కళాప్రదర్శనలు అద్భుతంగా ప్రదర్శిస్తారు. ఇదివరకు కేవలం దేశంలోని 25 రాష్ట్రాలనుండి భక్తులైన నైపుణ్యం కలిగిన కళాకారులు తిరుమలకు ముందు రోజుల్లో చేరుకుని వాహనసేవల ముందు తమనాట్యప్రదర్శన ఇచ్చేవారు. టిటిడి చరిత్రలోనే అందుకు భిన్నంగా ఈ ఏడాది సెప్టెంబర్ 15నుండి మొదలయ్యే సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలతోబాటు అక్టోబర్ 12నుండి జరగనున్న నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో దేవుని వాహనసేవల ముందు నృత్యాల్యతో ఆడిపాడే అద్భుతమైన అవకాశాన్ని విదేశీయులకు కూడా టిటిడి అధికారులు కల్పించారు. దేశంలోని 25రాష్ట్రాల్లోని కళాకారులేగాక విదేశాల్లోని రెండు దేశాలకు చెందిన కళాకారులు వస్తుండటం శ్రీవారి పట్ల భక్తివిశ్వాసాలను చాటిచెబుతుంది. తొమ్మిదిరోజులుపాటు ఉదయం,రాత్రి జరిగే పలు రకాల వాహనసేవల్లో దేశంనలుమూలలనుండేగాక విదేశాల నుండి రానున్న కళాకారులు తమకు తోచిన కళాప్రదర్శనలు అద్భుతంగా ప్రదర్శించనున్నారు. అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడి చెంత మేమూ సేవకులమేనంటూ ఆనందపరవశులు కానున్నారు. ఒకరేమిటి వందలసంఖ్యలో నిష్ణాతులైన కళాకారులు కేరళ,కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు,తెలంగాణా, ఆంధ్రప్రదేశ్,గుజరాత్, మధ్యప్రదేశ్,ఒరిస్సా తదితర రాష్ట్రాలనుండేగాక ఈ ఏడాది అదనంగా నేపాల్,ఇండోనేషియా దేశాల నుండి కళాకారులు రానుండటం ప్రత్యేకత. ఆయా రోజుల్లో వాహనసేవలకు అనుగుణంగా కళాకారులు నైపుణ్యాలను ప్రదర్శించనున్నారు. అద్భుతమైన కళాకారుల రూపాలు శ్రీలక్ష్మీనరసింహస్వామిగా, శ్రీసీతారామలక్ష్మణులుగా, నాగకన్యలుగా, దేవలోకంలో శ్రీమహావిష్ణువు అవతారంలో ఇలా ఒకటేమిటి భక్తులు భక్తిభావంతో తన్మయత్వం చెందేలా ఏడుకొండలస్వామి వాహనసేవల ముందు కళారూపాలు ఆడిపాడి తన్మయులుకానున్నారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేయనున్న అశేషసంఖ్యలో భక్తులకు విదేశీ కళారూపాలు కనువిందు చేయబోతున్నాయి. టిటిడి చరిత్రలో మొదటిసారి ఐదు దేశాలకు చెందిన కళాబృందాలు ప్రదర్శనలు ఇవ్వనున్నారు.

# అష్టలక్ష్మీ మండపంలో పద్మావతి అమ్మవారి వరలక్ష్మీ వ్రతం

- స్వర్ణరథోత్సవంలో సిరులతల్లి



**తిరుమల,ఆగస్టు 21ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఆలయప్రాంగణంలోని ఆస్థాన మండపంలో జరిగిన ఈ పవిత్ర వేడుకలో టిటిడిఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి దంపతులు, జెఇఒ డాక్టర్ ఎ.శరత్ దంపతులుపాల్గొన్నారు. వేకువజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి సహస్రనామార్చన, నిత్యార్చన, మూలవర్లకు, ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు. వరలక్ష్మీపర్వదినాన పద్మావతి అమ్మ బంగారు చీరతో విశేషంగా అలంకరించుకుని భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. అనంతరం ఉత్సవమూర్తిని ఆస్థాన మండపానికి వేంచేపు చేసి పద్మపీఠంపై ఆశీనులను చేశారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కలశస్థాపన, అమ్మవారి ఆరాధన, అంగపూజ, లక్ష్మీ సహస్రనామార్చన, అష్టోత్తర శతనామావళి తదితర వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.రోజా, మల్లె, చామంతి, సంపంగి, తామర, తులసి తదితర సుగంధ, సంప్రదాయ పుష్పాలతో అమ్మవారిని వేదపఠనంతో అర్చించారు. తొమ్మిది గ్రంథులతో అమ్మవారిని అలంకరించి, ఒక్కో గ్రంథిని ఒక్కో దేవతకు ప్రతీకగా పూజించారు. అనంతరం 12 రకాల నైవేద్యాలను సమర్పించి మహా మంగళహారతితో వ్రతాన్ని ముగించారు. మహిళలకు మంగళప్రదమైన వరలక్ష్మీ వ్రతంవరలక్ష్మీ వ్రతం ఆచరించడం ద్వారా సత్సంతానం, దీర్ఘమాంగల్య సౌఖ్యం, సిరిసంపదలు, ఆరోగ్యం, కుటుంబ సౌఖ్యం కలుగుతాయని పురాణాలు తెలియజేస్తున్నాయని ఆలయ అర్చకులు తెలిపారు.సాక్షాత్తు శ్రీ మహాలక్ష్మి అనుగ్రహంతో తిరుచానూరులో పద్మావతి అమ్మ అవతరించి నందున, అమ్మవారి సన్నిధిలో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడం అత్యంత విశిష్టమైనదని పేర్కొన్నారు. వరలక్ష్మీ వ్రతానికి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక క్యూలైన్లు, అన్నప్రసాదం, తాగునీరు, మజ్జిగ తదితర ఏర్పాట్లు చేశారు. టిటిడి ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్రత మండపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మూడు రోజుల పాటు శ్రమించి సుమారు మూడు టన్నుల సంప్రదాయ పుష్పాలు, 14 రకాల 30 వేల కట్ ఫ్లవర్స్‌తో ఆలయం, ఆస్థాన మండపం, వ్రత మండపాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు .డ్రాగన్ ఫ్రూట్, ద్రాక్ష, ముసాంబి, పైనాపిల్ తదితర పండ్లు, వివిధ రకాల పుష్పాలతో వ్రత మండపాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. మండపం పైభాగంలో గజలక్ష్మి అమ్మవారు, ఇరువైపులా ఐరావతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అష్టలక్ష్మి మూర్తులు, రంగురంగుల రోజాలు, తామరపూలతో ఆస్థాన మండపం శోభాయమానంగా అలంకరించారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు పద్మావతి అమ్మవారు స్వర్ణరథంపై

# అన్నప్రసాదంలో వడ దెబ్బ!

- గట్టిగా ఉన్నాయంటూ భక్తులఅసహనం



**తిరుమల,ఆగస్టు 21ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తులు పవిత్రంగా వెంగమాంబ అన్నప్రసాద భవనంలో స్వీకరించే అన్నప్రసాదంలో వడ్డించే మసాల "వడ" భక్తుల నుండి తిరస్కారానికి గురవుతోంది. ఇదివరకులాగా గాకుండా వడ మరింత గట్టిగా ఉందని, దాన్ని నమలలేకపోతున్నామని అధికశాతంమంది భక్తులు అలాగే విస్తర్లలో వదలిపెట్టేస్తున్న సందర్భాలు ప్రతిరోజూ జరుగుతోంది. అసలే మసాల వడలు అన్నప్రసాదంలో అదనపు మెనూగా చేర్చినా గత కొద్దిరోజులుగా చాలా తక్కువగా తయారుచేస్తున్నారనేది తెలిసిన విషయం. ఆ చేస్తున్న వడలు కూడా నాణ్యత లేకపోవడం, గట్టిగా ఉన్నాయని భక్తులు చెబుతున్న మాటలు. ఇందుకు నిదర్శనంగా తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనంలో భక్తులకు వడ్డించిన వడలు అలాగే వదలిపెట్టేస్తుండటంతో విస్తరాకులతో చెత్తబుట్టల్లో చేరిన వడలు శుక్రవారం మీడియాకు కనిపించింది.2024లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత నవంబర్‌లో టిటిడి బోర్డు కొలువుదీరింది. టిటిడి ఛైర్మన్‌గా బిఆర్‌నాయుడు సారధ్యంలో ఏర్పాటైన బోర్డు 2025 మార్చి 6వతేదీ తొలిసారిగా తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనంలో అన్నప్రసాదాలతోబాటు మధ్యాహ్నం వేళ మాత్రం భోజనంలో అదనంగా మసాల వడ వడ్డింపుతో మెనూ ప్రారంభమైంది. తొలుత 35 వేల వడలను మాత్రమే తయారుచేసి ఉదయం నుండి మధ్యాహ్నం వరకు అన్నప్రసాదాలు స్వీకరించే భక్తులకు మాత్రమే వడ్డించారు. ఆ తరువాత ఐదునెలలకు ఈ అదనపు మెనూ వడను రోజుకు 75వేలు తయారుచేసి ఉదయం 11గంటల నుండి రాత్రి 10గంటల వరకు నిరంతరాయంగా భక్తులకు అన్నప్రసాదంలో వడ్డిస్తూ వచ్చారు. ఇటీవల కొద్దిరోజులుగా మసాల వడలు తయారీకూడా తక్కువ కావడంతో కొంతమంది భక్తులకు మాత్రమే వడ వడ్డిస్తున్నారు.ఇప్పుడు ఆ వడ కూడా గట్టిగా ఉండటంతో భక్తులు అలాగే వదలిపెట్టేస్తున్నట్లు తెలుస్తోంది. తిరుమలలో భక్తుల సౌకర్యాలపై పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు ఎవరికివారే అన్నట్లు ఉంటుండటంతో కొన్ని పాలనాపరమైన సౌకర్యాలు తీసికట్టుగా తయారవుతున్నాయనే విమర్శలు టిటిడి ఉద్యోగ వర్గాల్లోనే వినిపిస్తోంది. అన్నదానం మెనూలో నాణ్యమైన అన్నంతోబాటు సాంబారు, రసం, మజ్జిగ, చక్కెరపొంగలి, తాళింపు(కర్రీ) మసాల వడ వడ్డిస్తున్నారు. మసాల వడను కొన్నినెలలు రుచిగా ,నాణ్యతతో తయారుచేశారు. ఇప్పుడు వడ గట్టిగా రాయిలా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతిరోజూ లక్షమందికిపైగా భక్తులు చిన్నపిల్లల నుండి వృద్ధుల వరకు అన్నప్రసాదాలు స్వీకరిస్తున్నారు. అన్నప్రసాదం భవనంలో వంటశాలలో వడలను రుచిగా నాణ్యతతో తయారుచేయాల్సి ఉందన్నారు.

# దేశ సమైక్యత సంస్కృత భాష ద్వారానే సాధ్యం

**కావలి (నెల్లూరు), ఆగస్టు 21, ప్రభాతవార్త :** దేశ సమైక్యత సంస్కృత భాష ద్వారానే సాధ్యమని తెలుగు మరియు సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి విల్సన్(శరత్ చంద్ర) అన్నారు. శనివారం కావలి ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో జరిగిన పాత్రికేయ సమావేశం లో విల్సన్ పాల్గొని మాట్లాడుతూ ఒకప్పుడు సంస్కృతం పండితుల భాష అని భావించారని దానిని పటా పంచలు చేస్తూ అందరికీ సంస్కృతం అందరిలోకి సంస్కృతం అన్న నినాదంతో ముందుకు సాగుతున్నాం అన్నారు.ఇందులో భాగంగా ఢిల్లీ సెంట్రల్ యూనివర్సిటీ సౌజన్యంతో సంస్కృత సప్తాహం కార్యక్రమం విజయవంతం చేయనున్నాం అన్నారు. ఆగస్టు 25 శ్రీకాకుళం నుండి మొదలైయ్యే సంస్కృత సప్తాహం వైభవం 31 తారీకు విజయవాడ లో ముగుస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం జరిపే సంస్కృత సప్తాహం కార్యక్రమం ముగింపు కార్యక్రమంకి రాష్ట్ర ముఖ్య మంత్రి ని ఆహ్వానించినట్టు విల్సన్ తెలిపారు.ఇటీవల తాను సంస్కృత అకాడమీకి నిధుల కోసం ఢిల్లీ వెళ్ళినప్పుడు అమరావతి లో తాము నిర్మించతలపెట్టిన సంస్కృత సెంట్రల్ యూనివర్సిటీకి 100 ఎకరాలు కోరిన విషయం వారు తన దృష్టి కి తెచ్చారని సదరు యూనివర్సిటీ ద్వారా 40వేల మంది విద్యార్థులకు ప్రతి ఏడాది వివిధ కోర్సుల్లో శిక్షణ ఇచ్చే విషయం తెలియ చేశారని తద్వారా ఆంధ్రప్రదేశ్ లోని విద్యార్థులకు విద్యా ఉపాధి అవకాశం కల్గుతుంది అని విల్సన్ తెలుపుతూ ఈ మేరకు ముఖ్యమంత్రి కి లేఖ ఇచ్చానని తెలిపారు.

# సనాతనధర్మ స్ఫూర్తితో భక్తులకు దుర్గమ్మ ప్రసాదం

- నూతన ప్రసాద భవనాల ప్రారంభోత్సవంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి
- దుర్గమ్మ ఆలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి శ్రీకారం



నూతన ప్రసాద భవనాలు ప్రారంభిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 21 ప్రభాతవార్త:** దుర్గమ్మని దర్శించుకునే ప్రతి భక్తునికి సనాతన ధర్మ స్ఫూర్తితో శ్రీ అమ్మవారి అన్న ప్రసాదాలు, లడ్డూ, పులిహోర తదితర ప్రసాదాలు అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. దుర్గమ్మ ఆలయంలో శుక్రవారం వైభవోపేతంగా శ్రీ కనకదుర్గ అన్నప్రసాద సదనం, శ్రీ దుర్గా భవాని మహాప్రసాద భవనం మంత్రి ఆనం ప్రారంభించారు. దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి ఆనం శ్రీకారం చుట్టారు రూ.26 కోట్లతో నిర్మించిన కనకదుర్గ అన్నప్రసాద సదనం, రూ.26.50 కోట్లతో నిర్మించిన శ్రీ దుర్గా భవాని మహాప్రసాద భవనంను కూడా ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రూ.52.50 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ రెండు భవనాల ద్వారా అన్నప్రసాదం, మహాప్రసాదాల తయారీ, ప్యాకింగ్, నిల్వ, పంపిణీ మరింత సమర్థవంతంగా సిబ్బంది నిర్వహిస్తారన్నారు. ఒకేసారి 800 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించేలా కనకదుర్గ అన్నప్రసాద సదనంలో ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేశామని, రాబోయే రోజుల్లో రెండు భవనాల్లో యాంత్రీకృత వంటశాలలు ఏర్పాటు చేసి భక్తులకు మరింత పరిశుభ్రమైన, నాణ్యమైన అన్నప్రసాదాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా మౌలిక వసతులను నిరంతరం అభివృద్ధి చేస్తామన్నారు. రెండవ ఘాట్ రోడ్డు నిర్మాణం, శాశ్వత పార్కింగ్ సదుపాయాలపై కార్యాచరణ రూపొందించామన్నారు. అత్యవసర సమయాల్లో రాకపోకలు సజావుగా సాగేలా రెండవ ఘాట్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన సాధ్యాసాధ్యాలను పరిశీలించి, త్వరితగతిన నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కుమ్మరి పాలెం నుంచి 700 మీటర్ల మేర ఈ ఘాట్ రోడ్డు నిర్మించేందుకు ఇప్పటికే ఆర్ అండ్ బి, ఓ కన్సల్టెన్సీ సంస్థకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. అనంతరం మంత్రి నూతన శ్రీ కనకదుర్గ అన్నప్రసాద సదనంలో ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) తదితరులతో కలిసి భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. మహాప్రసాద భవనంలో పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని, వేద పండితుల ఆశీస్సులు పొందారు. ప్రసాద భవనంలో ఏర్పాటు చేసిన ప్రసాద విక్రయ కౌంటర్ వద్ద నగదు చెల్లించి కార్యక్రమంలో ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, 20సూత్రాలఅమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రామ్ ప్రసాద్, ప్రజాప్రతినిధులు, దేవస్థానం అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

**దుర్గమ్మ సేవలో విఐపిలు:**
దుర్గమ్మని శుక్రవారం రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, కొలుసు పార్థసారధి, విజయవాడ పశ్చిమ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ చౌదరి (సుజనా చౌదరి) దర్శించుకున్నారు. దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఒ. వికె శీనా నాయక్, ధర్మకర్తల మండలి సభ్యులు స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేద పండితులు ఆశీస్సులు, ప్రసాదాలు అందజేశారు.

**- ఖడ్గమాల పూజలో పురందేశ్వరి:**
శుక్రవారం ఖడ్గమాల పూజలో రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొని శ్రీ కనకదుర్గమ్మని దర్శించుకున్నారు. అనంతరం వేద పండితులు ఆశీస్సులు, ప్రసాదములు అందజేశారు.

**- నిత్యాన్నదాన పథకానికి విరాళం:**
దుర్గమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన బి సూర్యచంద్రరావు నాయుడు శుక్రవారం రూ.1,00,166ల విరాళం అందించారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# మత్స్యకారుల ఆచూకీ కోసం నిరంతరం గాలింపు

- 5 నౌకలు, 2 డోర్నియర్ విమానాలు, హెలికాప్టర్‌తో విస్తృత సెర్చ్ ఆపరేషన్
- కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలి: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం భారత తీర రక్షక దళం చేపట్టిన గాలింపు చర్యలు నిరంతరంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కోస్ట్‌గార్డ్ అసిస్టెంట్ కమాండింగ్ ఆఫీసర్ రంజిత్ కుమార్‌తో సంబంధిత అధికారులు మాట్లాడి సెర్చ్ ఆపరేషన్ పురోగతిని తెలుసుకున్నారని మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం 5 నౌకలు, రెండు డోర్నియర్ విమానాలు, ఒక హెలికాప్టర్‌తో సముద్రంలో విస్తృతంగా గాలిస్తున్నట్లు కోస్ట్‌గార్డ్ అధికారులు తెలియజేశారన్నారు. మత్స్యకారుల బోటుకు సంబంధించిన సమాచారాన్ని మయన్మార్, పోర్ట్‌బ్లెయిర్‌తోపాటు బంగ్లాదేశ్ సరిహద్దు తీరప్రాంతాల్లోని కోస్ట్‌గార్డ్ అధికారులకు కూడా చేరవేశారని తెలిపారు. ఆయా ప్రాంతాల్లోనూ బోటు ఆచూకీ కోసం అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం బోటు ఆచూకీ లభించనప్పటికీ, సెర్చ్ ఆపరేషన్‌లో ఎలాంటి విరామం ఉండదని మంత్రి స్పష్టం చేశారు. ఈ నెల 24వ తేదీ తరువాత బాధ్యతలు స్వీకరించే అధికారి కూడా గాలింపు చర్యలను కొనసాగిస్తారని కోస్ట్‌గార్డ్ అధికారులు తెలిపినట్లు వెల్లడించారు. మత్స్యకారులను సురక్షి తంగా తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కోస్ట్‌గార్డ్, నేవీతో నిరంతరం సమన్వయం చేసుకుంటోందని చెప్పారు. కుటుంబ సభ్యులు ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని, బోటు ఆచూకీ లభించే వరకు అన్ని మార్గాల్లో గాలింపు కొనసాగిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు భరోసా

## డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ



ఎన్‌జిఓ సంఘం రాష్ట్రఅధ్యక్షులు విద్యాసాగర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కా ంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం నాయకులు

**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త :** డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియ విజయవంతం కావటంపై ఉద్యోగులు ఆనందోత్సా హాలు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన తమ కల నెరవేరటంతో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు శుక్రవారం విజయవాడలోని ఏపిఎన్‌జిఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎన్‌జిఓసంఘం రాష్ట్రఅధ్యక్షులు ఏ.విద్యాసాగర్‌ను కాంట్రాక్ట్ ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు కలిసి సత్కరించారు. తమ సమస్య పరిష్కారానికి ఏపిఎన్‌జిఓ అసోసియేషన్ చేసిన కృషి మరువలేదని కొనియాడారు. తమ సమస్యను రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళటంలో సంఘం అధ్యక్షులు విద్యాసాగర్, కార్యదర్శి రమణలు ఎంతగానో శ్రమించారని పేర్కొన్నారు. తమ సమస్యను పరిష్కరించిన ముఖ్యమ ంత్రి చంద్రబాబునాయుడు, ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు ఈసందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ సెక ండరీహెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్రఅధ్యక్షులు కరెడ్ల అంజనీకుమార్, కార్యదర్శి శ్రీదేవి, ఇతర నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పారిశ్రామిక రంగంలో శిక్షణ

**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త :** విద్యార్థులను పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చేసేందుకు చేపట్టిన ఐదురోజుల శిక్షణాకార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. విజయవాడ ఎనికేపాడులోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్(ఆర్‌టిఐహెచ్) ఆధ్వర్యంలో ఈనెల 17వతేదీ నుండి 21వతేదీ వరకు ఐదురోజులపాటు విద్యార్థులకు పారిశ్రామిక ఆలోచనా విధానం, సమస్యలను గుర్తించటం, వినూత్న పరిష్కారాలను రూపొందించటం, వ్యాపార ఆలోచనలను అభివృద్ధి చేయటం, వంటి అంశాలపై శిక్షణనిచ్చారు. ఈసందర్భంగా 21 వినూత్న వ్యాపార ఆలోచనలను విద్యార్థులు నిపుణుల ముందు ప్రదర్శించారు. ఆర్‌టిఐహెచ్ విజయవాడ సీఈఓ డాక్టర్ హరిబాబు పర్యవేక్షణలో జరిగిన ఈకార్యక్రమంలో పీబీ. సిద్దార్ధ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులు పాల్గొన్నారు.

## రైజ్‌కేంద్రంలో మినీఎక్స్‌పోను సందర్శించిన కలెక్టర్

**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త :** మహిళలు ఏర్పాటు చేసిన మినీ ఎక్స్‌పోను ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా, ఢిల్లీనుండి వచ్చిన ఓడిఓపి అధికారి ఇషాదీప్‌సింగ్‌లు సందర్శించారు. ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలోని రైజ్‌కేంద్రంలో క్రాఫ్ట్అండ్ ఆర్ట్స్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈప్రదర్శనలో మహిళలు రూపొందించిన పలు ఉత్పత్తులను ప్రదర్శించారు. మహిళలకు అవసరమైన శిక్షణ, మార్గదర్శకత్వం, ఆర్థిక సహకారం అందించటం ద్వారా వారిని స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సది ్వనియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## గ్రామ రెవెన్యూ సహాయకులు సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** రెవెన్యూ శాఖలో గ్రామ రెవెన్యూ సహాయకులు (విఆర్‌ఏ)లు దీర్ఘకాలిక సమస్యలపై ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్యం చూపుతూ విఆర్‌ఏలు కంట కన్నీళ్లు తెప్పిస్తుందని ఈ విషయం ప్రభుత్వాలకు శాపం అన్న సంగతి ప్రభుత్వం వెంటనే గుర్తెరగాలని ఎపి విఆర్‌ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష. ప్రధాన కార్యదర్శులు నల్లిపోగు నాగేశం, గుజ్జుల ఈశ్వరయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. గత 9సంవత్సరాలుగా సమస్యలు పరిష్కారం కోరుతూ ఎక్కని గడప లేదని ప్రభుత్వం వెంటనే స్పందించి విఆర్‌ఏలకు "పే స్కేల్" ఇవ్వాలని, నామిని వీఆర్‌ఏలను వెంటనే రెగ్యులర్ చెయ్యాలని డిమాండ్ చేశారు. గతంలో వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి. ముఖ్యమంత్రి హయాంలో చేసిన విధంగా ఒకే దఫా "వన్ టైం సెటిల్ మెంట్" ద్వారా రెవెన్యూ శాఖలో ఉన్న అన్ని ఖాళీలను వీఆర్‌ఏలచే భర్తీ చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం స్థానిక సంస్థలు ఎన్నికలు సమీపిస్తున్నందున వెంటనే వీఆర్‌ఏల సమస్యలు అత్యంత ప్రాధాన్యతగా ప్రభుత్వం భావించి పరిష్కరించిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## కర్ణాటక డిఫెన్స్ లిక్కర్ బాటిళ్ల పట్టివేత

**హైదరాబాద్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** నగరంలోని ఎస్‌ఆర్ నగర్ చౌరస్తా వద్ద శుక్రవారం నాడు కర్నాటకకు చెందిన డిఫెన్స్ లిక్కర్‌ను అబా ్కరీ పోలీసులు పట్టుకున్నారు. ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద అనుమానాస్పదంగా వున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతని వద్ద గల బ్యాగులను సోదాచేయగా నాలుగు కర్నాటక డిఫెన్స్ లిక్కర్ బాటిళ్లను వెలుగు చూశాయి. దీని తరువాత అతన్ని గట్టిగా నిలదీస్తే ఇదే ప్రా ంతంలోని గోవర్ధన్ రెడ్డి అనే వ్యక్తి నుంచి ఈ మద్యం బాటిళ్లను కొన్నట్లు తెలిపాడు. అనంతరం గోవర్ధన్ రెడ్డి ఇంటికి వెళ్లిన పోలీసులు అతని ఇంటిని తనిఖీ చేయగా 51 కర్నాటక డిఫెన్స్ లిక్కర్ బాటిళ్లు లభించగా వాటిని కూడా జప్తు చేశారు. కర్ణాటకలోని పలు ప్రాంతాలలో మిలట రీలో పనిచేసే కొందరు వ్యక్తుల నుంచి వీరు ఈ మద్యం బాటిళ్లను తక్కువ ధరకు కొనుగోలు చేసి జంట నగరాలలో మద్యం ప్రియులకు లేదా కల్తీ సరుకో అని నిర్ధారించేందుకు పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు.

# బిసి వర్గాల అభ్యున్నతే రాష్ట్ర అభ్యున్నతి

- టిడిపి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, శాసన మండలి సభ్యులు బీద రవిచంద్ర

**నెల్లూరు(వైద్యం), ఆగస్టు 21 ప్రభాతవార్త:** బిసిలకు దేశంలో మొట్టమొదటిసారి రిజర్వేషన్లు కల్పించిన ఘనత స్వర్గీయ ఎన్టీ రామారావుకే చెందుతుంది. బిసి వర్గాల అభ్యున్నత రాష్ట్ర అభివృద్ధిని భావించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్రంలో బిసి వర్గాలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం సంతోషకర విషయం అని నెల్లూరు పార్లమెంటు పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ బీద రవిచంద్ర అన్నారు. ఈ మేరకు శుక్రవారం నెల్లూరులోని టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. లోకేష్ ప్రతి ప్రాంతంలో బిసి వర్గాల సమస్యలపై వారితో నేరుగా మాట్లాడుతూ పరిష్కరిస్తున్నారు. నూతన రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత 12 సంవత్సరాలుగా బిసి వర్గాలకు చెందిన నేతలే పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్నారు. కూటమి పార్టీల నిర్ణయం మేరకు డిప్యూటీ సీఎం పదవిని పవన్ కల్యాణ్‌కి కేటాయించారు. గత ప్రభుత్వంలో ఐదు మంది ఉపముఖ్యమంత్రులు ఉంటే పేరుకే పదవులు ఉన్నాయి. పెత్తనం పై వారు చేశారు. వైసిపి హయాంలో బలహీన వర్గాలు పనిచేసే పరిస్థితి లేదు. సకల శాఖామంత్రి కనుసన్నల్లోనే పరిపాలన సాగేది. బిసిలకు ఇస్తున్న రిజర్వేషన్ అడ్డుకోవాలని చూసింది ఎవరు? వైసిపి కాదా.. రిజర్వేషన్ అడ్డుకునేందుకు వైసిపి కుట్రలు పన్నుతోంది. అందుకు నిదర్శనమే అనిల్ కుమార్ యాదవ్ ప్రెస్ మీట్ అని అన్నారు. స్వర్గీయ ఎన్టీ రామారావు శ్రీకారం చుట్టిన బిసి సాధికారతను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొనసాగిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బిసిలకు అవకాశం ఇవ్వడం వల్లే ఎంపిటిసిలు, ఎంపిపిలు, జడ్‌పిటిసిలుగా రాణిస్తున్నారు. బిసిలను గ్రామస్థాయి నుంచి పార్లమెంటు స్థాయికి ప్రోత్సహించిన ఘనత టిడిపిదే. బీసీలకు రిజర్వేషన్ పేటెంట్ హక్కు తెలుగుదేశం పార్టీది. అనిల్ కుమార్ యాదవ్ ప్రెస్‌మీట్ పెట్టి టిడిపి కుట్రలు చేస్తోందని ఆరోపిస్తున్నారు. అసలు తెలుగుదేశం పార్టీనే బిసిలకు రిజర్వేషన్లు తీసుకురాకపోయింటే అనిల్ కుమార్ యాదవ్ కార్పొరేటర్‌గా పోటీ చేసేవారా? ఈ స్టేజి మీద ఉన్న ప్రతి ఒక్కరూ రిజర్వేషన్లను ఉపయోగించుకుని ఈ స్థాయికి ఎదిగిన వాళ్లమే. వైసిపి హయాంలో 16,800 మంది బిసి నేతలు గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు నాయకత్వం కోల్పోయారు. రాజకీయంగా నిరాదరణకు గురయ్యారు. 70 వేల బ్యాక్లాగ్ పోస్టులను భర్తీ చేయలేకపోయారని ఆయన అన్నారు.

# ఎపిపిఎస్‌సిపై జగన్ వన్నీ అబద్ధాలే!

- శాప్ ఛైర్మన్ రవి నాయుడు



**తిరుపతి(హెల్త్), ఆగస్టు 21 ప్రభాతవార్త:** పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్ రెడ్డి నిజాలు మాట్లాడితే అతని తల వేయి ముక్కలవుతుందని, నిజాలు చెప్పవద్దని అతని తండ్రి అతనికి సూచించాడని శాప్ చైర్మన్ రవి నాయుడు ఎద్దేవా చేశారు. గురువారం మీడియా సమావేశంలో జగన్ మాట్లాడిన ప్రతి మాట అబద్ధపు మాటలని, స్వయాన డిఎస్సీ అభ్యర్థులు, ఆ పక్రియలో భాగస్వామ్యం అయిన అధికారులు చెబుతున్న పదే పదే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని రవి నాయుడు ఆరోపించారు. శుక్రవారం తిరుపతిలో విలేకరులతో మాట్లాడుతూ గోల్డ్ మెడల్ దుర్గయ్య కోర్టుకు సబ్మిట్ చేశారని, అలాగే అవుట్ సోర్సి ంగ్ ఎంప్లాయ్ నవీన్ ఐడిని లాగిన్ క్లోజ్ చేస్తారనేది కూడా తెలియదని, ఇతనికి ఉద్యోగం ఇవ్వాలంటున్నాడో, ఇవ్వవద్దంటున్నాడో కూడా క్లారిటీగా జగన్ చెప్పడం లేదన్నారు. టెట్ క్వాలిఫై అయిన వారికి మాత్రమే టీచర్ ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఏ ప్రక్రియ ఏ సమస్థ ద్వారా ఉద్యోగాలు వస్తాయో! తెలియని అతను ఐదు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేయడం సిగ్గుచేటన్నారు. ఎపిపిఎస్‌సిని భ్రష్టు పట్టించిన వ్యక్తి జగన్ అని, డిఎస్సీ, ఎపిపిఎస్సీ అంటే ఏమిటో? అనేది జగన్ తెలుసుకోవాలన్నారు. 2016లో ప్రజా ప్రభుత్వం గ్రూప్ వన్ పోస్ట్ పివి సింధుకు ఇవ్వడం జరిగిందని, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీలలో గెలుపొందిన క్రీడాకారులను అదే తరహాలో గుర్తించాలని చెప్పారే తప్ప అందరికీ గ్రూప్ వన్ ఉద్యోగాలు ఇవ్వమని కాదని, మెడల్ అంటే బిల్ల కాదు గౌరవం అన్నారు. తప్పుడు సర్టిఫికెట్ ఇచ్చిన వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు. జగన్ ఆడే పబ్జి గేమ్ స్పోర్ట్స్ కోటాలో లేనందువలన ఈ రాద్ధాంతం అంతా చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో తాతయ్య గుంట గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసు, గంగమ్మ గుడి డైరెక్టర్ వినుకొండ వెంకట్, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ వి ఎం శ్రీధర్, తెలుగు యువత నాయకులు కొట్టే హేమంత్ రాయల్, గంగమ్మ గుడి మాజీ డైరెక్టర్ గంజి సుధాకర్ రెడ్డి, ముని రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత

- రూ.1,500 కోట్లతో ఎస్ టి పి ప్రాజెక్టులు... శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలకు వినియోగించేలా చర్యలు. రోడ్లు, వీధి దీపాల పనులకు అత్యవసర ప్రాతిపదికన ప్రాధాన్యత.
- వెలంపేటలో 12 అంతస్తుల గృహ సముదాయాలు... 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో గృహాలు.
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి. నారాయణ.

**విశాఖపట్నం, ఆగస్టు 21 ప్రభాతవార:** విశాఖ నగరంలో తాగునీరు, రోడ్లు, వీధి దీపాలు, మురుగునీటి నిర్వహణ తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి. నారాయణ తెలిపారు. శుక్రవారం విఎంఆర్డిఏ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు,, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, విఎంఆర్డిఏ అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సమీక్ష సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎం సీ అభివృద్ధి కార్యక్రమాలు, చేపట్టవలసిన కార్యక్రమాలు, ప్రతిపాదిత ప్రాజెక్టు పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ముఖ్యమంత్రికి, ప్రజా ప్రతినిధులకు వివరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి తెలిపారు. విశాఖకు గోదావరి జలాలు రానున్న నేపథ్యంలో వాటి నిల్వకు అవసరమైన ప్రాంతాలను గుర్తించామని, సుమారు రూ.1,000 కోట్లతో తాగునీటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తే ప్రతి ఇంటికీ రోజుకు 135 లీటర్ల నీటిని అందించవచ్చని పేర్కొన్నారు. గోదావరి జలాలతో విశాఖ తాగునీటి సమస్య చాలా వరకు పరిష్కారమవుతుందన్నారు.మురుగునీటి శుద్ధి కోసం సుమారు రూ.1,500 కోట్లతో ఎస్ టి పి ప్రాజెక్టులను సిద్ధం చేస్తున్నామని, శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలకు అందించడం ద్వారా మంచినీటి వినియోగాన్ని తగ్గించవచ్చని తెలిపారు. డేటా సెంటర్ల వల్ల విశాఖలో నీటి సమస్య ఏర్పడుతుందనే ప్రచారంలో వాస్తవం లేదని పేర్కొన్నారు.నగరంలో రోడ్లు, వీధి దీపాల పనులను అత్యవసర ప్రాతిపదికన చేపట్టాలని నిర్ణయించామని మంత్రి తెలిపారు. రహదారి పనుల జాప్యంపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డితో చర్చించామని, అవసరమైన ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడిన వెంటనే పనులను వేగవంతం చేస్తామన్నారు. వెలంపేటలో 12 అంతస్తుల గృహ సముదాయాలను నిర్మించి, అర్హులకు సుమారు 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో గృహాలు అందించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు.మున్సిపల్ ఎన్నికల అంశం ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉందని, కోర్టు తీర్పు అనంతరం ఎన్నికల ప్రక్రియకు సంబంధించి తదుపరి చర్యలు చేపడతామని మంత్రి వెల్లడించారు.ఈ సమీక్షలో గాజువాక ఎమ్మెల్యే, రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు), అనకాపల్లి ఎంపీ సి.ఎం. రమేష్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పి. విష్ణుకుమార్ రాజు, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్ బాబు, కొణతాల రామకృష్ణ, వి ఎం ఆర్ డి ఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి ఘటనపై విజయసాయిరెడ్డి ప్రశ్నల వర్షం

**విశాఖపట్నం, ఆగస్టు 20, ప్రభాతవార్త:** గోదావరిలో పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజినీర్ నూకరాజు కుటుంబానికి సంబంధించిన ఘటనపై మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. ఈ ఘటనకు సంబంధించి వస్తున్న ఆరోపణలు, మత మార్పిడికి సంబంధించిన అంశాలపై అధికార టీడీపీ, ప్రతిపక్ష వైఎస్సార్సీపీలు సూటిగా సమాధానం చెప్పాలని,ఖిఎక్స్ఖి వేదికగా డిమాండ్ చేశారు.నూకరాజు కుటుంబం గోదావరిలో దూకడానికి కారణం 'లవ్ జీహాద్' అని తెలిసినా ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. మత మార్పిడికి సాదిక్ ఖాన్ ఒత్తిడి చేశారన్న ఆరోపణలను ఆషామాషీ అంశంగా ఎందుకు చూస్తున్నారని నిలదీశారు.గోదావరిలో దూకి మృతి చెందిన సౌజన్య తన భర్త జగదీశ్వర్‌రెడ్డి మరణానికి కూడా సాదిక్ కారణమని తన మరణ వాంగ్మూలంలో పేర్కొన్నారని విజయసాయిరెడ్డి తెలిపారు. ఈ వ్యవహారాన్ని లవ్ జీహాద్, హత్యగా ఎందుకు పరిగణించడం లేదని, హిందూ బీసీలు, హిందూ రెడ్డి సామాజిక వర్గంపై దాడిగా ఎందుకు భావించడం లేదని టీడీపీ, బీజేపీ రాష్ట్ర నాయకత్వాలను ప్రశ్నించారు.మనుషులను హత్య చేసి మత మార్పిడులకు పాల్పడుతున్న మాఫియాలు ఏపీలో గ్రామగ్రామాన వివిధ పేర్లతో విస్తరిస్తున్నాయన్న ఆరోపణలపై ప్రధాన రాజకీయ పార్టీలు ఎందుకు మౌనం వహిస్తున్నాయని ప్రశ్నించారు. మైనారిటీ ఓట్ల కోసమేనా ఈ మౌనం అని నిలదీశారు. మత మార్పిడుల నిరోధానికి చంద్రబాబు ప్రభుత్వం చట్టం ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు.సాదిక్ ఖాన్ ఇప్పటివరకు ఎందుకు పట్టుబడలేదని, లేక అతడిని పట్టుకునే ఉద్దేశం లేదా అని ప్రశ్నించిన విజయసాయిరెడ్డి.. అతడు ఏ రాజకీయ పార్టీ కార్యకర్త, 2024 ఎన్నికల్లో ఏ పార్టీకి ప్రచారం చేశాడనే వివరాలను ఎందుకు బయటపెట్టడం లేదని నిలదీశారు.సౌజన్య, జగదీశ్వర్‌రెడ్డి దంపతుల కుమారుడు రియాన్ష్‌రెడ్డిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పరామర్శించి కుటుంబానికి అండగా నిలవాలని ఎందుకు భావించలేదని ప్రశ్నించారు.

## ఎపిఎండిసికి 'బెస్ట్ స్టేట్ లింక్డ్ ఇష్యూర్స్ పురస్కారం




ప్రతిష్ఠాత్మక 'బెస్ట్ స్టేట్ లింక్డ్ ఇష్యూయర్' అవార్డును అందుకుంటున్న ఎపిఎండిసి ఎండి ప్రవీణ్ కుమార్

**విజయవాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిఎండిసి)కు ప్రతిష్ఠాత్మక 'బెస్ట్ స్టేట్ లింక్డ్ ఇష్యూయర్' అవార్డు లభించింది. ముంబైలో నిర్వహించిన అసోచామ్ జాతీయ సదస్సులో ఈ పురస్కారాన్ని ఎపిఎండిసి మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ అందుకున్నారు. కార్పొరేట్ బాండ్ మార్కెట్ ద్వారా సెక్యూర్డ్ నాన్‌కన్వర్టిబుల్ డిబెంచర్స్(ఎన్‌సిడి) జారీ చేసి విజయవంతంగా రూ.9,000 కోట్లను సమీకరించిన ఎపిఎండిసి ప్రతిష్ఠాత్మక ఆర్థిక కార్యక్రమానికి గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ సంస్థగా ఇంత భారీ స్థాయిలో నిధులను సమీకరించడం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. ఈ సందర్భంగా ఎపిఎండిసి, ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టితో కూడిన నాయకత్వం, మార్గదర్శకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. అలాగే బాండ్ జారీ విజయవంతం కావడానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ, పరిశ్రమలు, గనులు, భూగర్భశాస్త్ర శాఖ, ఇతర సంస్థలు, ఏజెన్సీలకు ఎపిఎండిసి కృతజ్ఞతలు తెలియజేసింది.

## డ్రగ్స్, డ్రంకన్ టెస్ట్‌లో సంజూష్‌కు నెగెటివ్



**హైదరాబాద్, ఆగస్టు 21 ప్రభాతవార్త:** హైదరాబాద్ మాదాపూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నిందితుడుగా వున్న జనసేన ఎంపి లింగమనేని రమేష్ కు మారుడు సంజూష్‌కు డ్రగ్స్, డ్రంకన్ పరీక్షల్లో నెగిటివ్‌గా వచ్చింది. ఈ నెల 16వ తేదీన మధ్యాహ్నం వేళ జరిగిన ప్రమాదంలో ఓ యువతి మరణించడం తెలిసిందే. ఈ సమయంలో సంజూష్ కారును వేగంగా, నిర్లక్ష్యంగా నడిపినట్లు పోలీసులు తేల్చారు. ప్రమాదం తరువాత సం జూష్ గాయపడ్డ యువతిని తన కారులోనే సమీపంలోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించింది. దీని తరువాత సంజూష్ జరిగిన ప్ర మాదంపై మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం మాదాపూర్ పోలీసులు సంజూష్‌పై కేసు నమోదు చేసి అతను నడిపిన కారు ను జప్తు చేశారు. సంజూష్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని నిర్ధారించిన పోలీసులు అతనికి డ్రంకన్ పరీక్షలు మొదట నిర్వహించారు. అన ంతరం డ్రగ్స్ టెస్ట్ కోసం పోలీసు స్టేషన్‌లోనే అతని నుంచి రక్త నమూనాలను తీసుకున్నారు. కాగా ఈ పరీక్షలకు సంబంధించిన ఫలితాలు శు క్రవారం వచ్చాయి. ప్రమాదం జరిగిన సమయంలో కారు నడిపిన సంజూష్ మద్యం సేవించి లేదని, అంతకు ముందు అతను ఎలాంటి డ్రగ్స్ కూడా తీసుకోలేదని పరీక్షలో తేలిందని కూకట్‌పల్లి డిసిపి రితిరాజ్ మీడియాకు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో నిందితుడి తండ్రి ఎంపి లింగమ నేని రమేష్ తమపై ఎలాంటి ఒత్తిడి తేలేదని, అంతా చట్ట ప్రకారమే జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ కేసులో కారును జప్తు చేసి నిందితు డికి నోటీసు ఇచ్చి స్టేషన్ బెయిల్ ఇచ్చామని, దీనిపై తదుపరి విచారణ సాగుతుందని డిసిపి తెలిపారు.

## తిరుపతి మేయర్‌గా నేర చరితులు వద్దు!

**తిరుపతి, ఆగస్టు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా, ఆధ్యాత్మిక నగరంగా తిరుపతికి ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. అలాంటి పవిత్ర నగరానికి ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యే వారు ప్రజాసేవకు ప్రతిరూపంగా ఉండాలి తప్ప, నేరాలు, దౌర్జన్యాలు, అక్రమాలతో సంబంధం ఉన్న వ్యక్తులు కాకూడదని ఎపి చైతన్య వేదిక కన్వీనర్ డాక్టర్ ఎన్.బి. సుధాకర్ రెడ్డి అన్ని రాజకీయ పార్టీలను కోరారు. రాబోయే తిరుపతి నగర పాలక సంస్థ ఎన్నికల్లో మేయర్, కార్పొరేటర్ అభ్యర్థుల ఎంపికలో నేర చరిత్రను ప్రధాన ప్రమాణంగా పరిగణించాలని ఆయన సూచించారు. కేవలం గెలుపు అవకాశాలు, ఆర్థిక బలం, రాజకీయ పలుకుబడి ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయడం ప్రజాస్వామ్యానికి, తిరుపతి ప్రతిష్ఠకు మంచిది కాదన్నారు. నగర అభివృద్ధి, పారిశుద్ధం, ట్రాఫిక్, పర్యావరణ పరిరక్షణ, ప్రజా భద్రత, పట్టణ ప్రణాళిక వంటి అంశాలపై అవగాహనతో పాటు ప్రజల సమస్యల పట్ల సున్నితత్వం ఉన్న వ్యక్తి మేయర్‌గా ఉండాలని ఆకాంక్షి ంచారు. అందువల్ల రాజకీయ పార్టీలు నేర చరిత్ర లేని, ప్రజాస్వామ్య విలువల పట్ల గౌరవం ఉన్న, సామాజిక స్పృహ, సేవా దృక్పథం, విద్య, నైతిక విలువలు, దూరదృష్టి కలిగిన వ్యక్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి

## ఇందిరమ్మ ఇల్లు పేరుతో మహిళపై అత్యాచారం!

**ఆత్మకూరు(ఎం), ఆగస్టు 21, ప్రభాతవార్త:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైందనే ఆశను ఆసరాగా చేసుకుని ఓ మహిళపై అత్యా చారం జరిగినట్లు ఆరోపణలు కలకలం రేపు తు న్నాయి. ఇందిరమ్మ ఇల్లు వచ్చిందని, ఇంటి నిర్మాణానికి సిమెంట్ బస్తాలు ఇస్తానని చెప్పి ఇంటికి పిలిపించి అత్యాచారం చేశాడని స్థానిక నేతపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసిం ది. బాధితురాలి భర్తకు విషయం తెలియడంతో గ్రామపెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వ హించినట్లు తెలుస్తోంది. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి కేసు పెట్టవద్దంటూ బాధితురాలిని, ఆమె భర్తను బెదరించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

# శ్రీలంకతో రెండో టెస్ట్‌లో కుల్దీప్‌పై వేటు!




**న్యూఢిల్లీ:** శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో శుభారంభం చేసిన టీమిండియా ఆఖరి పోరుకు సన్నదమవుతోంది. ఈ నెల 23 నుంచి కొలంబో వేదికగా జరిగే రెండో టెస్ట్‌లో ఆతిథ్య శ్రీలంకతో అమీతుమీ తేల్చుకోనుంది. తొలి టెస్ట్ తరహాలోనే కొలంబోలోనూ ఆధిపత్యం చెలాయించి 2-0తో సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయాలనే లక్ష్యంతో భారత్ ఉంది. తద్వారా డబ్ల్యూటిసి 2027 ఫైనల్ బెర్త్ అవకాశాలను మెరుగుపర్చుకోవాలనుకుంటుంది. తొలి టెస్ట్‌లో భారత్ మూడు విభాగాల్లో సత్తా చాటింది. అయితే కుల్దీప్ యాదవ్ వైఫల్యం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో (1/65) ఒకే ఒక్క వికెట్ తీసిన కుల్దీప్ యాదవ్, రెండో ఇన్నింగ్స్‌లో (0/37) ఒక్క వికెట్ పడగొట్ట లేకపోయాడు. మరోవైపు మానవ్ సుతర్ 10 వికెట్లతో సత్తాచాటగా, జడేజా 4వికెట్లు పడగొట్టాడు. దాంతో కుల్దీప్ యాదవ్‌పై విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే రెండో టెస్ట్ నుంచి కుల్దీప్ యాదవ్‌ను తప్పించి అతని స్థానంలో డొమెస్టిక్ వెటరన్ స్పిన్నర్ సరాన్ష్ జైన్‌ను ఆడిస్తారనే చర్చ జరుగుతోంది.

## ధ్రువ్ జురెల్ స్థానంలో సర్ఫరాజ్

## టీమిండియాలో స్వల్ప మార్పులు

అదే జరిగితే 33 ఏళ్ల వయసులో అరంగేట్రం చేసిన భారత క్రికెటర్‌గా సరాన్ష్ జైన్ నిలవనున్నాడు. మరోవైపు భారత్ మూడో స్పిన్నర్‌తో ఆడాలనుకుంటే కుల్దీప్ యాదవ్‌ను కొనసాగించే అవకాశాలు కూడా పరిశీలనలో ఉన్నాయి. అయితే కుల్దీప్ యాదవ్ స్థానంలో సరాన్ష్ జైన్‌ను ఆడించవచ్చని అంచనాలు కూడా ఉన్నాయి. ఇక తొలి టెస్ట్‌లో ధ్రువ్ జురెల్ గాయపడ్డాడు. మూడో రోజు ఆటలో ఫీల్డింగ్ చేస్తుండగా. అతని ఎడమ చీలమండకు గాయమైంది. దాంతో అతను మైదానం వీడగా సర్ఫరాజ్ ఖాన్ సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్‌గా మ్యాచ్‌లో కొనసాగాడు. ప్రస్తుతం అతని గాయాన్ని బిసిసిఐ మెడికల్ టీమ్ పర్యవేక్షిస్తుందని తెలుస్తోంది. గాయం తీవ్రత ఎక్కువగా ఉంటే రెండో టెస్ట్‌కు ధ్రువ్ జురెల్ దూరం కానున్నాడు. అతని స్థానంలో సర్ఫరాజ్ ఖాన్ బరిలోకి దిగుతాడు. తొలి టెస్ట్‌లో జురెల్ హాఫ్ సెంచరీతో రాణించాడు.

మిగతా కాంబినేషన్‌లో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు. ఓపెనర్లుగా కేఎల్ రాహుల్, జైస్వాల్ ఆడనుండగా, దేవదత్ పడిక్కల్ ఫస్ట్ డౌన్‌లో బరిలోకి దిగనున్నాడు. శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, రవీంద్ర జడేజా మిడిలార్డర్‌లో ఆడనున్నారు.

తొలి టెస్ట్‌లో విఫలమైన జైస్వాల్, శుభ్‌మన్ గిల్ సత్తా చాటాల్సిన అవసరం ఉంది. మానవ్ సుతార్ స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా ఆడనుండగా, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ పేస్ బాధ్యతలు పంచుకో నున్నారు. సిరాజ్, ప్రసిధ్ కృష్ణలో ఒకరికి రెస్ట్ ఇవ్వాలనుకుంటే గుర్నూర్ బ్రార్ జట్టులోకి వస్తాడు. ఆకిబ్ నబీకి మరోసారి నిరాశే ఎదురవ్వనుంది.

## 15 యేళ్ల తర్వాత భారత్‌కు.. మహిళల డబుల్స్ ట్రీసా-గాయత్రి పతకం




**న్యూఢిల్లీ:** బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో 15 ఏళ్ల తర్వాత భారత్‌కు మహిళల డబుల్స్ పతకాన్ని ట్రీసాగాయత్రి ఖరారు చేశారు. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో భారత మహిళల డబుల్స్ జోడీ ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్‌లు నాలుగో సీడ్ జియా యి ఫాన్-జాంగ్ షు జియాన్‌లపై అద్భుత విజయం సాధించి పతకాన్ని ఖాయం చేసుకున్నారు. తొలి గేమ్‌లో వెనుకబడినప్పటికీ, వారు పుంజుకుని క్వార్టర్‌ఫైనల్‌లో నాలుగుసార్లు ప్రపంచ ఛాంపియన్ అయిన జియా, ఆమె కొత్త భాగస్వామి జాంగ్‌లను 16-21, 21-15, 21-13 తేడాతో ఓడించారు. ప్రపంచ 39వ ర్యాంకర్ అయిన ట్రీసాగాయత్రి, ప్రపంచ 4వ ర్యాంకర్ అయిన చైనా జోడీతో జరిగిన గత మూడు మ్యాచ్‌లలో ఓడిపోయినందున, ఈ మ్యాచ్‌లో బలహీనమైన జట్టుగా బరిలోకి దిగారు. ఫేవరెట్‌లుగా మ్యాచ్‌ను ప్రారంభించిన చైనా జోడి 6-0 ఆరంభ ఆధిక్యాన్ని సంపాదించింది. భారత జోడీ కొన్ని అనవసర తప్పిదాలు చేసి, 2-9 తేడాతో మరింత వెనుకబడ్డారు. అయితే చైనా షట్లర్లను గందరగోళానికి గురిచేసి వరుసగా ఐదు పాయింట్లు సాధించారు. ట్రీసా జోడీ పలు అనవసర తప్పిదాల కారణంగా చైనా జంట 5-1తో ఆరంభ ఆధిక్యం సాధించింది. రెండో గేమ్‌లో గాయత్రి ద్వయం కొన్ని మంచి నెట్ షాట్‌లతో మరోసారి పుంజుకుని, లోటును పూడ్చి, గేమ్‌ను 7-8తో తిరిగి తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. కొన్ని అద్భుతమైన స్మాష్‌లతో పోరాటాన్ని కొనసాగించి, 11-10 ఆధిక్యంతో రెండవ మిడ్‌గేమ్‌లోకి ప్రవేశించారు. గాయత్రి విన్నర్ పాయింట్లు సాధించడంతో భారత జోడి తమ ఆధిక్యాన్ని 13-10కి పెంచుకుంది. మూడవ గేమ్‌లోఒత్తిడికి లోనైన చైనా షట్లర్లు అనవసర తప్పిదాలు చేయడంతో, భారతీయులు 9-4తో భారీ ఆధిక్యాన్ని సాధించారు. చివరి ఎండ్స్ మారే సమయానికి, భారత్ 11-5 ఆధిక్యంతో భారీ విజయాన్ని అందుకున్నారు.


## డ్యూరాండ్ కప్.. ఫైనల్‌కు మోహన్ బగాన్



**షిల్లాంగ్:** డ్యూరాండ్ కప్ 2026 సెమీఫైనల్‌లో మోహన్ బగన్ జట్టు డిఫెండింగ్ ఛాంపియన్ నార్త్ ఈస్ట్ యునెటెడ్ ఎఫ్‌సిపై పెనాల్టీల్లో విజయం సాధించి ఫైనల్‌లోకి ప్రవేశించింది. షిల్లాంగ్‌లో నిర్ణీత సమయం ముగిసేసరికి 0-0తో ముగిసిన రెండో సెమీఫైనల్‌లో, పెనాల్టీల ద్వారా మెరైనర్స్ (మోహన్ బగాన్) జట్టు హైలాండర్స్‌పై 4-3 తేడాతో విజయం సాధించింది. తొలి 20 నిమిషాల్లో ఇరు జట్లు మిడ్‌ఫీల్డ్‌లో పట్టు సాధించడానికి ఇబ్బంది పడ్డాయి. దాడి చేసే అవకాశాలను సృష్టించుకునే ప్రయత్నంలో ఇరు జట్లు తరచుగా డిఫెన్సివ్ లైన్ మీదుగా లాంగ్ బాల్స్ పంపడానికే మొగ్గు చూపాయి. అరగంట తర్వాత అలాద్దీన్ అజరాయీ కొట్టిన వాలీ గోల్ పోస్ట్‌ను త్రుటిలో తప్పించుకుంది. ఈ సమయంలో ఇరు జట్లు చెరో మూడు కార్నర్‌లను సంపాదించాయి. తొలి అర్ధభాగం మాదిరిగానే రెండో అర్ధభాగం కూడా అదే రీతిలో సాగి ఇరు జట్లు స్పష్టమైన అవకాశాలను పొందలేకపోయాయి. చివరికి, నిర్ణీత సమయం ముగిసేసరికి మ్యాచ్ 0-0తో ముగియడంతో, ఇరు జట్లు పెనాల్టీ షూటౌట్‌కు సిద్ధపడ్డాయి. రెండు జట్లు తమ మొదటి మూడు పెనాల్టీలను విజయవంతంగా మార్చుకున్న తర్వాత, షూటౌట్ హోరాహోరీగా సాగింది. నార్త్‌ఈస్ట్ యునైటెడ్ తరఫున నాలుగో కిక్ కొట్టడానికి రాబిన్ యాదవ్ ముందుకు రాగా, అతని ప్రయత్నాన్ని కైత్ అద్భుతంగా అడ్డుకున్నాడు. తర్వాత జేమీ మెక్లారెన్ గోల్ చేసి మోహన్ బగాన్‌ను ఆధిక్యంలోకి తీసుకువెళ్లాడు. అనంతరం కైత్ మరో అద్భుతమైన సేవ్‌తో పార్థిబ్ గొగోయ్ కొట్టిన షాట్‌ను అడ్డుకోవడంతో, మోహన్ బగాన్ ఫైనల్‌కు చేరింది.







## ప్రపంచ రెజ్లింగ్..కాజల్‌కు స్వర్ణం తను, సవితకు రజతాలు

**స్లోవేకియా:** స్లోవేకియాలో జరిగిన అండర్20 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన కాజల్ ధోచక్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. మహిళల 76 కేజీల విభాగంలో తిరుగులేని విజయం సాధించి, వరుసగా రెండో స్వర్ణ పతకాన్ని గెలుచుకోవడం ద్వారా కాజల్ అంతర్జాతీయ రెజ్లింగ్‌లో తన అద్భుతమైన ప్రస్థానాన్ని కొనసాగించింది. 18 యేళ్ల భారత క్రీడాకారిణి ఫైనల్‌లో చైనాకు చెందిన జింగ్రు సన్‌ను 7-0 తేడాతో ఓడించి ప్రపంచ టైటిల్‌ను కైవసం చేసుకుంది. భారత రెజ్లర్ ఒక్క పాయింట్ కూడా కోల్పోకుండా తన ప్రచారాన్ని పూర్తి చేసింది. ఆమె జపాన్‌కు చెందిన మియు తకయామాపై ఫాల్ ద్వారా విజయంతో ప్రారంభించి, ఆ తర్వాత టర్కీకి చెందిన ఎల్మిరా యాసిన్‌పై 14-0 తేడాతో గెలిచి, సెమీఫైనల్స్‌లో అమెరికాకు చెందిన పైపర్ ఫౌలర్‌ను 6-0 తేడాతో ఓడించింది. అండర్20 ఆసియా ఛాంపియన్‌షిప్‌లలో సన్‌తో జరిగిన తొలి రౌండ్ పోరుకు ఈ ఫైనల్ రీమ్యాచ్ జరిగింది, అందులో కూడా భారత కాజల్ విజయం సాధించింది. స్టెప్‌అవుట్ ద్వారా కాజల్ 1-0 ఆధిక్యం సాధించి, ఆ తర్వాత డబుల్‌లెగ్ టేక్‌డౌన్ చేసి స్కోరును 3-0కి చేర్చింది. అనంతరం, ఓపెన్ హ్యాండ్స్ ఉపయోగించినందుకు సన్‌కు హెచ్చరిక జారీ చేయడంతో, కాజల్ ఖాతాలో మరో పాయింట్ చేరింది. ఆ తర్వాత కాజల్ మరో టేక్‌డౌన్ సాధించి 7-0 తేడాతో విజయాన్ని పూర్తి చేసింది. అలాగే 72 కేజీల ఫైనల్‌లో తను శర్మ జపాన్‌కు చెందిన చిసాటో యోషిడాతో హోరాహోరీగా తలపడినా, పాయింట్ల పరంగా 3-5 తేడాతో ఓడిపోయి రజత పతకంతో సరిపెట్టుకుంది. ఫైనల్‌లో జపాన్‌కు చెందిన సకురా ఒనిషి చేతిలో 12-2 తేడాతో టెక్నికల్ సుపీరియారిటీతో ఓడిపోవడంతో, 62 కేజీల విభాగంలో సవిత మరో రజత పతకాన్ని కైవసం చేసుకుంది.

## ప్రపంచ ఛాంపియన్‌షిప్.. వరుస ఓటములతో సత్విక్-చిరాగ్ నిష్క్రమణ



**కొలంబో:** లియాంగ్‌వాంగ్ చేతిలో వరుస గేమ్‌లలో ఓటమి పాలైన సత్విక్‌చిరాగ్, బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌ల నుండి నిష్క్రమించారు. శుక్రవారం న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో చైనాకు చెందిన లియాంగ్ వీ కెంగ్, వాంగ్ చాంగ్‌ల చేతిలో 18-21, 9-21 తేడాతో ఓడిపోయిన భారత జోడీ సత్విక్ సాయి రాజ్, రంకిరెడ్డి-చిరాగ్ శెట్టిలు ఛాంపియన్‌షిప్స్ నుండి నిష్క్రమించారు. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో వరుసగా రెండోసారి సెమీఫైనల్ స్థానంపై కన్నేసిన ఈ జోడీ తొలి గేమ్‌ను నెమ్మదిగా ప్రారంభించారు. ఆట ఆరంభంలోనే చైనా ఆటగాళ్ల పదునైన స్మాష్‌లను ఎదుర్కోవడంలో వారు విఫలమయ్యారు. లియాంగ్-వాంగ్‌లు సునాయాసంగా 3-0 ఆధిక్యం సాధించినప్పటికీ, సత్విక్-చిరాగ్ జోడీ నెమ్మదిగా మ్యాచ్ లయకు కుదురుకుంది. ఇరు జట్లూ పాయింట్లు సాధించేందుకు వంతులవారీగా ప్రయత్నిస్తుండగా, సగం మ్యాచ్ ముగిసేసరికి సత్విక్-చిరాగ్ ద్వయం సాధించిన ఒక పాయింట్ స్వల్ప ఆధిక్యం ఈ మ్యాచ్ ఎంత హోరాహోరీగా సాగిందో స్పష్టం చేసింది. ఆట తిరిగి ప్రారంభమయ్యాక భారత్ జోడీ ప్రత్యర్థులపై రెండు పాయింట్ల ఆధిక్యాన్ని కొనసాగించారు. కానీ చైనీయులు పుంజుకుని స్కోరును 18-18తో సమం చేశారు. లియాంగ్ కొట్టిన స్మాష్‌ను చిరాగ్ అందుకోలేకపోవడంతో స్కోరు 19-18కి చేరింది. రెండవ గేమ్‌లో, భారత్ జోడీ 6 పాయింట్ల ఆధిక్యాన్ని కోల్పోవడంతో సగం ఆట ముగిసేసరికి స్కోరు 5-11గా ఉంది. కానీ క్షణాల్లో చైనీయులు 35 నిమిషాల పాటు సాగిన పోరులో భారతీయులపై సునాయాసంగా విజయం సాధించి సెమీఫైనల్స్‌లోకి ప్రవేశించారు.

## దేశీయ మొబైల్ ఫోన్ తయారీకి కేంద్రం కొత్తస్కీం



**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** దేశీయ మొబైల్ ఫోన్ తయారీని మరింత బలోపేతం చేయడంతో పాటు భారతీయ మొబైల్ ఫోన్ బ్రాండ్ల అభివృద్ధికి మద్దతు అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం మొబైల్ ఫోన్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీమ్‌ను నోటిఫై చేసింది. దేశీయ తయారీ సామర్థ్యాన్ని పెంచడం, భారతీయ బ్రాండ్లను విస్తరించేందుకు ప్రోత్సహించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. ఈ పథకాన్ని రెండు లక్ష్య విభాగాలుగా రూపొందించారు. టార్గెట్ సెగ్మెంట్1 కింద మొబైల్ ఫోన్ల తయారీని ప్రోత్సహించనుండగా, టార్గెట్ సెగ్మెంట్2 కింద భారతీయ మొబైల్ ఫోన్ బ్రాండ్లకు మద్దతు అందించనున్నారు. టార్గెట్ సెగ్మెంట్2 కింద అర్హత పొందిన దరఖాస్తుదారులకు ఒక ఏడాది గెస్టేషన్ పీరియడ్ ఇవ్వనున్నారు. ఈ సమయంలో కంపెనీలు తమ కార్యకలాపాలను విస్తరించుకోవడంతో పాటు పథకం కింద నిర్దేశించిన అర్హత ప్రమాణాలను చేరుకోవచ్చు. ఆర్థిక ప్రోత్సాహకాలకు అర్హత పొందుతాయి. భారత్‌లో రిజిస్టర్ అయి ఉన్న మొబైల్ ఫోన్ తయారీ సంస్థలు 2026 ఆర్థిక సంవత్సరంలో కనీసం రూ.10,000 కోట్ల టర్నోవర్ సాధించి ఉంటే ఎంపిఎంఎస్ కింద దరఖాస్తు చేసుకోవడానికి అర్హత పొందుతాయి. ఇప్పటికే మార్కెట్లో ఉన్న భారతీయ బ్రాండ్లు ఆర్థిక ప్రోత్సాహకాలు పొందాలంటే మరింత కఠినమైన నిబంధనలను పాటించాలి.

ఆయా కంపెనీలు ప్రోత్సాహకాలు కోరుకునే ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఏడాది మొత్తం అమ్మకాలపై అదనంగా రూ.5,000 కోట్ల అమ్మకాలను సాధించాల్సి ఉంటుంది. ఈ కంపెనీలు 2026 ఆర్థిక సంవత్సరంలో కనీసం రూ.1,000 కోట్ల టర్నోవర్ కలిగి ఉండాలి. దేశీయ మొబైల్ ఫోన్ తయారీ వ్యవస్థను మరింత పటిష్టం చేయడంతో పాటు భారతీయ బ్రాండ్లు తమ ఉత్పత్తుల స్థాయి, మార్కెట్ వాటాను విస్తరించేందుకు ఈ పథకం దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. తయారీదారులు, భారతీయ బ్రాండ్ల కోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయడం ద్వారా ఉత్పత్తి సామర్థం పెంపుతో పాటు బ్రాండ్ అభివృద్ధిపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. ఇప్పటికే ఉన్న బ్రాండ్లకు ఇచ్చే ప్రోత్సాహకాలను అదనపు అమ్మకాలతో అనుసంధానం చేయడం ఈ పథకంలోని మరో కీలక అంశం. ఇఎంఎస్ సంస్థలకు రూ.1,000 కోట్ల టర్నోవర్ పరిమితిని విధించడం ద్వారా ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ తయారీదారులను కూడా ఈ పథకం పరిధిలోకి తీసుకురావడంతో పాటు దేశంలోని మొత్తం ఎలక్ట్రానిక్స్ తయారీ వ్యవస్థ అభివృద్ధికి ఊతం లభించనుంది.

## గ్రామీణ భారత్‌కు స్టార్‌లింక్ ఎంతోమేలు



**న్యూయార్కు, ఆగస్టు 21:** భారత్‌లో ఇంటర్నెట్ సదుపాయం అంతగా లేని ప్రాంతాలకు స్టార్‌లింక్ ఉపయోగపడుతుందని స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ అన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు శాటిలైట్ ఇంటర్నెట్ మేలు చేస్తుందని పేర్కొన్నారు. భారత్‌లో స్టార్‌లింక్ వాణిజ్య సేవలు ఇంకా ప్రారంభం కాలేదు. అనుమతుల ప్రక్రియ కొనసాగుతోంది. సొంత సోషల్‌మీడియా ఎక్స్‌లో పోస్ట్‌కు స్పందిస్తూ మస్క్ ఈ వ్యాఖ్యలు చేశారు. 2026 మే నాటికి దేశంలో 11,256 గ్రామాలకు 4జీ సదుపాయం లేదని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఇంటర్నెట్ వినియోగంలో భారీ తేడా ఉందని వివరించారు. 2026 మార్చి నాటికి భారత్‌లో 109.3 కోట్ల ఇంటర్నెట్ సబ్‌స్క్రిప్షన్లు ఉన్నాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల వాటా 44.087 కోట్లు. గ్రామీణ ప్రాంతాల్లో 100 మందికి 48.31 ఇంటర్నెట్ కనెక్షన్లు ఉన్నాయి. పట్టణాల్లో ఈ సంఖ్య 126.80గా ఉంది. మారుమూల గ్రామాలు, పర్వత ప్రాంతాలు, దీవులు, విపత్తుల ప్రభావిత ప్రాంతాల్లో శాటిలైట్ ఇంటర్నెట్ ఉపయోగపడే అవకాశం ఉంది. ఇలాంటి చోట్ల భౌగోళిక పరిస్థితులు, మౌలిక వసతుల కొరత వల్ల సంప్రదాయ టెలికాం సేవలు అందించడం కష్టంగా ఉంటుంది. దేశంలో భారత్‌నెట్ ద్వారా 8.5 లక్షల రూట్ కిలోమీటర్లకు పైగా ఫైబర్ వేశారు. సుమారు 2.21 లక్షల గ్రామ పంచాయతీలను సేవలకు సిద్ధం చేశారు. స్టార్‌లింక్ సేవలు ప్రారంభం కావాలంటే నియంత్రణ అనుమతులు, స్పెక్ట్రమ్ కేటాయింపు పూర్తి కావాలి. ఈ ప్రక్రియ పూర్తయితే మారుమూల ప్రాంతాల్లో హైస్పీడ్ ఇంటర్నెట్ అందుబాటులో వచ్చే అవకాశం ఉంది.


SBI
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సెంట్రల్ రిక్రూట్‌మెంట్ & ప్రమోషన్ డిపార్ట్‌మెంట్
కార్పొరేట్ సెంటర్, ముంబై
ఫోన్: 022-22820427

అప్లై చేయడానికి QR ని స్కాన్ చేయండి

**సాధారణ / కాంట్రాక్టు ప్రాతిపదికన స్పెషలిస్టు అధికారుల నియామకం**

భారతీయ స్టేట్ బ్యాంకు సాధారణ / కాంట్రాక్టు ప్రాతిపదికన క్రింద పేర్కొనిన స్పెషలిస్టు ఉద్యోగాల కొరకు భారత పౌరుల నుండి దరఖాస్తులు కోరుచున్నది:

ప్రకటన నం. CRPD/SCO/2026-27/11 (కాంట్రాక్ట్ పొజిషన్)

| పదవి పేరు | ఖాళీ | 31.07.2026 నాటికి వయస్సు (సంవత్సరాలు) కనీసం | గరిష్ఠ |
|---|---|---|---|
| డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ (డివిపి) – సైబర్ ఇన్నోవేషన్ & సిమ్యులేషన్ ల్యాబ్ | 1 | 35 | 45 |
| డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ (డివిపి) – పౌర కేంద్రీకృత కార్యక్రమాలు | 1 | | |
| డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ (డివిపి) – సైబర్ సెక్యూరిటీ | 2 | | |

(సాధారణ పొజిషన్)

| పదవి పేరు | ఖాళీ | గ్రేడ్ | 31.07.2026 నాటికి వయస్సు (సంవత్సరాలు) కనీసం | గరిష్ఠ |
|---|---|---|---|---|
| డిప్యూటీ మేనేజర్- ఏఐ- స్పెషలిస్ట్ | 25 | ఎంఎంజిఎస్-II | 25 | 35 |
| డిప్యూటీ మేనేజర్- సైబర్ సెక్యూరిటీ అనలిస్ట్ | 3 | | | |
| డిప్యూటీ మేనేజర్- ఐటీ సెక్యూరిటీ నిపుణుడు | 2 | | | |

ప్రకటన నం. CRPD/SCO/2026-27/12 (సాధారణ పొజిషన్)

| పదవి పేరు | ఖాళీ | గ్రేడ్ | 31.07.2026 నాటికి వయస్సు (సంవత్సరాలు) కనీసం | గరిష్ఠ |
|---|---|---|---|---|
| మేనేజర్ (మానవ వనరుల ప్రణాళిక & నియామకం) | 1 | ఎంఎంజిఎస్-III | 28 | 40 |
| మేనేజర్ (లెర్నింగ్ & డెవలప్‌మెంట్) | 1 | ఎంఎంజిఎస్-III | 28 | 40 |

ప్రకటన నం. CRPD/SCO/2026-27/13 (కాంట్రాక్ట్ పొజిషన్)

| పదవి పేరు | ఖాళీ | కనీసం | గరిష్ఠ |
|---|---|---|---|
| వైస్ ప్రెసిడెంట్ (ఎంటర్‌ప్రైజ్ & టెక్నాలజీ ఆర్కిటెక్ట్) | 1 | 40 | 48 |
| డిప్యూటీ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ (ఎంటర్‌ప్రైజ్ ఆర్కిటెక్చర్) | 1 | 42 | 50 |

అర్హతా ప్రమాణాలు (వయస్సు, అనుభవం, ఉద్యోగ ప్రొఫైల్ మొదలైనవి), చెల్లించవలసిన ఫీజు మరియు ఇతర వివరాల కోసం బ్యాంక్ వెబ్‌సైట్ https://sbi.bank.in/web/careers/current-openings లో లాగ్‌ఆన్ అయ్యి ఆన్‌లైన్‌లో దరఖాస్తుని నింపి ఆన్‌లైన్ ఫీజు లింక్ ద్వారా దరఖాస్తు ఫీజును చెల్లించండి. దరఖాస్తు మరియు ఫీజు చెల్లింపు వివరాలతో పాటు అర్హతలని నిర్ధారించు కొనుటకు మరియు పూర్తి వివరాల కొరకు ప్రకటనను చూడండి. ఏవైనా సందేహాలు ఉన్నచో, దయచేసి మాకు - "CONTACT US" —> "Post Your Query" లింకు ద్వారా వ్రాసి పంపండి. ఈ లింకు మీకు బ్యాంకు వెబ్ సైట్ (https://bank.sbi/web/careers/post-your-query) లో లభించును.

• ఆన్ లైన్ లో దరఖాస్తు చేయుటకు మరియు ఫీజు చెల్లింపు తేదీ : 07.08.2026 నుండి 27.08.2026 వరకు.

స్థలం: ముంబై
తేదీ: 07.08.2026
మహానిర్వహణాధికారి (ఆర్‌పి & పీఎం)


## జ్యుయెలరీ కంపెనీలషేర్లు ర్యాలీ!




**ముంబయి, ఆగస్టు 21:** బంగారం ధరలు భారీగా పెరగడంతో శుక్రవారం నగల కంపెనీల షేర్లు దూసుకెళ్లాయి. టాటా గ్రూప్‌కు చెందిన టైటాన్ కంపెనీ, సెంకో గోల్డ్, కళ్యాణ్ జువెల్లర్స్ ఇండియా సహా పలు జ్యువెలరీ స్టాక్స్‌లో ఇన్వెస్టర్ల కొనుగోళ్లు పెరిగాయి. స్కై గోల్డ్ అండ్ డైమండ్స్ షేరు గరిష్ఠంగా 4.07 శాతం లాభపడగా, సెంకో గోల్డ్ షేరు 3 శాతానికి పైగా పెరిగింది. కళ్యాణ్ జువెల్లర్స్ ఇండియా షేరు 2 శాతానికి పైగా లాభపడగా, టైటాన్ కంపెనీ షేరు సుమారు 0.5 శాతం పెరిగింది. బంగారం ధరల్లో చోటుచేసుకున్న భారీ పెరుగుదలే జువెల్లరీ షేర్ల ర్యాలీకి ప్రధాన కారణంగా నిలిచింది. విలువైన లోహాలు, ఆభరణాల రంగంలో పనిచేస్తున్న కంపెనీలపై ఈ పరిణామం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరిచింది. కమోడిటీ మార్కెట్లో ఎంసిఎక్స్‌లో బంగారం ధర 10 గ్రాములకు రూ.1.60 లక్షల స్థాయిని దాటగా, వెండి ధర కిలోకు రూ.2.46 లక్షలు దాటింది. గత మూడు ట్రేడింగ్ సెషన్లలో ఎంసీఎక్స్ బంగారం ధర 10 గ్రాములకు రూ.6,600కు పైగా పెరగగా, వెండి ధర కిలోకు రూ.13వేలకు పైగా ఎగిసింది. విలువైన లోహాల ధరలు వేగంగా పెరగడంతో జువెల్లరీ షేర్లు ఇన్వెస్టర్ల దృష్టిలో కొనసాగుతున్నాయి. అధిక బులియన్ ధరలు ఆభరణాల డిమాండ్, కంపెనీల మార్జిన్లు, ఇన్వెంటరీ విలువలపై ఎలాంటి ప్రభావం చూపుతాయనే అంశాలను ఇన్వెస్టర్లు పరిశీలిస్తున్నారు. ఎస్‌బిఐ సెక్యూరిటీస్‌లో ఫండమెంటల్ రీసెర్చ్ హెడ్ సన్నీ అగర్వాల్ మాట్లాడుతూ బంగారం ధరలు గణనీయంగా పెరగడం వల్ల కంపెనీల వద్ద ఉన్న ఇన్వెంటరీ విలువ పెరుగుతోందని, దీంతో ఆర్గనైజ్డ్ జువెల్లరీ కంపెనీల ఆదాయ వృద్ధికి మద్దతు లభిస్తోందని తెలిపారు. సురక్షిత పెట్టుబడులకు డిమాండ్, ప్రపంచ అనిశ్చితి నేపథ్యంలో బంగారం ధరలు బలపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. రానున్న పండుగలు, వివాహాల సీజన్ కూడా నగల డిమాండ్‌కు అదనపు ఊతమిచ్చే అవకాశం ఉందన్నారు. అధిక బంగారం ధరలు ఉన్నప్పటికీ నగల కొనుగోళ్లలో స్థిరమైన డిమాండ్, కొత్త స్టోర్ల విస్తరణ, అసంఘటిత రంగం నుంచి ఆర్గనైజ్డ్ రిటైలర్ల వైపు వినియోగదారుల మళ్లింపు వంటి అంశాలు కూడా జువెల్లరీ కంపెనీలకు అనుకూలంగా మారుతున్నాయి. ప్రముఖ కంపెనీల తాజా వ్యాపార అప్‌డేట్లు కూడా డిమాండ్ బలంగా ఉన్నట్లు సూచిస్తున్నాయి. మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ తాజా నివేదిక ప్రకారం, భారత్‌లో ఆర్గనైజ్డ్ జువెల్లరీ రిటైల్ రంగం రానున్న సంవత్సరాల్లో మరింత వేగంగా అభివృద్ధి చెందనుంది. ఈ ట్రెండ్‌ల నుంచి లబ్ధి పొందేందుకు టైటాన్ కంపెనీ, కళ్యాణ్ జువెల్లర్స్ ఇండియా అత్యుత్తమ స్థానంలో ఉన్నాయని మోతీలాల్ ఓస్వాల్ పేర్కొంది. టైటాన్ షేరు లక్ష్య ధరను రూ.6,000, కళ్యాణ్ జువెల్లర్స్ లక్ష్య ధరను రూ.800గా నిర్ణయించింది. పీఎన్ గాడ్గిల్ జువెల్లర్స్ షేరుపై బైరేటింగ్‌ను కొనసాగిస్తూ ధరను రూ.800గా పేర్కొంది. సెంకో గోల్డ్‌పై మాత్రం 'న్యూట్రల్ రేటింగ్‌ను కొనసాగిస్తూ ధరను రూ.430గా నిర్ణయించింది. ఎస్‌బిఐ సెక్యూరిటీస్‌కు చెందిన సన్నీ అగర్వాల్ టాప్ పిక్స్‌లో టైటాన్ కంపెనీ, స్కై గోల్డ్ అండ్ డైమండ్స్ ఉన్నాయి.

## స్వల్పమార్పులతోనే ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

## వారాంతంలో మందగమనం...




**ముంబయి, ఆగస్టు 21:** భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ముఖ్యంగా ఇరాన్ చుట్టూ నెలకొన్న పరిస్థితులు, ముడిచమురు ధరలు అధిక స్థాయిలో ఉండటంతో శుక్రవారం దేశీయఈక్విటీ మార్కెట్లు స్వల్ప మార్పులతో ముగిశాయి. నిఫ్టీ 24,250 మార్కు పైన స్థిరపడింది. మెటల్, ప్రైవేట్ బ్యాంకింగ్, రియల్టీ షేర్లలో కొనుగోళ్లు కనిపించగా ఎఫ్ఎంసీజీ, ఆటో, కెమికల్ షేర్లు నష్టపోయాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 3.11 పాయింట్లు స్వల్పంగా పెరిగి 77,540.83 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ 20.15 పాయింట్లు లాభపడి 24,252 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ 150 సూచీ 0.12 శాతం, స్మాల్‌క్యాప్ 250 సూచీ 0.31శాతం చొప్పున పెరి గాయి. బీఎస్ఈలో 2,250 షేర్లులాభపడగా, 2,092 షేర్లు నష్టపో యాయి. మరో 243 షేర్లు ఎలాంటి మార్పు లేకుండా ముగిశాయి. కమోడిటీ మార్కెట్లో అక్టోబర్ 2026 డెలివరీ బ్రెంట్ ముడిచమురు బ్యారెల్‌కు 50 సెంట్లు తగ్గి 93.28 డాలర్లకుచేరింది. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి స్వల్పంగా బలపడింది. గత సెషన్‌లో 95.7475 వద్ద ముగిసిన రూపాయి శుక్రవారం 95.7300 వద్ద కొనసాగింది. నిఫ్టీ మీడియాసూచీ 2.13 శాతం పెరిగింది. నెట్‌వర్క్18 మీడియా ఇన్వెస్ట్‌మెంట్స్ 8.69శాతం, జీఎంటర్‌టైన్‌మెంట్ 5.21 శాతం, సారేగామ ఇండియా 2.32 శాతం, పివిఆర్ ఐనాక్స్ 1.47 శాతం, ప్రైమ్ ఫోకస్ 1.36శాతం, హాత్‌వేకేబుల్ డేటాకామ్ 1.05 శాతం చొప్పున లాభ పడ్డాయి. సన్‌టీవీ నెట్‌వర్క్ 0.58 శాతం, టిప్స్ మ్యూజిక్ 0.41 శాతం, డీబీ కార్ప్ 0.39 శాతం చొప్పున నష్టపోయాయి. ప్యాటర్న్ (ఇండియా) 2.43 శాతం, రైల్‌టెల్ కార్పొరేషన్ 2.26 శాతం పెరిగాయి. సాత్విక్ గ్రీన్ ఎనర్జీ 5.04 శాతం దూసుకెళ్లింది. లెమన్ ట్రీ హోటల్స్ 0.23 శాతం లాభపడింది. టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ 0.80 శాతం, గ్లెన్‌మార్క్ ఫార్మాస్యూటికల్స్ 0.82 శాతం చొప్పున తగ్గాయి. వాల్చంద్‌నగర్ ఇండస్ట్రీస్ 1.27 శాతం పెరిగింది. ఐసీఐసీఐ బ్యాంక్ 0.53 శాతం లాభపడింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., Renigunta Road, 3rd Mile Stone, Tirupati-517507 Ph. No. 2238770, Fax:: 08772238790, RNI No.64860/9 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.

22 -8Pg9th cheli 1:22 -8Pg9th cheli 1.qxd 8/22/2026 12:18 AM Page 1



ఫ్యాషన్ ఫ్యాషన్

# తేలిక పట్టు అందాలు





శుభాల శ్రావణంతో పండుగలు మొదలు అయ్యాయి. పండుగలు, పెళ్లిళ్లు ఒకటేమిటి ఎన్నెన్నో కార్యక్రమాలు. వేడుక ఏదైనా లక్ష్మీకళఉట్టిపడేలా కనిపించాలని మగువల ఆరాటం. ఫాస్ట్ ఫ్యాషన్‌లో ఫ్యూజన్ ట్రెండ్స్ ఎన్నో రకాలు వచ్చిపోతుంటాయి. కానీ దక్షిణ భారతంలో మాత్రం ప్రత్యేక సందర్భం అంటే పట్టు కట్టాల్సిందే. వీటిల్లోనూ ఎన్నో రకాలు. మరి ఏం ఎంచుకోవాలన్న ప్రశ్న రానే వస్తుంది. కంచి, బెనారస్, మంగళగిరి, ఉప్పాడ సిల్క్‌ల హవా నిన్నమొన్నటి దాకా సాగింది. ఇప్పుడు వెంకటగిరి, నారాయణపేట గద్వాల పట్టుదే ట్రెండ్ అంతా. ఒకప్పుడు అమ్మా, అమ్మమ్మలు ఎంచుకున్న ఈ తరం అమ్మాయిలూ ఎంతో ఇష్టంగా కట్టుకుంటున్నారు. ఆధునికంగా తయారవుతున్నారు. తేలిగ్గానూ ఉండటం వల్ల ఎంతో సౌకర్యంగానూ ఉంటున్నాయి. పూజ చేసినప్పుడూ, పేరంటానికి వెళ్లినప్పుడూ అనువుగా ఉంటాయి. జరీ అంచుల ధగధగలు శ్రావణ శోభ కళ్లకు కట్టేస్తాయి. అలాంటి డిజైన్లలో ఇవి కొన్ని.









డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

మంచి జీర్ణ క్రియకు తీసుకోవాల్సిన ఆచారించవలసిన జాగ్రత్తలు : అతి సర్వత్రా వర్జితే అని పెద్దలు అన్నట్లే అధిక ఆహారం అధిక ఉపవాసాలుండడం, అధికంగా స్వీట్స్, కారం తినడం, అతివేడి లేదా చల్లని ఆహారం తీసుకోరాదు. ఉదయాన తేలికగా జీర్ణమయ్యే అల్పాహారం తీసుకోవాలి. పాలు, పాలలో పసుపు వేసుకోవడం, పాలలో మిల్లెట్స్, మొలకెత్తిన గింజల పౌడర్, బాదం పౌడర్ వేసుకొని త్రాగడం మంచిది దీనివల్ల అధిక క్రొవ్వు పదార్థాలు తినలేరు. కడుపు నిండిదన్న సంతృప్తి

## అతి సర్వత్ర వర్జయేత్

ఉంటుంది. గుడ్లు వెజిటబుల్ సలాడ్, సూప్స్, ఓట్స్, రాగి, బార్లీ గంజి, కూరగాయల జ్యూస్, పండ్లు, బాదం, డ్రై ఫ్రూట్స్ తీసుకోవచ్చు అల్పాహారాన్ని మాని వేయ కూడదు. మధ్యాహ్నం భోజనానికి 1/2 గంట ముందు, ఉదయాన పరగడుపున నీళ్ళు త్రాగడం మంచిది. పోషకాలతో కూడిన పీచు పదార్థాం ఉన్న ఆకు కూరలు, పప్పు ధాన్యాలు, కూరగాయలు, పెరుగు, మజ్జిగ, అన్నం, సంగటి, బ్రౌన్ రైస్, మిల్లెట్స్ ధాన్యాలు ముడి బియ్యం తీసుకోవడం వల్ల ప్రేగు ఆరోగ్యాన్ని మెరుగుపర్చి మలబద్ధకం లేకుండా ఉంటుంది. ఇది అధిక ఆకలిని తగ్గించి అధిక బరువు పెరగకుండా చేస్తుంది. తక్కువ నక్రొవ్వు గల పాల ఉత్పత్తుల్ని తీసుకోవాలి. రాత్రిళ్ళు జీర్ణ వ్యవస్థ నెమ్మదిగా పని చేస్తుంది. కాబట్టి ఆలస్యంగా తిన కుండా మితంగా తినాలి ఎక్కువగా తింటే కడుపుబ్బరం వస్తుంది. తిన్న వెంటనే నిద్రపోరాదు. తిన్న తర్వాత 10-15 నిమిషాలు మెల్లగా నడవడం, తిన్న 2 గంటలకి నిద్రపోవడం మంచిది. నోటితోనే జీర్ణక్రియ మొదలవుతుంది. కాబట్టి తినడానికి ముందు నోరు, కాళ్లు చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. ఆహారాన్ని నమిలి మ్రింగాలి. దంత సంరక్షణ అవసరం. దంత సమస్యల్ని సకాలంలో గుర్తించి చికిత్స తీసుకోవాలి. లేకపోతే ఆహారాన్ని నమల లేక గ్యాస్ ట్రబుల్ వంటి జీర్ణకోశ సమస్యలు వస్తాయి. సాధ్యమై నంత వరకు ఇంట్లో తయారు చేసిన ఆహారాన్ని తాజాగా తినాలి. బైటి ఫుడ్, జింక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్ పాస్ట్ ఫుడ్స్‌లో సోడియం, మసాలాలు, క్రొవ్వులు నూనెలు చక్కెరలు ఎక్కువగా ఉండి జీర్ణక్రియకు ఇబ్బంది ఏర్పడుతుంది. టైమ్ ప్రకారం ఆహారం తీసుకోవాలి. దీని వల్ల ఆకలి సకాలంలో అవుతుంది. ధూమ పానం, ఆల్కహాల్, చూయింగ్ గమ్స్ నమలరాదు దురాలవాట్లు, గుట్కా, పొగాకు, తంబాకు కిళ్ళీలు మాని వేయాలి. స్ట్రెస్ తగ్గించుకోవాలి. రిలా క్సేషన్ చాలా అవసరం సరైన ఆహారపు అలవాట్లుండాలి. దినచర్యలో ఆకస్మిక మార్పుల వల్ల జీర్ణక్రియలో కొంత ఇబ్బంది ఏర్పడుతుంది. మలవిసర్జన ఏ ఇబ్బంది లేకుండా సాఫీగా జరగడం, శరీరం ఆక్టివ్‌గా ఉండడం, ఒత్తిడిని సునాసంగా ఎదుర్కోవడం. నిద్ర బాగా పట్టడం, నీరసం, అలసట గ్యాస్‌ట్రబుల్ అజీర్తి, గుండెల్లో మంట మలబద్ధకం, విరేచనాలు లేక పోవడమే, రోగ నిరోధక శక్తి పెరగడం, ఏకాగ్రత పెరగడం, పని సామర్థ్యం పెరుగుతుంది సరైన బరువు కల్గి ఉంటారు. బిర్యానీలు, పాస్ట్‌ఫుడ్, జింక్ ఫుడ్, క్యాండీలు, స్వీట్స్, బీస్‌కూల్ డ్రింక్స్, సోడా, అధిక క్రొవ్వు పదార్థాలు, కేక్‌లు, క్రీమ్స్, పిజ్జా, బర్గర్‌లు, ఎక్కువగా నాన్‌వెజ్ తీసుకోవడం పుట్ట గొడుగులు వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండకుండా సహజ జీర్ణక్రియకి హాని కల్గిస్తాయి. ప్రేగుల మైక్రో ఫ్లోరాలో, కడుపులోని ఆసిడ్ ఉత్పత్తిలో మార్పులు వచ్చి అనేక జీర్ణకోశ సమస్యలు ఎదురవుతాయి. రోజూ వ్యాయామం, నడక, మెడిటేషన్, సైకింగ్ ఈత మంచిది. □

# ఎటకో ఎగిరెను చిలకమ్మ





వెండి తెరపై స్త్రీ పాత్రలు కేవలం గ్లామర్ కోసమే కాదు. చిత్ర కథను నడిపించే ఆధారం కూడా అని నిరూపించిన షావుకారు జానకి తన 94వ ఏట పరమపదించారు. ఆమె అసలు పేరు శంకరమంచి జానకి 1949లో 'షావుకారు' చిత్రంలో సినీరంగ ప్రవేశం. చెప్పాలంటే ఆమె తెరపై వైవిధ్యమైన పాత్రలకు చిరునామా. ఆమె నటించిన చిత్రాల్లో బుచ్చామ్మ (కన్యాశుల్కం), అక్కాచెల్లెలు, చిలకమ్మ

(సంసారం ఓ చదరంగం) చిత్రాలు ఆమె నటనా వైదుష్యానికి అభినయానికి
కీర్తి పతాకలు ఆమె 4000కిపైగా తెలుగు, తమిళ, కన్నడ మలయాళం చేశారు. 2022లో
పద్మశ్రీ అవార్డు అందుకున్నారు. రెండు నంది అవార్డుల స్వీకర్త. ప్రముఖ నటీమణి
శంకరమంచి జానకి... తన తొలి చిత్రం 'షావుకారు'నే ఇంటిపేరుగా మార్చేసుకుంది. 76
సంవత్సరాల క్రితం ఏప్రిల్ 7, 1950లో విడుదలైన ఆ సినిమా జానకి జీవితాన్ని
మార్చేసింది. నిజానికి జానకికి తొలి అవకాశం కె.వి. రెడ్డి దర్శకత్వం వహించిన
'గుణసుందరి కథ్ఞకు వచ్చింది. అదెలాగంటే... మద్రాసు ఆకాశవాణిలో రేడియో అన్నయ్య,
అక్కయ్య, వింజమూరి సీతాదేవి, టి.జి. కమలాదేవి, తెన్నేటి హేమలత, ఎ.పి. కోమల, కొంగర
జగ్గయ్య, సిహెచ్. నారాయణరావు, ఎస్వీ రంగారావు, గుమ్మడి తదితరులతో పిన్న వయసులోనే
జానకి పలు కార్యక్రమాలలో పాల్గొనేది. మొదటి నుంచి ఆమె వాచకానికి మంచి గుర్తింపు ఉండేది.
ఒకసారి రేడియోలో జానకి వాయిస్ విన్న బి.ఎన్. రెడ్డి డైరెక్ట్‌గా రేడియో స్టేషన్‌కు వచ్చేశారు.
జానకిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆ తర్వాత ఒకసారి బుచ్చిబాబు ఇంటికి వెళ్ళినప్పుడు అక్కడే
ఉన్న బి.ఎన్. రెడ్డి జానకిని చూసి 'నువ్వెవరి పిల్లవు?' అని ప్రశ్నించారు. 'టేకుమళ్ళ వారమ్మాయిన్ని
ని అని జానకి బదులిచ్చింది. 'సినిమాల్లో వేషం వేస్తావ్వా అని ఆయన అడిగేతే, మా నాన్నగారు
పళ్ళు రాలగొడతారు... అని సమాధానం ఇచ్చింది జానకి. అప్పట్లో ఆయన

'గుణసందరి కథ్ఞ సినిమా తీస్తున్నారు. హీరోయిన్‌గా అడిగితే, తండ్రి భయంతో ససేమిరా అనేసింది జానకి. అప్పటికి ఆమెకు కేవలం 15 సంవత్సరాల వయస్సే. ఆ తర్వాత ఆ పాత్రను ఎందుకు వదులుకున్నానా? అని బాధపడింది జానకి. 1947 నవంబర్ 5న ఆమె వివాహం శంకరమంచి శ్రీనివాసరావుతో అయ్యింది. ఆయన రేడియో ఇంజనీర్. అయితే ఆస్తిపంపకాలలో జరిగిన అన్యాయంతో శ్రీనివాసరావు వివాహానంతరం ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డారు. దాంతో దాంతో జానకి మనసు సినిమాలవైపు మళ్ళింది. దాంతో ప్రముఖ రచయిత కొడవటి గంటి కుటుంబ రావు,





కొమ్మూరి పద్మావతి ప్రోత్సాహంతో ఆమె బి.ఎన్.రెడ్డిని కలిసింది. ఒకప్పుడు వేషం ఇస్తానంటే తిరస్కరించిన జానకి మూడేళ్ళ తర్వాత అదే దర్శకుడి దగ్గరకు వేషం కోసం వెళ్ళాల్సి వచ్చింది. జానకి పట్ల అభిమానంతో బి.ఎన్.రెడ్డి... ఆమెను నాగిరెడ్డి దగ్గరకు పంపారు. అప్పుడు వారు 'షావుకార్లు' సినిమా తీసే ప్రయత్నాల్లో ఉన్నారు. బి.ఎన్.రెడ్డి రికమండేషన్ కారణంగా జానకికి చక్రపాణి, ఎల్.వి. ప్రసాద్ మేకప్ టెస్ట్ చేయించారు. కొన్నాళ్ళకు ఆమెకు పిలుపొచ్చింది. ఏదో చిన్న వేషం ఇస్తారనుకుంటే... వాళ్ళు అందులో కథానాయిక నువ్వే అని చెప్పడంతో జానకి అవాక్కయ్యింది. అలా ఆమె సినీ జీవితం విజయా వారి 'షావుకార్లు'తో శ్రీకారం చుట్టుకుంది. తొలి సినిమాకు గానూ ఆమె అందుకున్న పారితోషికం రెండువేల ఐదు వందల రూపాయలు. 'షావుకార్లు' తర్వాత విజయ సంస్థలో మరే సినిమాలోనూ షావుకారు జానకి నటించలేదు. అయితే ఆ చిత్ర నిర్మాణ సమయంలో నేర్చుకున్న పాఠలే తన చలన చిత్ర జీవితానికి మంచి పునాది ఏర్పడటానికి కారణమయ్యాయని జానకి చెబుతుండేవారు. 'షావుకార్లు' సినిమా గురించి తెలుగు స్వతంత్ర పత్రికలో ఖాసా సుబ్బారావు 'కుటుంబ స్త్రీల సినీ రంగ ప్రవేశ్ఞం అని రాయడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని ఆమె తెలిపారు

## తెర

సిరీస్ సెప్టెంబర్ 4న స్ట్రీమింగ్ కానున్నట్లు ప్రకటించింది. ప్రైమ్ వీడియో ఒరిజినల్ హిందీ సిరీస్ బందిష్ బాండిట్స్ స్ఫూర్తితో రూపొందిన జగమే సంగీతంను పల్నాటి సూర్య ప్రతాప్ సృష్టించి, దర్శకత్వం వహించగా, సుష్మిత

## 'జగమే సంగీతం' సెప్టెంబర్ 4న విడుదల



కొణిదెల నిర్మించారు.
కర్ణాటక సంగీతపు గొప్ప ప్రపంచ నేపథ్యంలో సాగే కథతో జగమే సంగీతంరాబోతోంది. తన తాతశాస్త్రి ప్రఖ్యాత సంగీత వారసత్వానికి వారసుడైన బాలు, సంప్రదాయ భారం, విచ్ఛిన్నమైన కుటుంబ బంధాలు, చిరకాలంగా దాచిపెట్టిన రహస్యాలతో సతమతమవడాన్ని చూపిస్తుంది. పాత వైరుధ్యాలు మళ్లీ తలెత్తి, తరతరాల వారసత్వాన్ని నాశనం చేసే ప్రమాదం ఏర్పడినప్పుడు, బాలు తన కుటుంబం నిర్మించిన దానిని కాపాడుకోవడానికీ, తన సొంత కళాత్మక స్వరాన్ని కనుగొనడానికీ మధ్య నలిగిపోతాడు. ఈ కథకు సంగీతమే ప్రాణం. ప్రైమ్ వీడియో ఇండియా, ఎస్‌విఓడి ఒరిజినల్స్ డైరెక్టర్, హెడ్ మాట్లాడుతూ.. .కుటుంబం, వారసత్వం, ఆత్మశోధన వంటి సార్వత్రిక ఇతివృత్తాలను అన్వేషిస్తూనే, సంగీతంలోని భావోద్వేగ శక్తిని చాటిచెప్పే జగమే సంగీతం ఒక హృద్యమైన కథ. ప్రధానంగా సంప్రదాయం, ఆశయం, మన స్వంత మార్గాన్ని నిర్మించుకోవడానికి కావలసిన ధైర్యం గురించి కాలాతీతమైన ప్రశ్నలను లేవనెత్తుతుంది.

## 'ధర్మస్థల నియోజకవర్గం' సెప్టెంబరు 4న విడుదల



మూవింగ్ డ్రీమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై సుమన్, సాయికుమార్, నటరాజ్, రాయంచ కొక్కుర వరుణ్ సందేశ్, వితికా షేరు ప్రధాన పాత్రలలో నటిస్తున్న చిత్రం ధర్మస్థల నియోజకవర్గం. జై జ్ఞాన ప్రభ తోట దర్శకత్వంలో మేరుం భాస్కర్ నిర్మిస్తోన్న ఈ పొలిటికల్ ఎంటర్‌టైనర్ చిత్రం.. సెప్టెంబర్ 4న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. హీరోయిన్ వితికా షేరు మాట్లాడుతూ నేను హీరోయిన్‌గా పేరు తెచ్చుకోవడం కంటే ఒక నటిగా మంచి గుర్తింపు పొందాలని కోరుకున్నాను. నటి కస్తూరి మాట్లాడుతూ అర్థం పర్థం లేని కామెడీ, డ్రామా ఉన్న సినిమా కాదిది. ఒక పర్పస్ ఫుల్ మూవీ. ప్రేక్షకుల్ని ఆలోచింపజేసే చిత్రమిది. ఇలాంటి సినిమా ఇప్పుడున్న సొసైటీకి కావాలి. ఈరోజు జెన్ జీ ఆటపాటల తో సరదాగా సమయం గడపడం లేదు. ఆలోచిస్తున్నారు. నటుడు సుమన్ మాట్లా డుతూ ఈ సినిమా చూశాక చెబుతున్నా మూవీ మీ అందరికీ నచ్చుతుంది. ఈ మూవీ మీద మొదటి నుంచ నాకు మంచి నమ్మకం ఉంది. సినిమా హిట్ అవుతుందనే ఆశిస్తూ వచ్చాను. డైరెక్టర్ జై జ్ఞాన ప్రభ కథ చెప్పిన'ప్పుడే ప్రేక్షకుల్ని ఆకట్టుకునే సినిమా అవు తుందని నమ్మాను. హీరో నటరాజ మాట్లా డుతూ ఇప్పటిదాకా ఈ సినిమా మాది. సెప్టెంబర్ 4వ తేదీ నుంచి మీది కాబోతోంది. ప్రేక్షకులంతా మా సినిమాను తమదిగా భావించి ఆదరిస్తారని కోరుకుం టున్నా. . అన్నారు.పివిఆర్ సినిమాస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉదయ్ మాట్లాడుతూ "రీసెంట్‌గా వస్తున్న సినిమాలన్నీ హిట్ అవుతున్నాయి. చిత్ర దర్శకుడు జై జ్ఞాన ప్రభ తోట మాట్లాడుతూ.. ఒక బిడ్డ ఈ ప్రపంచాన్ని చూడా లంటే ఎంత ప్రయాస ఉంటుందో ఒక సినిమా థియేటర్స్‌లో రిలీజ్‌కు రావాలన్నా అంతే ఇబ్బందులు ఉంటాయి. అవన్నీ దాటుకుని మా చిత్రాన్ని సెప్టెంబర్ 4న రిలీజ్‌కు తీసుకొస్తున్నాం.

## 'కిల్లర్' అక్టోబర్ 17న వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా రిలీజ్



సినిమాపై ఎక్స్ పెక్టేషన్స్ పెంచుతున్న 'కిల్లర్' రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ గ్లింప్స్ జ్యోతి పూర్వజ్, పూర్వాజ్, లీడ్ రోల్స్ Zero pli నటిస్తున్న సెన్సేషనల్ సై ఫై థ్రిల్లర్ మూవీ 'కిల్లర్'. మనీష్ గిలాడా, చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి ఇతర పాత్రల్లో నటిస్తు న్నారు. ఈ సినిమాను ధ్యానం నాన్నగారు ఆశీస్సులతో థింక్ సినిమా, ఏయూ అండ్ ఐ స్టూడియోస్ బ్యానర్స్ పై పూర్వాజ్ , పద్మనాభ రెడ్డి.ఎ. నిర్మిస్తు న్నారు. ఉర్వీశ్ పూర్వజ్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. పూర్వాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ రోజు 'కిల్లర్' సినిమా రిలీజ్ డేట్ ను మేకర్స్ అనౌన్స్ చేశారు. విజయదశమి పర్వదినం సందర్భంగా అక్టోబర్ 17న ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తు న్నట్లు ప్రకటించారు. 'కిల్లర్' సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ సందర్భంగా రిలీజ్ చేసిన వీడియో గ్లింప్స్ ఆద్యంతం ఆసక్తి కలిగిస్తోంది. ఈ సినిమా విడుదలయ్యే అక్టోబర్ 17న మన దేశపు గొప్ప సైంటిస్ట్ డా.పూర్వజ్ ను ఏలియన్స్ కాంటాక్ట్ అవుతారు. ఒక స్పేస్ షిప్ ను భూమికి పంపిస్తున్నట్లు తెలియ జేస్తారు.ఈ విషయాన్ని మిగతా వారికీ చెప్పమని, తాము మానవులను రక్షి ంచాలని అనుకుంటున్నట్లు ఆ ఏలియన్ డా.పూర్వజ్ కు చెబుతుంది. మన భవిష్యత్, ఆ ఏలియన్‌కు గతం. ఇలా మరో కాలం నుంచి వస్తున్న ఆ ఏలియన్ డా.పూర్వజ్ ను ఎందుకు కాంటాక్ట్ అయ్యింది ?, స్పేస్ షిప్‌ను భూమికి ఎందుకు పంపించాలనుకుంది ?, మానవాళికి ఏర్పడిన ముప్పు ఏంటి ?, ఆ ఏలియన్ చేయాలనుకున్న సాయం ఏంటి ? వంటి ప్రశ్నలతో రిలీజ్ డేట్ గ్లింప్స్ క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది. అక్టోబర్ 17న మీ భవితను నిర్ణయిస్తాం.. అంటూ గ్లింప్స్ చివరలో వేసిన క్యాప్షన్ ఆకట్టుకుంటోంది.

## 'ఇట్లు అర్జున' అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్



స్టార్ డైరెక్టర్ వెంకీ కుడుముల నిర్మాతగా వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్న చిత్రం 'ఇట్లు అర్జున'. ఈ సినిమాతో అనీష్ హీరోగా పరిచయం అవుతుండగా, డెబ్యూ దర్శకుడు మహేష్ ఉప్పల దర్శకత్వం వహిస్తు న్నారు. అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తు న్నారు. టైటిల్ గ్లింప్స్, ఇప్పటికే విడుద'లైన రెండు పాటలు, ఇతర ఆసక్తికరమైన ప్రమోషనల్ కంటెంట్‌తో సినిమా ఇప్పటికే ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచింది. తాజాగా ఈ చిత్ర విడుదల తేదీని మేకర్స్ అధికారికంగా ప్రకటిం చారు.'ఇట్లు అర్జున' అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తం గా థియేటర్లలోకి రానుంది. విడుదల తేదీని ప్రకటిస్తూ విడుదల చేసిన పోస్టర్ ఆసక్తికరంగా ఆకట్టుకుంటోంది. పోస్టర్‌లో అనీష్ స్టైలిష్ లుక్‌లో ఓ భవనం పైకప్పు నుంచి దూకుతూ ఏదో పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టుగా కనిపిస్తుండగా, అనస్వర రాజన్ చేతులు కట్టబడి, విభిన్నమైన ఎక్స్‌ప్రెషన్‌తో కనిపించడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. సినిమాకు ఇప్పటివరకు విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌లో కనిపించిన లీడ్ పెయిర్ కెమిస్ట్రీ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సిద్ధమవుతోంది.

## 'విలేజ్ స్టార్స్' మూవీ ప్రారంభంన



తెలుగు తెరపైకి మరో బ్యూటిఫుల్ ఎంటర్టైన్మెంట్ రాబోతొంది. ఎన్‌ఎస్‌వీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తెరకెక్కనున్న నూతన చిత్రం'విలేజ్ స్టార్స్' పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. వెంకటగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి నటుడు సమీర్ ముఖ్య అతిథిగా హాజరై చిత్ర బృందాన్ని ఆశీర్వదించారు. నరేంద్ర, లిల్లీ బళ్ళు హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీనివాస్, సయ్యద్ అబ్జాల్, విజయ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఏ. నరేంద్ర దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి నాగూర్ ఎన్‌జీఆర్ కథ అందిస్తున్నారు.ఈ సందర్భంగా నటుడు సమీర్ మాట్లాడుతూ.. నరేంద్ర మంచి టాలెంట్ ఉన్న వ్యక్తి. గతంలో నాతో కలిసి పనిచేశాడు. ఈ చిత్ర బృందంలోని ప్రతి ఒక్కరూ ఎంతో కష్టపడే తత్వం ఉన్నవారు.

## ప్రొడక్షన్ నం.3 మూవీ అనౌన్స్‌మెంట్



'కె ర్యాంప్' వంటి కమర్షియల్ సక్సెస్ తర్వాత రుద్రాంశ్ సెల్యులాయిడ్ సంస్థ మరో కొత్త చిత్రాన్ని నిర్మిస్తోంది. సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ బొమ్మక్ శివ నిర్మిస్తున్న ఈ సినిమాలో "కింగ్డమ్" ఫేమ్ వెంకటేష్.వి.పి. హీరోగా నటిస్తున్నారు. సురేష్ తేజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రానికి డి.జి.పి. అనే వర్కింగ్ టైటిల్ గా పెట్టుకున్నారు. వెంకటేష్.వి.పి. మలయాళ టీవీ, చిత్ర పరిశ్రమలో మంచి గుర్తింపు సంపాదించుకున్నారు.

22-8Pg8exHMNWJQE:22-8Pg8exHMNWJQE.qxd 8/22/2026 12:34 AM Page 1



# ఎల్‌నినో సవాళ్లను సమష్టిగా ఎదుర్కొందాం

### అక్టోబరు, నవంబరు నెలలు అత్యంత కీలకం

### పంట చేతికొచ్చే సమయంలో నీటి కొరత రాకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలి

### మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, వాకిటి శ్రీహరి

**హైదరాబాద్ (అత్తాపూర్), ఆగస్టు 21, ప్రభాతవార్త :** ఎల్‌నినో ప్రభావంతో రానున్న సవాళ్లను ముందుగానే గుర్తించి తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా సన్నద్ధం చేయాలని పలువురు మంత్రులు అధికారులకు సూచించారు. ఎల్‌నినో సాధారణ పరిస్థితి కాదని, ముఖ్యంగా అక్టోబరు, నవంబరు నెలల్లో పంటలు చేతికొచ్చే సమయంలో నీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని టిజిఐఆర్‌డిలో ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు విబి-జి రామ్ జి సమీకృత వ్యవసాయ కుంటల పాత్రపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగే శ్వరరావు, పంచాయతీరాజ్, గ్రామీ ణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, సీఎస్ సంజయ్ జాజు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ ఒడ్డి, వ్యవసాయం, పశు సంవర్ధక, పంచాయతీరాజ్ శాఖల సెక్రటరీలు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లా డుతూ, ఈ విధంగా అన్ని శాఖల అధికారులు సమన్వ యంతో సమావేశం ఏర్పాటు చేయడం హర్షనీయమని అన్నారు. ప్రస్తుతం భూగర్భ జలాలు పెరిగే స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదని, ప్రధాన జలాశయాల్లోకి కూడా ఆశించిన స్థాయిలో నీరు చేరలేదని మంత్రి తెలిపారు. రాబోయే రోజుల్లో అందుబాటులో ఉండే భూగర్భ జలాలపై రోజువారీగా అంచనాలు రూపొందించి, వాటిని జాగ్రత్తగా వినియోగించేలా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆటో స్టార్టర్లతో రేయింబవళ్లు మోటార్లు నడిపి భూగర్భ జలాలను వృథా చేయకుండా, పంటకు అవసరమైన మేరకే నీటిని వినియోగించేలా చర్యలు



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రులు మంత్రి సీతక్క, వాకిటి శ్రీహరి, తుమ్మల నాగేశ్వరరావు

తీసుకోవాలన్నారు. వర్షపు నీటిని గరిష్ఠంగా నిల్వ చేసుకునేలా రాష్ట్రంలోని 44 వేల చెరువులను సంరక్షి ంచాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. చెరువుల్లోకి వర్షపు నీటిని మళ్లించేలా చర్యలు చేపట్టి, వాటిలో నీటిని నిల్వ చేస్తే చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగి బోర్లు పనిచేసే అవకాశం ఉంటుందన్నారు. వాగులు, నదుల్లో అవసరమైన ప్రాంతాల్లో ట్రెంచ్‌లు, రాక్‌ఫిల్ డ్యామ్‌లు ఏర్పాటు చేయడం ద్వారా నీటిని భూగర్భంలోకి ఇంకేలా చేసి భూగర్భ జలాల నిల్వ సామర్థ్యాన్ని పెంచవచ్చన్నారు. ఎల్‌నినో వంటి ప్రకృతి వైపరీత్యాలను సవాలుగా కాకుండా అవకాశంగా మలచుకోవాలని మంత్రి అన్నారు. కొత్త సాంకేతికత కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదని, గతంలో మన తాతలు, తండ్రులు అనుసరించిన నీటి సంరక్షణ పద్ధతులను తిరిగి ఆచరణలోకి తీసుకురావాలని సూచించారు. వ్యవసాయం, పశుసంవర్ధక, మత్స్య, అటవీ, పంచాయతీరాజ్, నీటి పారుదల తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తే ఎలాంటి విపత్కర పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కో వచ్చన్నారు. జిల్లా స్థాయిలో అధికారులు ప్రతిరోజూ సమన్వయ సమావేశాలు నిర్వహించి తమ జిల్లాలో చేపట్టాల్సిన చర్యలపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకోవాలని మంత్రి సూచించారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లా డుతూ.. గతంలో కూడా దేశంలో ఎల్ నినో ప్రభావాలు వచ్చాయి. 1951 నుంచి నేటి వరకు 12సార్లు ఎల్ నినోను దేశం ఎదుర్కొంది. కరువును ఎలా ఎదుర్కోవాలనే అవగాహన రైతులకు ఉంటుంది కానీ ఆ అవగాహనను ఆచరించేలా చేసే బాధ్యత మనది. పంటల మార్పిడి ద్వారా వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకురావచ్చనే విషయంలో రైతులకు సలహాలు ఇవ్వాలి. ఆస్ట్రేలియా వంటి దేశాలు ముందస్తు కార్యాచరణ ద్వారా ఎల్‌నినోను సమర్థవంతంగా అధిగమించింది. కరవు పరిస్థితుల్లో పశువుల పెంపకం, సంరక్షణ వంటి

## సిఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనను రాజకీయ కక్షతో అడ్డుకొన్న కేంద్రం

### కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సమాధానం చెప్పాలి : మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్, ఆగస్టు 21,ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు రాజకీయ కక్షతో కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించి అడ్డుకొందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఒక ప్రకటనలో ఆరోపించారు. బిజెపి ఎంపిలు రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్‌లు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. సిఎం అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణపై కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన, దళిత, మైనార్టీ వర్గాల పిల్లలకు ప్రపంచస్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి అమెరికా పర్యటనకు వెళ్లాలని నిర్ణయించుకున్నారని మంత్రి తెలిపారు. తెలంగాణకు ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాలను తీసుకురావడం, విద్యారంగంలో పెట్టుబడులు, అత్యుత్తమ విద్యాసంస్థల భాగస్వామ్యాలను రాష్ట్రానికి తీసుకురావడం వంటి అంశాలపై చర్చించాలన్నది సిఎం లక్ష్యమని పేర్కొ న్నారు. అమెరికా పర్యటనకు సంబంధించిన అన్ని వివరాలను ప్రభుత్వం ముందుగానే కేంద్ర ప్రభుత్వానికి అధికారికంగా పంపించినప్పటికీ, రాజ కీయ కారణాలతో అనుమతి నిరాకరించడం దురదృష్టకరమని పేర్కొన్నారు.

## ముఖ్యమంత్రి లండన్ టూర్ రాజకీయం చేయడం బిజెపికి తగదు

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లండన్‌లో విద్యా సంస్థలు, క్రీడా సంస్థలను సందర్శించినా ఓర్చుకోలేకపోతున్నారు తెలంగాణ బిజెపి నాయకులకు మెదడు పనిచేయడం లేదనీ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. సిఎల్‌పి కార్యాలయంలో శుక్రవారం విలేఖరులతో మాట్లాడుతూ యూనివర్సిటీలకు వెళ్లి అక్కడి విద్యా ప్రమాణాలను పరిశీలిస్తే బిజెపి నాయకులకు ఎందుకు నొప్పి..?భారత వ్యతిరేక శక్తులను కలవడానికి వెళ్లాడని ఎంపీ ధర్మపురి అర్వింద్ పిచ్చిలేసినట్లు మాట్లాడుతున్నాడనీ విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారికంగా పర్యటిస్తున్నారనీ ఆయన బ్రిటన్ పర్యటనకు కేంద్ర ప్రభుత్వ అనుమతి కూడా ఉందనీ గుర్తుచేశారు. ఈ విషయం అర్వింద్‌కు తెలియదా..?తెలిసి కూడా అతితెలివి ప్రదర్శిస్తూ నోటికొచ్చినట్లు అర్వింద్ మాట్లాడుతున్నాడనీ ఆవేదన చెందారు..2014లో బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు ప్రధాని మోదీ 103 విదేశీ పర్యటనలు చేసి 82 దేశాలకు వెళ్లారు..?ఆయన ఎందుకోసం వెళ్లారు..? ఆయన కూడా పనిలేక తిరుగుతున్నాడా..? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి అధికారం చేపట్టిన తర్వాత మూడేళ్లలో రెండు సార్లు దావోస్‌కు, ఒకసారి అమెరికా, దక్షిణ కొరియాకు మాత్రమే వెళ్లారనీ విదేశీ పర్యటనల చిట్టాను వివరించారు. అయినా కూడా బిజెపి నాయకులు సిఎం పర్యటనపై ఏడవటం అంటే అంతకు మించిన దిగజారుడుతనం ఇంకొకటి లేదనీ ఆగ్రహం వ్యక్తంచేశారు.

# రైసుమిల్లర్లపై కమెండో ఆపరేషన్‌కు శ్రీకారం

### అక్రమార్కుల కట్టడికి దిశానిర్దేశం చేసిన కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

**హైదరాబాద్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** రాష్ట్ర పౌర సరఫరాల వ్యవస్థను కాపాడేందుకు తెలంగాణ సివిల్ సప్లైస్ శాఖ అక్రమాలకు పాల్పడిన రైసుమిల్లర్లపై కమెండో ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టడానికి కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వానికి బియ్యం ఇవ్వకుండా బకాయి పడ్డ మిల్లర్లపై ఉక్కుపాదం మోపేందుకు, తమ ఎన్ఫోర్స్మెంట్, విజిలెన్స్ విభాగంలో గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాలకు చెందిన 28 మంది అత్యుత్తమ కమాండోలను నియమించింది .సివిల్ సప్లైస్ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర, ఐపీఎస్ శుక్రవారం ఉదయం సివిల్ సప్లైస్ భవన్‌లో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. కొత్తగా విధుల్లో చేరిన కమాండోలకు స్వాగతం పలికి, వారి బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. ఈ పోలీసులకు పౌర సరఫరాల వ్యవస్థ కొత్త కావడంతో, శాఖ నియమ నిబంధనలపై వారికి ఇప్పటికే మూడు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

నిత్యావసర వస్తువులకు సంబంధించిన చట్టపరమైన అంశాలపై తెలంగాణ పోలీస్ అకాడమీలో వీరికి అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ శాఖ పనితీరును, విస్తృతిని వివరించారు. ముఖ్యంగా గత సీజన్‌లో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో 154 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను సేకరించామని గుర్తుచేశారు. రైతులను ఆదుకునేందుకు వడ్ల కొనుగోలు కోసం రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ. 40,000 కోట్లు ఖర్చు చేసిందని ఆయన తెలిపారు.

ఆకస్మిక తనిఖీలు చేయడంలో ఈ పోలీసులకు ఉన్న ప్రత్యేక శిక్షణను సివిల్ సప్లైస్ శాఖ ఇకపై వాడుకోనుంది. వీరంతా ఎన్‌ఫోర్స్‌మెంట్ మరియు విజిలెన్స్ విభాగం కింద ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలుగా పనిచేస్తారు. బకాయి ఉన్న మిల్లర్ల వద్ద క్షేత్ర స్థాయిలో ముమ్మర తనిఖీలు చేయడానికి వీరు వెంటనే రాష్ట్రవ్యాప్తంగా రంగంలోకి దిగనున్నారు. ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టించినా, నిబంధనలు ఉల్లంఘించినా ఏమాత్రం ఉపేక్షించేది లేదని కమిషనర్ కఠినంగా హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించిన ఏ మిల్లర్ పైన అయినా వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## వెటర్నరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా ఎంవి రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 21, ప్రభాతవార్త :** వెటర్నరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (విఎఐ) తన తెలంగాణ రాష్ట్ర విభాగాన్ని (విఎఐ టిజి) ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. పశువైద్యుల సంక్షేమం, జంతు సంరక్షణ, వృత్తిపరమైన అభివృద్ధికి చర్యలు చేపట్టనుంది. విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎం.వి. రెడ్డి రాష్ట్ర అధ్యక్షుడిగా, డాక్టర్ సురేష్ పోతాని అసోసియేట్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ప్రొఫెసర్ (డాక్టర్) ఎం. కిషన్ కుమార్, డాక్టర్ కె. సింహారావు ఉపాధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. ప్రొఫెసర్ (డాక్టర్) డి. సకారామ కోశాధికారిగా, డాక్టర్ పులికంటి రాధాకృష్ణ కార్యదర్శిగా నియమితులయ్యారు.

## విద్యుత్ రంగంలో పురోగతి

### విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్‌మిట్టల్

**హైదరాబాద్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** విద్యుత్ రంగంలో వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంలో గణనీయమైన పురోగతి సాధిస్తున్నామని విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్‌మిట్టల్ అన్నారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ సాంకేతికతతో మెరుగైన సేవలు, పారదర్శకతతో పరిపాలన, డేటా విశ్లేషణతో సరైన నిర్ణయాలు, వేగవంతమైన పరిష్కారం దిశగా మరింత ముందు కెళ్లాలన్నారు. విద్యుత్ సేవలను మరింత సులభంగా, వేగంగా, పారదర్శకంగా అందించేందుకు వాట్సాప్ చాట్‌బాట్ మంచి స్పందన లభిస్తోందని చెప్పారు. రెవెన్యూ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్ చౌర్యం, తక్కువ బిల్లింగ్, అదనపు లోడ్ తదితర లోపాలను గుర్తించేందుకు డీపీఈ శాఖ ఆధ్వర్యంలో విశ్లేషణ ప్రక్రియను కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి వరుణ్‌రెడ్డి ప్రధాన అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. డిజిటల్ సేవలలో భాగంగా ఫిర్యాదుల పరిష్కారంలోనూ మెరుగైన పనితీరు ఉందన్నారు. అలాగే ఉద్యోగుల సేవలకు ఎంప్లాయ్ సపోర్ట్ బాట్‌ను కూడా అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. తద్వారా ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో వ్యవస్థ పారదర్శకత, ట్రాకింగ్, బాధ్యతను పెంచుతోందని పేర్కొన్నారు. ఉద్యోగుల శాఖల వారిగా ఏర్పడిన సమస్యలు వెనువెంటనే తీర్చడానికి ఎంతగానో ఉపయోగకరంగా మారిందని తెలిపారు.

## ఆసియా ఛాంపియన్‌షిప్‌కు ఎంపికైన కరాటే క్రీడాకారులకు పిసిసి చీఫ్ అభినందనలు

**హైదరాబాద్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** ప్రతిష్ఠాత్మక 2026 ఎకెఫ్ క్యాడెట్, జూనియర్ యు-21 ఆసియా కరాటే ఛాంపియన్‌షిప్‌కు తెలంగాణకు చెందిన నలుగురు కరాటే క్రీడాకారులు ఎంపికయ్యారు. తెలంగాణ స్పోర్ట్స్ కరాటే -దూ అసోసియేషన్ అధ్యక్షులు, టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ క్రీడాకారులను శుక్రవారం ఎమ్మెల్యే క్వార్టర్స్ లో సన్మానించి అభినందించారు. జోర్డాన్‌లోని అమ్మాన్‌లో సెప్టెంబర్ 4 నుంచి 11 వరకు జరిగే ఈ ఛాంపియన్‌షిప్‌లో విషాల్ రెడ్డి అమ్రాడి (61 కేజీ), సత్య తేజ బ్రహ్మాండాని (+66 కేజీ), నిష్ఠ గంగిసెట్టి (61 కేజీ), శశాంక్ సాత్విక్ లంకె (52 కేజీ) తెలంగాణ తరఫున పోటీపడనున్నారు.

ఆసియా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి తెలంగాణకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలని మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షించారు. క్రీడాకారుల తల్లిదండ్రులు, కోచ్‌లను కూడా ఆయన అభినందించారు.

ఈ కార్యక్రమంలో ఇండియన్ హెడ్ కోచ్, కెఐఒ జాయింట్ సెక్రటరీ కీర్తన్, కరాటే స్టేట్ జనరల్ సెక్రటరీ మల్యాల రామస్వామి, జాయింట్ సెక్రటరీ వెంకటేష్, కోచ్ నరేష్, ఎం. రాజు తదితరులు పాల్గొన్నారు.

# అవకాశాల కల్పన, కొలువుల గనులుగా ఎటిసిలు

### యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి పాలిటెక్నిక్ కళాశాలలు

### పరిశ్రమల అనుసంధానంతో విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు: సిఎం కార్యాలయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు21:** కృత్రిమ మేధ (ఎఐ) సాం కేతిక పరిజ్ఞానాన్ని శాసిస్తున్న కాలంలో పురాతన కోర్సులతో ఉపాధి అవకా శాలు లభించడం కష్టం. ఈ నేపథ్యంలో యువతకు మంచి ఉపాధి అవకా శాలు సృష్టించాలనే సంకల్పంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని (వైఐఎస్‌యు) ముఖ్య మంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నెలకొల్పారు. ఆధునిక పరిశ్రమలకు కావల్సిన నైపుణ్యాలను అందించే కోర్సుల రూపకల్పన, ఆధునిక పారిశ్రామిక శిక్షణలతో సిఎం మార్గదర్శనంలో ఏర్పడిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఎటిసి) ఇప్పటికే కొలువుల గనులుగా మారాయి. పాలిటెక్నిక్ కోర్సులను సైతం ఆధునిక అవసరాలకు తగినట్లు రూపకల్పన చేయాలనే లక్ష్యంతో వాటిని వైఐఎస్‌యు పరిధి లోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వానికి మంచి పేరు వస్తుండడంతో, ప్రతిపక్ష నాయకులు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం పలు కుట్రలకు తెరలేపారని సిఎం రేవంత్‌రెడ్డి కార్యాలయం ఆరోపించింది. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. విద్యార్థులు, బోధనా సిబ్బంది నష్టపోతారనే అపో హలు సృష్టించి గందరగోళానికి తెరలేపుతున్నారు. భవిష్యత్‌లోనూ ఉపాధి అవకాశాలు దక్కాలంటే స్పేస్, ఏరోనాటికల్, డాటా సెంటర్ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, బ్యాంకింగ్, ఫైనాన్సియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్, మెడికల్ కోడింగ్+ సాఫ్ట్ స్కిల్స్, డాటా ఎనలిటిక్స్, ఫినిషింగ్ స్కిల్స్ ఫర్ నర్సింగ్ ఎక్స్‌లెన్స్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్, తయారీ రంగంలో ఆటోమేషన్ వంటి నూతన కోర్సుల్లో ప్రావీణ్యం తప్పనిసరి. వీటిలోనూ ఎప్పటికప్పుడు అప్‌డేట్ ఉంటేనే మనుగడ సాధ్యమవుతుంది. ఆధునిక పరిశ్రమలు నిపుణులకే పెద్ద పీట వేస్తున్నాయి. పాలిటెక్నిక్‌లను పరిశ్రమలతో భాగస్వామ్యం నెల కొల్పేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించింది. తెలంగాణ విద్యార్థులకు బంగారు భవిత ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికాయుతంగా ముందుకు సాగుతోంది. అదే సమయంలో సమూలమైన మార్పులు చేపట్టడం లేదు. పాలిటెక్నిక్‌ల్లో ప్రస్తుతం అమల్లో ఉన్న డిప్లొమా విద్యా హోదాలో ఎలాంటి మార్పు చేయడం లేదు. ఎఐసిటిఈ నిబంధనలు, పాఠ్యాంశాలు, విద్యా ప్రమాణాలు, పరీక్షలు, సర్టిఫికెట్ల జారీ విధానం యథాతథంగా ఉంటుంది. డిప్లొమా కోర్సును స్వల్పకాలిక నైపుణ్య శిక్షణగా మార్చే యోచన ప్రభుత్వానికి లేదు.

పాలిటెక్నిక్ కళాశాలలు వైఐఎస్‌యు పరిధిలోకి వెళ్లినా, ఆ కళాశాలలకు చెందిన భూములు, భవనాలు, ప్రయోగశాలలు, ఇతర మౌలిక వసతులు పూర్తిగా ప్రభుత్వం ఆధీనంలోని శక్తి శాఖ పరిధిలోనే ఉంటాయి. పాలిటెక్నిక్ కాలేజీల్లో పని చేస్తున్న లెక్చరర్లు, ఇతర ఉద్యోగుల సర్వీస్ రూల్స్, క్యాడర్, వారికి లభించాల్సిన ప్రమోషన్లు, బదలీలు ఇలా అన్నింటికీ పూర్తిస్థాయి రక్షణ ఉంటుంది. వారంతా ప్రభుత్వ ఉద్యోగులుగానే ఉంటారు. జీవో 97 ద్వారా ప్రభుత్వ పాలిటెక్నిక్‌లను రద్దు చేయడం.. ప్రైవేటీకరించడం, వాటి విద్యా స్వరూ పాన్ని మారుస్తున్నారనే ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదు. అవన్నీ ఉద్దేశ్యపూర్వకంగా సృష్టిస్తున్న అపోహలే. దశాబ్దాలుగా ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు అందిస్తున్న సాంకేతిక విద్యను మరింత బలోపేతం చేయడం కోసమే ప్రభుత్వం మార్పులకు శ్రీకారం చుట్టింది. పరిశ్రమలతో బలమైన అనుసంధానం, విద్యార్థులకు మెరుగైన నైపుణ్యాలు-ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ సంస్కరణల ప్రధాన లక్ష్యం. మారుతున్న మార్కెట్ అవసరాలకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దడమే లక్ష్యంతో పాలిటెక్నిక్ లను సైతం ఏటీసీల తరహాలో తీర్చిదిద్దనున్నారు. తాజా మార్పుతో ఇక ముందు పాలిటెక్నిక్ విద్యార్థులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన శిక్షణ పొంది అగ్రగామి సంస్థల్లో ఉద్యోగాలు పొందనున్నారు. అలాకాకుండా ఉన్నత విద్యకు వెళ్లాలనుకున్న వారికి ఎప్పటిలాగే ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి వెసులుబాటు ఉందని సిఎం

## రుణమాఫీపై రెండు వారాల్లో నిర్ణయించాలి

### సర్కార్‌కు హైకోర్టు ఆదేశాలు

**హైదరాబాద్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** ఫిర్యాదుదారులైన రైతులకు రుణ మాఫీ చేసే విషయమై రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ పథకం కింద తమకు ప్రయోజనం కల్పించాలంటూ కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం చెంజర్ల గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తమకు రుణమాఫీ పథకం కింద ప్రయోజనం కల్పించాలని కోరుతూ వారు జూలై 7న సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. అయితే వాటిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. ఒక రైతుకు రూ.2,00,778 వ్యవసాయ రుణం ఉండగా, రెండో రైతుకు రూ.2,04,555 రుణం ఉన్నట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. అర్హతలు ఉన్నప్పటికీ తమ పేర్లను రుణమాఫీ జాబితాలో చేర్చలేదని కోర్టు దృష్టికి తెచ్చారు. పిటిషనర్లు చివరిసారిగా గత జూలై 7న సమర్పించిన వినతిని సంబంధిత అధికారులు పరిశీలించి చట్టప్రకారం నిర్ణయం తీసుకునేలా ఉత్తర్వులు ఇవ్వాలని వారి తరఫు న్యాయవాది కోరారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఇటీవల ఆదేశించినట్లు సంబంధిత రైతులు తెలిపారు. అధికారులు తీసుకునే నిర్ణయాన్ని రెండు వారాల్లోగా పిటిషనర్లకు తెలియజేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ సూరేపల్లి నంద తీర్పు వెలువరించారు. పిటిషనర్లు తమ వినతిలో పేర్కొన్న రుణమాఫీ ప్రయోజనాలపై ఉన్న ఫిర్యాదును ప్రతివాదులైన ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా కలెక్టర్ ఇతరులు పరిశీలించి, చట్టానికి అనుగుణంగా తగిన ఉత్తర్వులు జారీ చేయాలని హైకోర్టు ఈ నెల 13న తీర్పు చెప్పింది. ఈ ఉత్తర్వు కాపీ అందిన తేదీ నుంచి రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకొని, ఆ నిర్ణయాన్ని పిటిషనర్లకు తెలియజేయాలని స్పష్టం చేసింది.



మాసబ్‌ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

## శక్తితో పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇబ్బంది ఉండదు: మంత్రి వివేక్

**హైదరాబాద్ (మెహిదీపట్నం), ఆగస్టు 21, ప్రభాతవార్త :** శక్తితో పాలిటెక్నిక్ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, వారి అభివృద్ధి కోసమే తెలంగాణ ప్రభుత్వం శక్తిని తీసుకురావడం జరిగిందని కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం శక్తిపాలసీని అమలు చేయడం ద్వారా పాలిటెక్నిక్ విద్యార్థులు ఇంజనీరింగ్ కళాశాలలో నేరుగా ప్రవేశాలు పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీ పరిధిలోని ప్రతిపాదిత శక్తి శాఖ పరిధిలోకి తీసుకురావాలనే ఆలోచనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ గత వారం రోజులుగా మాసబ్ ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు నిరసన చేపడుతున్నారు. దీంతో శుక్రవారం మంత్రి వివేక్ పాలిటెక్నిక్ విద్యార్థులతో భేటీ అయి శక్తితో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని భరోసా కల్పించారు. అనంతరం మంత్రి వివేక్ మాట్లాడుతూ... పాలిటెక్నిక్ విద్యా విధానాన్ని ప్రతిపాదిత శక్తి శాఖ పరిధిలోకి తీసుకురావడం వలన రూ.600 కోట్ల నిధులు వస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం పాలిటెక్నిక్ విద్యార్థులకు అండగా ఉంటుందన్నారు. ఈసెట్ ఎగ్జామ్ యధావిధిగా ఉంటుందని, లాటరల్ ఎంట్రీ కొనసాగుతుందని, శక్తితో ఫీజులు పెరగవని, ఇంజనీరింగ్ కళాశాలలో నేరుగా ప్రవేశాలు పొందే అవకాశం ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం శక్తిపై జారీ చేసిన జీవో ను పూర్తిగా ఉపసం హరించుకునే వరకు విద్యార్థుల పోరాటం కొనసాగుతుందని ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు ఎన్.నాగరాజు అన్నారు.

## సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 108

**హైదరాబాద్ (బేగంపేట) ఆగస్టు 21, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన 249వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో 108 దరఖాస్తులు అందాయి. వీటిలో రెవెన్యూ శాఖకు 21 దరఖాస్తులు, బీసీ సంక్షేమ శాఖ కు 18దరఖాస్తులు, హోంశాఖకు 18, ఇతర శాఖలకు 51 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణి ఇంచార్జ్ డా.జి. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కె.విద్యాసాగర్ దరఖాస్తులు స్వీకరించి ఎండార్స్‌మెంట్ చేసి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏసీపీ ఉమేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కొండా సురేఖను మంత్రిమండలి నుంచి బర్తరఫ్ చేయండి

### సిఎం ప్రతిష్టను ఎవరైనా దిగజార్చే ప్రయత్నం చేస్తే సహించం.. క్షమించం

### రాజగోపాల్‌రెడ్డి, చిన్నారెడ్డిని వదిలేసి కొండా సురేఖపైనే మాట్లాడటం లేదు

### సిఎల్‌పి కార్యాలయంలో 19 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

**హైదరాబాద్, ఆగస్టు 21,ప్రభాతవార్త:** కొండా సురేఖ కూతురు సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు తెలంగాణ సమాజాన్ని తీవ్రక్షోభకు గురి చేశాయని కొండా సురేఖను వెంటనే మంత్రిమండలి నుంచి బర్తరఫ్ చేయాలని తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. సిఎల్‌పి కార్యాలయంలో ప్రభుత్వవిప్ బల్మూరి వెంకట్, బీర్లఐలయ్య, వేముల వీరేశం, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, వంశీకృష్ణారెడ్డి, రాజేష్‌రెడ్డి, మధు సూదన్‌రెడ్డి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జయ్ వీర్‌రెడ్డి మనోహర్‌రెడ్డి, నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, బస్వరాజ్ సారయ్య, బాలునాయక్, మందుల సామెల్, వీర్లపల్లి శంకర్ వెడ్మ బొజ్జు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టను ఎవరైనా దిగ జార్చే ప్రయత్నం చేస్తే సహించం, క్షమించం, మేం దమ్ము, ధైర్యం ఉన్న ఎమ్మెల్యేలం కాంగ్రెస్ పార్టీని బలో పేతం చేస్తామనీ హెచ్చరించారు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరూ వెళ్లినా చర్యలు తీసుకోవాల్సిందే పార్టీ కార్యకర్తలను కాపాడుకోవాలి అన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చిన్నారెడ్డి వ్యాఖ్యలు పార్టీకి నష్టం కలిగించేలా ఉన్నాయి. మంత్రి కొండ సురేఖ ఆమె కుటుంబం వల్ల కూడా పార్టీ అనేకసార్లు ఇబ్బం దుల్లో పడ్డదని వారు గుర్తుచేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ కులం, మతం అడ్డంపెట్టుకొని క్రశిక్షణ ఉల్లంఘిస్తమంటే చెల్లదని మీ కూతురు వ్యాఖ్యలకు మీకు సంబంధంలేకపోతే వెంటనే రాజీనామాచేయాలని డిమాండ్ చేశారు. బిజెపి బిఆర్‌ఎస్ పార్టీలు వెనక ఉండటంతో ఒకటి రెండు గుంట నక్కలు కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తల రక్తం తాగుతామంటే ఒప్పుకోమని హెచ్చరించారు. ముగ్గురు, నలుగురు వాళ్ల పదవులు, స్వార్థం కోసం రోడ్లపైన పడి ముఖ్యమంత్రిని టార్గెట్ చేసి ప్రతిపక్షాలకు అస్త్రాలు అందించడం మంచిది కాదని హితవు చెప్పారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ రాజగోపాల్ రెడ్డి, చిన్నారెడ్డిని వదిలేసి కొండా సురేఖపై మాత్రమే మాట్లాడటం లేదు అని వారిని కూడా వైఖరి మార్చుకోవాలని వారిపై కూడా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నామని తెలిపారు. కొండా సుస్మిత అనే పిల్లకాకి మాట్లాడిన మాటలు ఆమెవి కాదు ఆమెతో కొండా సురేఖ మాట్లాడించారని అనుకుంటున్నామని అన్నారు. గతంలో కూడా ముఖ్యమంత్రి పైన విమర్శలు చేశారనీ అంతకుముందు సినిమా హీరోలపై నోటికొచ్చినట్లు మాట్లాడారనీ. ప్రస్తుతం సీనియర్ నేత రేవూరిపై ఇష్టానుసారంగా మాట్లాడారనీ ఆవేదన చెందారు. కొండా సురేఖ దాటవేసే ధోరణిలో ఉన్నారనీ ఎందుకు తన కూతురిపై స్పందించడం లేదు? అని ప్రశ్నించారు. మందుల సామెల్ మాట్లాడుతూ రాజగోపాల్ రెడ్డి, చిన్నారెడ్డి మాటలు కూడా కరెక్ట్ కాదనీ సీనియర్లు రోడ్లపైకి వచ్చి మాట్లాడితే జూనియర్లు ఏం నేర్చుకుంటున్నారు? కాంగ్రెస్‌ను ఖతం చేసే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ తన మంత్రిత్వ శాఖలపై సమీక్షలు చేయాలి. బిడ్డ అడ్డగోలుగా మాట్లాడితే మందలించకుండా నా తప్పిదం కాదని చెబుతుండటం సరికాదని అన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే, వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టను కాపాడుకునే బాధ్యత అందరిపైనా ఉంది. అందరు సీనియర్ నేతలను ఏకం చేసి రాక్షస పాలనను సిఎం రేవంత్ రెడ్డి అంతం చేశారు. ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న వాళ్ల కూతురు పార్టీని, ముఖ్యమంత్రిని ఇబ్బందిపెట్టేలా మాట్లాడుతూ కొందరు నీతిమాటలు, అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారనీ ఆవేదన చెందారు. ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ పార్టీ కంటే నేనే పెద్ద అని జగిత్యాలలో సీనియర్ నేత జీవన్ రెడ్డి ఇలాగే వ్యవహరించారనీ ఆయననే పార్టీ వదులుకొందని వివరించారు. కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ పార్టీ. అన్ని కులాలు, మతాల ఎమ్మెల్యేలం కలిసి ఉన్నామనీ వ్యక్తిగత విభేదాలు ఉంటే అధిష్ఠానానికి ఫిర్యాదు చేయొచ్చు అని సలహా ఇచ్చారు. పార్టీ కంటే పెద్ద మా వల్లనే కాంగ్రెస్ గెలిచిందని అనుకుంటే సహించం అని అన్నారు. పార్టీ కంటే మేం పెద్ద అనుకునే వాళ్లు పార్టీని వదిలిపెట్టి వెళ్లిపోవచ్చు అంటూ సలహా ఇచ్చారు. ప్రకాశ్ రెడ్డి ని రాజీనామా చేయమని అడగడం కంటే వాళ్ల అమ్మను రాజీనామా చేయమని అడగాల్సి ఉండాల్సిందని విలేఖరుల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు అభిప్రాయపడ్డారు. అధిష్ఠానం చర్యలు తీసుకోవాల్సిందే లేకపోతే పార్టీకి నష్టం జరుగుతుందనీ వారు ముక్తకంఠంతో తెలిపారు. రాజగోపాల్ రెడ్డి, చిన్నారెడ్డి, కొండా సురేఖఎవరైనా చర్యలు తీసుకోవాలి. చేయి గుర్తుకు అన్యాయం చేసే వాళ్లను బర్తరఫ్ చేయాల్సిందే అని వారు కోరారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు పార్టీకి నష్టం కలిగించేలా ఉన్నాయనీ కూడా ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య రాహుల్‌గాంధీని ప్రధానమంత్రి చేసేవరకు అందరం కలిసి ఉండాలని పిలుపునిచ్చారు.